తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక


SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 10
March - 2025, Price Rs.20/-.

మార్చి 2025
వెల రూ. 20/-
పుటలు - 56




## తిరుమల శ్రీవారి ఉగాది ఆస్థానం


(30-03-2025)



04-02-2025న తిరుమలలో జరిగిన
'రథసప్తమి' దృశ్యమాలిక



2025 సం॥ జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగిన ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్ మహాకుంభమేళలో
తిరుమల శ్రీవారి నమూన ఆలయంలో జరిగిన కైంకర్యాలలో పాల్గొన్న
తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు దంపతులు మరియు తదితరులు



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్।**
**తథాపి త్వం మహాబాహో! నైవం శోచితుమర్హసి ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-26వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** మహాబాహో= గొప్ప బాహువులు కల ఓ అర్జునా!; అథ, చ= కాని ఒకవేళ; త్వమ్= నీవు; ఏనమ్= దీనిని (ఈ ఆత్మను); నిత్యజాతమ్= సర్వదా జన్మించునట్టిది; వా= అట్లే; నిత్యమ్= సతతము; మృతమ్= మరణించునట్టిది; మన్యసే= (అని) భావించినచో; తథాపి= అట్లైనను; ఏవమ్= ఈ విధముగా; శోచితుమ్= శోకించుటకు; న, అర్హసి= అర్హుడవుకావు (శోకించుట తగదు).

**భావం:** ఓ అర్జునా! ఈ ఆత్మకు జననమరణములు కలవని ఒకవేళ నీవు భావించినప్పటికిని దీనికై నీవు శోకింపదగదు.

## నీ వొక్కడివే లోకములకు దైవము


కింకదీర 'సదైవం కేశవాత్పర'మని
ఉంకువైవనాలో నీవుపమ లివే

కంటి నీవొక్కడవే లోకములకు దైవమని
వొంటి మఱి నిన్నుఁబోల నొకరిఁ గాన
వింటి నీవే ఘనమని వేదాంతమందు నీ-
కంటె నితరము వినఁ గరుణానిధీ

తోఁచె నాకు నీసేవే తుదిపదమని; మఱి
తోఁచ దీబుద్ధికి; సరితూఁగ దెందును
పూఁచి నాగురుఁడు నిన్నే బోధించేగాని మఱి
దాఁచఁడాయ నీమహిమ ధరణీధరా

సమ్మతించె నామతిఁ జవియైనా (నీ?) కథలె
సమ్మతించ దెక్కడోరచ్చలసుద్దులు
నమ్మిక శ్రీవేంకటేశ నంటున నీపాదాలే
నమ్మితి నేమియు నమ్మ నారాయణా

అన్నమయ్య సంకీర్తన- సంపుటం-01;
సంకీర్తన-395



కమలం నాభియందుగల దేవా! లోకాలన్నింటికీ ప్రభుడవు నీ వొకడవే యని ప్రఖ్యాతి చెందినావు. నీవంటివాడు మరొకడు కనిపించడు. నీవు ఘనుడవని వేదాంతాలవల్ల విన్నాను. నిన్నుదప్ప మరెవరినీ వినలేదు. నీ సేవయే పరమపదమని తోస్తున్నది. నా ఆత్మకు వేరే తోచడం లేదు. మరేదియు నీకు సాటిరాదు. చక్రం చేతగలవాడా! నాగురువు పూనికతో నిన్నుగూర్చి బోధించినాడు. నీ మహిమలు అతడు దాచలేదు. నా మనస్సు రుచులూరించే నీకథలే కోరుతున్నది గాని రచ్చ మాటలు వినడానికి ఇచ్చగించదు. వేంకటాద్రిలో నివసించే ఓ శ్రీహరీ! నీ పాదపద్మాలు తప్ప మరి దేనినీ నమ్మను.

(వ్యాఖ్యాత- కీ.శే. విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు)

ఉపనిషద్వాక్యం


# ‘నేను కేవలం చైతన్యం’

**‘అహం చైతన్యయేవ హి॥’ (యజుర్వేదం)**

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఇది కృష్ణయజుర్వేదాంతర్గతంగా చెప్పబడుతున్న ‘తేజబిందూపనిషత్తు’లోని వాక్యం. ఉపనిషత్తులన్నీ తేల్చిచెప్పిన పరమ సత్యం. దీనిని జాగ్రత్తగా పరిశీలిస్తే ‘నేనే’మిటో తేలుతుంది.

‘నేను’ అనుకోగానే మనకి స్ఫురించేది మన దేహం, నామం, వీటితో ముడిపడి ఉన్న బంధాలు. ‘నేను ఫలానా రంగువాడిని– ఫలానా పేరున్నవాడిని. నేను పేదను. నేను రాజును. నేను ఫలానా పదవిగలవాడిని’. ఇలా ‘నేను’ అనే మాటని అనేకవిశేషణాలతో కలిపి వ్యవహరిస్తుంటాం.



ఇంద్రియాలలో ప్రసరించే చైతన్యం మెలకువలోనే తెలుస్తోంది. కలలో ఇంద్రియచైతన్యం నిద్రాణమై మనోరూపంగా స్ఫురిస్తుంది. గాఢనిద్రలో ఈ రెండూ నిద్రాణమై అణగి ఉంటాయి. కానీ తిరిగి మేల్కొన్నాక ‘నేను గాఢనిద్ర పోయాను’ అనగలుగుతున్నాం. అంటే మెలకువకీ, కలకీ, గాఢనిద్రకీ అతీతంగా ‘నేను’ అనే చైతన్యం ఉన్నది. అది అన్ని అవస్థలకీ, బంధాలకీ అతీతం.

‘నేను’ అనే స్ఫురణ ఏ చైతన్యంవల్ల కలుగుతున్నదో గమనించాలి. ఆ గమనింపే ధ్యానం, అంతర్ముఖప్రయాణం. అది సాగితే విద్యుత్పరికరాల్లో విద్యుత్తులా– దేహ, మనః, ప్రాణాలలో ప్రసరించే చైతన్యం వీటిలో ఉంటూనే వీటికి అతీతంగా ఉందని తెలుస్తుంది. పరికరాలను పనిచేయించే విద్యుత్తు, పరికరాల కన్నా అతీతంగా ఉందికదా!

ఈ చైతన్యం ‘నేను’గా స్ఫురించి, ఆ ‘నేను’ దేనితో సంబంధం కలిగితే ‘దాని’గా తోచబడుతోంది. స్ఫటికాన్ని ఏ రంగువస్తువు దగ్గరపెడితే ఆ రంగుగా తోచినట్లు. కానీ స్ఫటికానికి ఏ రంగూ లేదు.

ఈ చైతన్యం దోమను మొదలుకొని ఏనుగు వరకు, గడ్డిపరకను మొదలుకొని బ్రహ్మదేవుని వరకు ఒక్కటే. ఉపాధి భేదాల బట్టి రకరకాలుగా వ్యక్తమవుతున్నా చైతన్యం ఏకమే. దీనిని గ్రహించినప్పుడు, దీనితో తాదాత్మ్యం చెందినప్పుడు లోకవ్యవహారాలు నిర్వహిస్తున్నా దేనికీ అంటుకోని లక్షణం ఏర్పడుతుంది.

దేహంద్వారా వ్యక్తమయ్యే ‘నేను’ అనే భావాన్ని క్రమంగా, మూలమైన ‘చైతన్యం’గా గుర్తించగలిగితే అంతటా ఉన్న ఏకచైతన్యంలోనే లీనమవుతాం. చక్కని ధ్యానంతో, విచారణతో దీనిని సాధించగలుగుతాం.





**విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు**

**పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....**

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై సదా ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ.. ప్రధానసంపాదకుడు




తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 మార్చి, 2025 సంచిక : 10


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| 'నేను కేవలం చైతన్యం' | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 04 |
| పవిత్ర పర్వదినం మత్స్యజయంతి | శ్రీమతి కె. విజయలక్ష్మి | 07 |
| నవీనతకు స్వాగత గీతిక | శ్రీ జె.దీపక్ | 09 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| సందేహాలు-సమాధానాలు | డా॥ రేవూరు అనంతపద్మనాభరావు | 13 |
| కులశేఖరాళ్వారు | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 14 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఎ.కృష్ణమాచార్యులు | 16 |
| వేదదర్పణమ్ | డా॥ఈ.ఏ.శింగరాచార్యులు | 17 |
| మహాభాగ్యప్రసాదినీ! | శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ | 19 |
| దేవల మహర్షి | సద్గురు డా॥కె.శివానందమూర్తి | 22 |
| తిరుక్కచ్చినంబి | ఆచార్య టి.వి.రాఘవాచార్యులు | 23 |
| కాళిచ్చీరామవిణ్ణగరం (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 24 |
| తిరుమలేశుడి సన్నిధిలో 'ఉగాది' పండుగ | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 27 |
| శ్రీవేదనారాయణస్వామి ఆలయం, నాగలాపురం | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 31 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 34 |
| వసంత శోభలకు పునాది ఉగాది | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 35 |
| స్వామిదయ | శ్రీ మద్దాల వెంకటసుబ్రహ్మణ్యం | 37 |
| రంగుహంగులకేళి | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 39 |
| బ్రహ్మ కడిగిన పాదము | డా॥ ఎస్.రాధిక | 42 |
| వజ్రాయుధాలు | శ్రీమతి భమిడిపాటి బాలత్రిపురసుందరి | 44 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన-కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ-ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 45 |
| ఆరోగ్యపరిరక్షణలో ఆముదం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| అదివో.. అల్లదివో.. (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| వేమన శతకం | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 52 |
| భాస్కర శతకం | శ్రీ పి.వి.కె.ప్రసాదరావు | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : ఉభయదేవేరులతో శ్రీమలయప్పస్వామి, తిరుమల

వెనుకచిత్రం: శ్రీలక్ష్మీజయంతి



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,
పి.జి.డిప్లమో ఇన్ ఎపిగ్రఫీ, డిప్లమో ఇన్ యోగా,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య, ఎం.ఏ.(తెలుగు & సంస్కృతం),
ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.


24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# శ్రీమహాలక్ష్మి అవతరించిన ఫాల్గుణ మాసవైశిష్ట్యం

మాసాల గణనపరంగా భారతీయ కాలగమనంలో చివరిమాసం 'ఫాల్గుణం'. విజ్ఞానపరంగా గమనిస్తే ఋతువుల్లో చివరిదైన 'శిశిరం' వర్తించే చివరినెల ఇది. చెట్ల నుండి ఆకులురాలడం కనిపిస్తుంది. రాబోయే కొత్తసంవత్సరం వసంతాగమనంలో నవ పల్లవాలు చిగురించడానికి సిద్ధంగా ఉన్నామనే సంకేతాన్ని ప్రకటిస్తుంది.

ఈ మాసంలో కూడా ఎన్నో వ్రతాలు, పూజలు చేయాలని శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి. మత్స్యపురాణంలో ఈ మాసంలో ప్రారంభించే పనులలో ముఖ్యంగా గృహ నిర్మాణాదికార్యాలు చేపడితే సంతానప్రాప్తి, సువర్ణలాభం కూడా కలుగుతుందని చెబుతోంది. భారతీయవైజ్ఞానిక, ఆధ్యాత్మిక దృక్పథాల్లోని ఔన్నత్యాన్ని ప్రకటిస్తుందీ మాసం.

ముఖ్యంగా 'ఉత్తరఫల్గుణి' నక్షత్రంతో కూడిన పూర్ణిమ వస్తుంది. కనుక ఈ మాసానికి 'పాల్గుణమాసం' అని పేరు వచ్చింది. ఇదే రోజు సిరులతల్లి 'శ్రీమహాలక్ష్మి' కూడా ఆవిర్భవించింది. ఈ రోజున లక్ష్మీదేవిని విశేషంగా అర్చించి, అమ్మవారి కరుణా కటాక్షవీక్షణానికి పాత్రులవడానికి ముఖ్యంగా 'కనకధారా'స్తోత్రపారాయణ చేయాలి. ఈ పౌర్ణమిరోజే రాక్షస పీడను తొలగించేందుకు 'హోలికా పూర్ణిమ' నిర్వహిస్తారు. ఇది 'హోలీ' పండుగగా లోకప్రసిద్ధి పొందింది.

ఇంకా ఈ మాసంలో శ్రీవారి నందకాంశ సంభూతులైన అన్నమయ్య అవతరించి స్వామి వారిపై 32,000 సంకీర్తనలు వ్రాసి బహుళ ద్వాదశి నాడు శ్రీవేంకటేశ్వరునిలో నందకంగా లీనమైనరోజు. ఆ రోజున వారి వర్ధంతి జరుపుకోవడం పరిపాటి.

ఇక తిరుమలలో శ్రీవారికి ప్రతి ఏటా 5రోజులపాటు జరిగే తెప్పోత్సవం నయనానందకరం. మొదటి రెండురోజులు త్రేతా-ద్వాపరయుగాల్లో వెలసిన శ్రీరామ-కృష్ణులుగా శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు తెప్పలపై దర్శనమిస్తారు. మిగిలిన మూడురోజులు కలియుగస్వామి శ్రీనివాసుడు ముగ్ధమనోహర రూపంలో జగజ్జేగీయమానంగా తెప్పలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తాడు.

అట్లే తిరుమల కొండకోనల్లో 'కుమారధారా తీర్థ' ముక్కోటి విశేషంగా జరుగుతుంది.

ఇక నెలాఖరులో ఫాల్గుణ అమావాస్యానంతరం శ్రీవారి సన్నిధిలో చైత్రశుద్ధ పాడ్యమినాడు తెలుగువారి పండుగ విశ్వావసునామ సంవత్సర 'ఉగాది' ఆస్థానం అంగరంగవైభవంగా జరుగుతుంది. ఈ సంవత్సరమంతా శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆశీస్సులతో సమస్తమానవాళి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని కోరుకుందాం...

ఓం నమో వేంకటేశాయ

# పవిత్రపర్వదినం
# మత్స్య జయంతి

- శ్రీమతి కె.విజయలక్ష్మి



మార్చి 31 'మత్స్యజయంతి' సందర్భంగా...

దుష్టశిక్షణ, శిష్టరక్షణకొరకు శ్రీమహావిష్ణువు ధరించిన దశావతారాల్లో తొలిఅవతారం- మత్స్యావతారం. శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించిన చైత్రమాసంలో శుక్లపక్ష తదియనాడు **'మత్స్యజయంతి'** పండుగను జరుపుకోవాలని శాస్త్ర వచనం. ఈ సృష్టిప్రారంభానికి అవసరమైన వేదకోశాన్ని రక్షించేందుకే శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించారు. అంటే స్వామివారు పరోక్షంగా ఈ సృష్టి జరగడానికి కారకుడుగా చెప్పవచ్చు. అటువంటి మత్స్యావతార ఆవిర్భావాన్ని గురించిన ప్రస్తావన శ్రీమత్స్యపురాణముతో పాటు శ్రీమద్భాగవతములో ఉంది.

## సోమకాసురుడి ఆవిర్భావం - వేదాల అపహరణ

పూర్వం శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉన్న సమయంలో ఆయనచేతిలోని శంఖము జారి ప్రళయజలాల్లో పడింది. నీటిలో పడిన ఆ శంఖంనుండి ఒక రాక్షసుడు జన్మించాడు. శంఖము నుండి జన్మించినందువల్ల **'శంఖాసురుడు'** అనే పేరు ఏర్పడిన అతడు రాక్షసప్రవృత్తి కలవాడు. సోమకాసురుడు అని కూడా పేరు కలిగిన శంఖాసురుడు పెద్ద శరీరాన్ని కలిగినవాడు.

ఆ రాక్షసుడు ఆకలిబాధతో ఆర్తనాదాలు చేస్తూ ఆహారం కోసం అన్వేషిస్తూ సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడి వద్దకు చేరుకొని బ్రహ్మను మ్రింగడానికి ప్రయత్నించాడు. దీనితో బ్రహ్మదేవుడు భయపడి లేచి పారిపోసాగాడు. బ్రహ్మ పైకి లేవగానే బ్రహ్మతొడపైన ఉన్న వేదకోశము క్రింద పడింది. దానిని చూస్తూనే సోమకాసురుడు ఆర్తిగా తీసుకుని నోటిలో వేసుకుని మింగాడు. దీనితో బ్రహ్మదేవుడు సృష్టి చేయడం కష్టమై శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళి విషయం వివరించాడు.

దీనితో శ్రీమన్నారాయణుడు బ్రహ్మను ఓదార్చి "భయపడవద్దు... ఆ రాక్షసుణ్ణి సంహరించి వేదగ్రంథాన్ని తెచ్చి ఇస్తాను" అని పలికి మత్స్యావతారం ధరించాడు. మత్స్యావతారం ధరించిన శ్రీమన్నారాయణుడు నాలుగుచేతులలో గద, చక్రాలను ధరించి జలములో ప్రవేశించి... చక్రముతో శంఖాసురుడి శిరస్సును ఖండించి తన శంఖమును తీసుకొనడంతో పాటు "వేదకోశము"ను తెచ్చి బ్రహ్మదేవుడికి ఇచ్చాడు. అనంతరం బ్రహ్మ తిరిగి సృష్టి ప్రారంభించినట్లు పురాణకథనం.

ఈ విధంగా శంఖాసురుడిని అంతమొందించి సృష్టి నిరంతరాయంగా సాగడంకోసం శ్రీహరి మత్స్యావతారం ఎత్తినట్లు శ్రీమత్స్యపురాణంలో చెప్పబడింది.



కాగా శ్రీమద్భాగవతంలో మరో గాథ ఉంది. దీని ప్రకారం –

పూర్వం వరాహకల్పములో ద్రవిడరాజు అయిన సత్యవ్రతుడు కృతమాలికా నదీతీరంలో జలతర్పణము చేస్తున్న సమయంలో ఒక "చేపపిల్ల" చేతిలోనికి వచ్చింది. దానిని ఆ రాజు నీటిలో వదిలేందుకు ప్రయత్నించగా ఆ చేపపిల్ల––

"రాజా! నీటిలో వదలకుండా నన్ను రక్షించండి" అంటూ వేడుకుంది. దీనితో రాజు ఆ చేపపిల్లను కమండలంలో వేసుకుని ఇంటికి తీసుకువెళ్ళాడు. మరునాటికి ఆ చేప పెద్దదై కమండలంలో పట్టలేదు. గంగాళములో వేయగా మరుసటిరోజు చేప మరింత పెద్దది అవడంతో చెరువులో వేశాడు. చేప ఇంకా పెద్దది అవడంతో రాజు దానిని తీసుకుని పోయి సముద్రంలో విడిచిపెట్టాడు. ఆ సమయంలో విపరీతంగా పెరుగుతూ ఉన్న చేపను చూసి రాజు ఆశ్చర్యంతో నీవు ఎవరు అని అడుగగా–

"నేను జనార్దనుడను... ఇక కొన్ని రోజులకు జల ప్రళయం వస్తుంది... అపుడు సప్తఋషులతో ఒక నావ నీ దగ్గరకు వస్తుంది... నీవు నావలోకి ఎక్కు... నేను రక్షిస్తాను" అని చేప సమాధానం ఇచ్చింది.

ఆ తర్వాత ప్రళయం వచ్చింది. ప్రళయకాలంలో సత్యవ్రతుడు సర్వపదార్థములను స్వీకరించి మత్స్యం చెప్పినట్లు చేశాడు. ఫలితంగా ప్రళయకాలంలో రాజు రక్షింపబడ్డాడు. అంతేకాకుండా ప్రళయకాలంలో నావలో ఉండి రక్షింపబడిన సర్వపదార్థములలోని విత్తనములనుండి తిరిగి ప్రపంచము, సర్వపదార్థములు ఏర్పడినట్లు శ్రీమద్భాగవతంలో వివరించ బడింది.

**మత్స్యజయంతినాడు** మత్స్యావతారాన్ని పూజించాలి. విష్ణుసహస్రనామపారాయణం చేయడం, వైష్ణవాలయాలను దర్శించడంతో పాటు చెరువులు, కాలువల్లోని చేపలకు వీలున్న వారు ఆహారం సమర్పించడం మంచిది. మత్స్యపురాణం పారాయణం మంచి ఫలితాలను ఇస్తుంది.

## వైకుంఠపాళి

### :: 110 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 స | ర | 2 స్వ | తి | | 3 ఆ | నం | ద | ని | ల | యం |
| ప్త | | ర్ణ | | | మ | | | | | |
| గి | | ము | | | ల | | 4 పా | శు | ప | తం |
| రు | | ఖి | | 5 కా | కి | | ప | | | |
| లు | | | 6 కాం | | | | 7 వి | శ్వా | 8 వ | సు |
| | 9 మా | 10 వి | చి | గు | 11 రు | | మో | | కు | |
| 12 వ | | జ | | | ద్ర | | చ | | ళ | |
| 13 సం | జ | యు | డు | | సా | | నీ | | మా | |
| త | | డు | | | వ | | | 14 బౌ | లి | |
| ము | | | | 15 ఘూ | ర్ణి | 16 క | | | 17 క | 18 ల |
| | 19 కో | యి | ల | | | ళ | | | | త |

# నవీనతకు స్వాగత గీతిక

– శ్రీ జె.దీపక్, 75170 71551

కాంచన సుమతోరణ శోభాంచితములు నేడు ప్రతి గృహద్వారముల్
పంచాంగశ్రవణోత్సవ సంచాలిత జనగణములు సర్వాలయముల్।
గతవర్ష శుభాశుభ సంగతులెల్ల సమీక్ష చేసి; గతమెల్ల అనాగతమున
కాధారముగా మతి నెంచుచు భావిభాగ్య మార్గము గనుడీ॥

అంటోంది తెలుగు నూతన సంవత్సరం **'విశ్వావసు'.** మొత్తం అరవైలోని **'ప్రభవ'** మొదలు **'అక్షయ'**వరకు కాల నియమక్రమంలో ఈ 30న ప్రారంభమయ్యేది ఇదే. పేరుకు తగినట్లు ఎనలేని నమ్మకానికి సంబంధించిన వత్సరమే ఇదంతా!

విశ్వానికి నివాసకల్పనకారకుడు పరమాత్మ. మరో కోణంలో **'విశ్వేషాం వసుః యస్మాత్'**. వర్ధిత ధనప్రాప్తి ప్రదాత. ప్రభవం, వైభవం, శ్రీముఖం, భావం, యువత్వం, ఈశ్వరత్వం, విక్రమం, చిత్రభానుం, తారణం, పార్థివం, సర్వజిత్, సర్వదారి, నందన, విజయ, శార్వరి, శోభకృత్ వంటివి ఉన్న వరసన **విశ్వావసు**కు సమధిక ప్రాధాన్యముంది. మన సంస్కృతి ఘనమైనది. సంప్రదాయం ఉన్నతిని అందుకున్నది. ఈ విధమైన కోవలోనే– నమ్మికను, కలిమిని సొంతం చేసుకున్న ప్రస్తుత నామవార్షికం హర్షాతిరేకాలను పంచేదే!

యుగానికి ఆది, నవీనతకు పునాది అన్నట్లే ఈ పర్వ దినమూ ప్రగాఢతా ప్రబోధి. తెల్లవారకముందే లేచి, అభ్యంగన స్నానాన్ని ఆచరించి, కుంకుమ తిలకధారణ నెరవేర్చి, స్వశక్తిని అనుసరించి ఫలాన్నీ, పుష్పాన్నీ, దీపాన్నీ, ధూపాన్నీ, నైవే ద్యాన్నీ ఎదుట ఉంచడం చిరకాల పద్ధతి.

మరింతగా పరిశీలిస్తే– సప్త అశ్వాల రథ ఆసీనుడు సూర్యభగవానుడు. పక్షధరుడిగా పేరూ ప్రఖ్యాతీ అందుకున్న నెలరేడు చంద్రుడి. సమస్తమూ కాలగమనం, గణనం! క్షణాల నుంచి కల్పాల వరకైనా అదంతే! ఆ మాటకొస్తే, కాలమన్నదే దైవస్వరూపం. మొదటి రోజును తలచుకుంటూ మనమంతా చేసుకునేదే **ఉగాది.**

ప్రకృతిలో మార్పు చేర్పులు ఋతువులను అనుసరించి వస్తాయి. అలా ఋతువులవారీగా గణించడం ప్రారంభిస్తే, తిరిగి అదే వచ్చేసరికి ఆవృతం పూర్తయినట్లు, నూతన వసంతం స్వాగతించినట్లు, ఉగాది వేళన కొత్త చిగుళ్ల కళకళ. కాల గణనక్రియను అనుసరించి చాంద్ర, సౌరమానాలు రెండింటికీ సమప్రాధాన్యాల తళతళ. నిత్యవ్యవహారానికి వినియోగించేది చాంద్రమానాన్నే! రాత్రిళ్లు చంద్రుని కళలను గుర్తించేకదా తిథుల లెక్క!! నక్షత్రాలను బట్టే నెలలను తెలుసుకోగలం. ఉగాదికి సంబంధించి **'ఉ(నక్షత్రం), గ(గమన శీలత్వం)'**– అంటే నక్షత్రగమనం అన్నమాట.

ధర్మార్థసింధువు, చతుర్వర్గచింతామణి, సిద్ధాంతశిరో మణివంటి గ్రంథాలు కాలచక్రరీతిని వెల్లడిస్తూ వస్తున్నాయి. తత్త్వమంతటినీ దర్శించిన పెద్దలు సమయాల వారీగా విధు లనూ ప్రకటించి ఉంచారు. నూతనసంవత్సరాది ఉగాది పరంగానూ కర్తవ్యనిర్దేశం చేశారు. నవీన వసంతనామాన్ని సంకల్పంగా చెప్పడం, పండుగ పచ్చడిని స్వీకరించడం, ఆలయ సందర్శనం, పంచాంగాన్ని ఆలకించడం మొదలైనవన్నీ ఉగాది ప్రత్యేకతే అంతా!

తెలుగునాటనేకాక కర్ణాటక, మహారాష్ట్ర, మరికొన్ని ప్రాంతాలలో ఉగాదిప్రక్రియలను నిర్వర్తిస్తుంటారు. సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యతలను తలచుకుని ఆచార సంప్రదాయాలను అనుసరిస్తుంటారు. వీటిల్లో ప్రతీ ఒక్కటీ ఆధ్యాత్మిక, మానసిక, శారీరక ఆరోగ్యభాగ్యానికి ఉపకరించేదే. మామిడితోరణాల అలంకరణలు, ఆరు రుచుల ప్రసాద స్వీకరణలు జీవిత అర్థపరమార్థాలను వ్యక్తీకరించేవే. యుగాదిలో ఉన్న యుగాన్ని– కాలంగా, ప్రారంభంగా కూడా పరిగణించవచ్చు. ఎంత సందేశ ముంది ఇందులో!

విశ్వానికి నివాసకల్పనకారకుడు పరమాత్మ

ఈ నవమాధురీ ఝరులు హేలగమించిన నింతలోనె పెం
పూనగ దివ్య జీవకళలూరిన మేల్మి వసంతకాల చై
త్రాన తెలుగు జాతికి నితాంత చిరంత వసంత సౌఖ్య సం
తానమనుగ్రహింపుము సుధాసముపేత ఉగాది దేవతా!

మాధుర్యమనగానే ఉగాదిపచ్చడి ముందు నిలుస్తుంది. వేపపూతరెమ్మలు లేత మామిడిముక్కలూ! వీటితో చెఱకు ముక్కల కలగలుపు. కొత్తవైన బెల్లం, చింతపండుపులుసు, ఉప్పు, ఇలా షడ్రుచుల కలయిక ప్రసాదంగా తీసుకుని ఇతరులకూ పంచి పెడితే చాలు. ఎంతైనా శుభఫలం తథ్య మంటున్నాయి పురాణ కథనాలు. వేపలో చేదు, బెల్లంలో తీపి, మామిడి పిందెల వగరు, చింతపండు పులుపు ఔషధ గుణ కారణాలు. వీటికి తోడు అరటిపండు, ఎండుద్రాక్ష, పప్పులు జతచేరిస్తే అదే మాధురి!



వసంతాగమనం కర్త అన్నట్లు – కోకిలస్వరాలే మంగళనాదాలు. చిగురుకొమ్మల మామిళ్లవి పచ్చివాసనలు–

కనుల కాంతుల నింపి యుగాది వేళ స్వాగ
తము బల్కె వనలక్ష్మి సాదరముగ,
సకలశుభముల దోడ్కొని సాగి రమ్ము!
జయము జయమిదె నీకు వసంత పురుష!

పచ్చడి స్వీకారం తదుపరి పంచాంగశ్రవణం, ఏడాది శుభాశుభాలు విపులీకరించే కార్యక్రమం. దీనిలోనే **తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ** ఫలితాలన్నీ! వాటితో ప్రాప్తించేవి సంపద, ఆయువు, కార్యాల అనుకూలత, మరికొన్ని అంతటి విశేషత.

పంచాంగం అనేది సిద్ధాంతభాగం. గణితరీతిన కాలం లెక్కింపు. ప్రమాణాలు, పరిమాణాలు, గృహగమనతీరు తెన్నులు నిర్ణయమవుతుంటాయి. అంటే వివిధ ఊహావిభాగాల్లో ఉంటుండే నక్షత్ర సముదాయాలు. పౌర్ణమినాడు చంద్రుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటాడో, ఆ నెలను ఆ నక్షత్రం పేరిట పిలవడం విధానం. ఎందరెందరో పాటించేది పంచాంగశ్రవణం. వాతావరణం, పంటల రీతి, రాశిఫలాలు, ఇంకెన్నో ఉండి అన్నీ కాలవిజ్ఞాన సర్వస్వంగా వెలుగులీనుతుంటాయి. వినడంవల్ల నదీస్నానం చేసినంత ఫలితం. గోవును దానంగా ఇచ్చినంత పుణ్యమూ లభ్యం. సామాజికశ్రేయం, ధార్మికప్రాచుర్యం సమకూరుతాయి.

'కవికులగురు కావ్యకళాప్రవణమ్ములు
సరస మధుర భావోజ్జ్వలముల్
నవవాసంతశ్రీ వైభవ రుచిరములీ ఉగాది పర్వోదయముల్!
సుమసురభిద్రుమ శోభలు
కమనీయ సరోజ కాంత కాసారమ్ముల్
ప్రమదాజన సౌఖ్యవహ
సమయ సమస్తమ్ములీ వసంతోత్సవముల్'

అనేలా ఎన్నెన్నో దర్శనమిస్తుంటాయి. పంచాంగంలోనే పుష్కరాల నిర్ణయాలు కూడా. గ్రహాలపేర్లు పదేపదే వినడం మూలంగా గురుకృప కలుగుతుందని; ప్రాబల్యప్రాధాన్యాలు లభిస్తాయనీ ప్రగాఢ విశ్వాసం. ఇదీ విశ్వావసు అంతరార్థం. సంవత్సరాదిని స్వాగతగీతికకర్త అవలోకించినట్లు–

తెలుగువారికి చైతన్య దీప్తి ఇదియె,
వెలుగుదారుల నడుపు వివేకమిదియె,
కాలనిర్ణయ స్ఫూర్తి కాకారమిదియె,
సురుచిరంబైన ఆరోగ్యసూత్ర మిదియె

ఈ విశ్వావసు మనకు జీవనసూత్రాన్ని తెలుపుతుంది. తాత్త్వికతను దరిచేర్చి వికాసవాణిని వినిపిస్తుంది. ఉగాది/యుగాది అడుగడుగునా సాత్త్వికసందేశం ఉండనే ఉంది. ఎవరి అనుభూతి వారికి ఉండనే ఉంటుంది. దాశరథి కవీంద్రులు ఏనాడో అభివర్ణించినట్లు–

అఖండ బ్రహ్మాండ కటాహంలో అమృతం నింపుతోంది వసంతకన్య
అశేషప్రజలకు కాలశక్తి అవగతం చేయగలిగితే ఆమె ధన్య.

కాలశక్తినీ, ప్రశస్తినీ చాటి చెప్పే వినూత్న సంవత్సరాదిగా **విశ్వావసు** మన ముందర నిలుస్తోంది. ఇదే వసంతం శాంతి సౌభాగ్యాలిస్తుందని, అఖిలభాగ్యాలనీ నిలుపుతుందని సుదృఢ విశ్వాసప్రకటన చేస్తోంది. హృదయపూర్వకంగా ఆహ్వానం పలుకుదాం. మనసులోకి, లోలోపలి అరలలోకి చేర్చుకుందాం. ఏడాది అంతటా పండగ సందడే!

*ఓం తత్సత్*

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి..**

**4వ ఆశ్వాసం ప్రారంభం...**

సూతమహర్షి వరాహపురాణంలోని శ్రీవేంకటేశ్వరస్వామివృత్తాంతాన్ని శౌనకాదులకు వివరించాడు. తదనంతరం శౌనకాదులు...

“సూతమహర్షీ! భవిష్యోత్తరపురాణంలో శ్రీవేంకటేశ్వరకథనం విశదంగా ఉందని తమరు సెలవిచ్చారు. వేమందరం వేంకటేశ్వరకథాశ్రవణకుతూహలపరులం. దయతో చెప్పరా!” అని ప్రార్థించారు.

సూతుడు శౌనకాదులను చూచి ‘మీర డిగింది వాస్తవమే. గతంలో జనకుడు కూడా మీలాగే శతానందుని అడిగాడు. ఆ శతానందుడు జనకునికి చెప్పిన పూర్వేతిహాసాన్ని మీకూ చెబుతాను–

“మునులారా! యుగాలలో రెండవది త్రేతాయుగం. ఆ యుగంలో సుప్రసిద్ధుడు జనకమహారాజు. అతడు పరమశాంతుడు, నిర్మలహృదయుడు. అంతేకాదు మిథిలాధిపతి కూడా. ఒక రోజు జనకమహారాజు తనలో తాను ‘నాకు పెండ్లీడుకొచ్చిన కూతురుంది. అలాగే తమ్ముడైన కుశధ్వజునికి ముగ్గురు తనయలున్నారు. ఈ నలుగురికీ తగిన వరులను అన్వేషించడం తండ్రిగా, ఇంటిపెద్దగా నా ధర్మం. ఈ నలుగురికీ తగిన వరులు ఒకే రాజవంశం వారైతే ఎంత బాగుంటుంది.’ అని ఆలోచిస్తుంటే ఆ రాజు దగ్గరికి శతానందుడు వచ్చాడు.

జనకమహారాజు శతానందునికి తగిన గౌరవం చేశాడు. జనకమహారాజుకు ఏదో మనోవైకల్యముందని అవగతం చేసుకున్న శతానందుడు “మానవాధీశా! సీతకు, మాండవికి, ఊర్మిళకు, శ్రుతకీర్తికి పెళ్ళి చేయాలి కదా! వారికి తగిన వరులను వెదకే ప్రయత్నం చేయరాదా” అని ప్రశ్నించాడు.

“సంమీశ్వరా! నిజమే. నేనొక యాగం మొదలుపెట్టి భూమిని తవ్విస్తుంటే అత్యాశ్చర్యకరంగా నాగేటి చాలున ‘సీత’ను దర్శించాను. ఆ శిశువు సామాన్యంగా నాకు అనిపించలేదు. లోకైకమాతగానే నాకు అనిపించింది. ఇలాంటి వరపుత్రికకు తగిన మానవవరుడు అసలున్నాడా? ఎన్నాళ్లని వేచి ఉండాలి? నాకేమో సీతమ్మ రూపలావణ్యాలను పరిశీలిస్తే ఆ తల్లి రమాదేవివంశజగా కన్పిస్తుంది. ఇలాంటి తనయకు హరి అంశజుడే తగిన వరుడు, అయినా అలాంటి పురుషుడున్నాడా!?

మరొక్కటి. నీకు తెలుసుగా! నా ఇంటనున్న శివధనస్సు వృత్తాంతం. ఆ ధనస్సును ఎక్కుపెట్టేవాడు, ధనుర్భంగం చేయగలవాడే ఆ కన్యను వరించగల యోగ్యుడు. అతడే సీతమ్మకు తగిన వరుడు. ఆ ఉద్దేశ్యంతోనే శివధనుర్భంగం చేయగలిగినవారికి నా కుమార్తెనిచ్చి వివాహం చేస్తాను అని ఒక ప్రకటన కూడా చేశాను, ఇవన్నీ మీకు తెలుసుగా!” అన్నాడు.

జనకమహారాజు మాటలు ఆలకించిన శతానందుడు “మహీపాలా! సీత భూమిజ. ఆ తల్లికి అనువైన పురుషశ్రేష్ఠుడున్నాడు. అంతేకాదు, నలుగురు తనయలకు తగిన వరులుగల రాజకుటుంబం కూడా ఉంది. నీ కోరికలన్నీ సఫలం కావాలంటె వేంకటాచలమహిమను శ్రద్ధగా ఆలకించు. నీ కోరిక సఫలమౌతుంది. వేంకటగిరి మహిమలను శ్రద్ధగా విన్న బ్రహ్మాదులే కృతకృత్యులయ్యారు.

వేంకటాద్రిప్రభావం ఇంతింత అనరాదు. ఈ కొండ మహిమలు విన్నవారికి పాపక్షయం, దారిద్ర్యనివారణం, రోగాదుల వినాశనం తథ్యం. అంతేకాదు, వారివారి మనోగత వాంఛలు తప్పక తీరుతాయి. సకలశుభాలూ సంక్రమిస్తాయి. “మహారాజా! ఈ కొండ అతిప్రాచీనం. కృత

యుగంలో ఈ కొండకు **'వృషభాద్రి'** అని పేరు. త్రేతాయుగంలో **'అంజనాద్రి'**, ద్వాపరంలో **'శేషపర్వతం'**, కలియుగంలో **'వేంకటగిరి'** అని ప్రసిద్ధనామాలు'' అని చెబుతుంటే కుతూహలం ఆపుకోలేక జనక మహారాజు "మునిస్తుత్యా! ఒక కొండకు ఇన్నిపేర్లా! ఈ పేర్లు ఎలా స్థిరపడ్డాయో తెలుసుకోవాలని ఉంది" అని ప్రశ్నించాడు. అపుడాతడు సరేనంటూ మొదలెట్టాడు.

ఒకప్పుడు ఆ కొండలో వృషభాసురుడనే రాక్షసుడుండేవాడు. అతనికి మునులంటే పడదు. అంచేత అస్తమానమూ వారిని హింసించేవాడు. ఆ రాక్షసుడు పెట్టే బాధలకు తట్టుకోలేక మునులందరూ తమ ఆవేదనను వరాహస్వామికి విన్నవించాలని కూడగట్టుకుని వెళ్ళారు. స్వామిసన్నిధిని "పరమాత్మా! ఈ కొండలో వృషభాసురుడనే పాపాత్ముడున్నాడు. అతనికి మేము ఎలాంటి అపకారం చేయకపోయినా అకారణంగా సాత్త్వికులైన మమ్మల్ని నానా హింసలు పెడుతున్నాడు. దయతో ఆ అసురుని సంహరించి, మమ్మల్ని కాపాడండి" అని వేడుకున్నారు.

మునుల ఆవేదనను అర్థం చేసుకున్న వరాహస్వామి "ఆర్యులారా! మీ ఆవేదనకు కారణం నాకర్థమైంది. అసుర సంహారం తప్పక జరిగి తీరుతుంది. మీరు భయరహితులై వెళ్ళండి" అని భరోసా ఇచ్చాడు. స్వామి అభయమివ్వడంతో మునులు చీకూచింతా వదలి జపతపాదులలో మునిగిపోయారు.

మునులు చెప్పిన వృషభాసురుడు సామాన్యుడు కాడు. కేవలం రాక్షసుడు కూడా కాడు. అతడు 'కరాళనృసింహ' మంత్రోపాసకుడు. ఆ స్వామి మంత్రజపం చేస్తూ, అనుదినం తుంబురుతీర్థ పరిసరంలో ధ్యాననిష్ఠుడయ్యేవాడు, పూజాంతంలో తన తలను తానే నరికేసుకుని నరహరికి అర్పించేవాడు. అతని రాక్షసభక్తికి సంతోషించిన స్వామి మరలా యథాకార శిరస్కుడయ్యేలా చేసేవాడు. ఈ రకమైన పూజావిధానంలో ఐదువందల సంవత్సరాలు గడిచాయి. అసురుని రాక్షసభక్తికి సంతోషించిన స్వామి వృషభాసురుని ముందు సాక్షాత్కరించాడు. వరం కోరుకోమని ఆ స్వామి అడిగాడు.

"పరమాత్మా! స్వర్గవాసం నాకు వద్దు. బ్రహ్మలోకమూ వద్దు. చివరకు అందరు కోరుకునే మోక్షమూ నాకు వద్దు. స్వామీ! అన్యథా భావించకండి. మీరు అనేకానేక అవతారాలలో రకరకాల అసురులను అవలీలగా హతమార్చారు. ఆ అవతార బలమంతా కూడగట్టుకొని నా ముందు నిలబడితే అలాంటి మీతో సమరం చేయాలన్నదే నా చిన్ని కోరిక" అని కోరాడు. అసురుని అలౌకికకాంక్షకు నరకేసరి తనలో తాను నవ్వుకుని అలాంటి సమ్యక్‌రూపాలతోనే ప్రత్యక్షమయ్యాడు.

వీరిరువురి మధ్య భీకరసమరం సాగింది. ఒక దశలో ఆరిపోయే దీపం ఒక్కసారిగా వెలిగినట్లు నరకంఠీరవుని కంటే రాక్షసుడు విజృంభిస్తుంటే దేవతలు దిగులు చెందారు. నరహరి విజయంకోసం ఆతృతగా చూడసాగారు.

స్వామి వెనువెంటనే గరుడవాహనారూఢుడయ్యాడు. వేయి చేతులతో, వేయి ఆయుధాలతో అసురునిపై విరుచుకు పడ్డాడు. మాయావి అయిన ఆ అసురుడు కూడా కృత్రిమ విష్ణురూపధారిగా, గరుడవాహనమెక్కినవాడుగా విజృంభించాడు. స్వామి అసురుని మాయను పసిగట్టి తన మాయతో అతని మాయారూపాన్ని అణచివేశాడు. అప్పుడు వృషభాసురుడు సహజవేషంతో నిలబడవలసి వచ్చింది.

"చపలరాక్షసా! నాకు ధీటుగా, సాటిగా పోరాడాలని సంకల్పించావు. వరం కూడా కోరుకున్నావు. ఐనా నీవెంత! నీ బలమెంత! నీవు నన్ను భక్తితో స్మరిస్తున్న కారణంగా నిన్ను చంపకుండా ఇంతకాలం వదిలిపెట్టాను. నీ తప్పులన్నిటినీ క్షమించాను. అయినా, నీవు మాయావిష్ణురూపధారివై నేడు విజృంభించావు. నీవెక్కడ దాగినా వదలిపెట్టను. రాక్షసాధమా! నా చేతి చక్రాయుధంతో నిన్ను అణచకుంటే నేనసలు నారసింహుణ్ణే కాను" అని చక్రం అందుకున్నాడు. స్వామి చక్రధారి కాగానే వృషభాసురుడు ఇక లాభం లేదని పరిశుద్ధమైన భక్తితో స్వామి పాదాలపడ్డాడు.

"దేవా! నీ చక్రాయుధప్రభావాన్ని వర్ణించడానికి బ్రహ్మదేవుడు కూడా అశక్తుడు. అంబరీషాదులకు అండదండగా నిలబడినవాడివి. అంతేనా చక్రాయుధం కారణంగా హతులైన వారికి పునర్జన్మ లేదని విన్నాను. అంచేత నీ చక్రాయుధంతో నా శరీరం ఖండింపబడడమే మేలు. అయినా స్వామీ! నాదొక చిన్న కోరిక."

**(ఇంకా ఉంది)**

ప్ర) మహాభారతంలో తెలిపిన సౌగంధిక పుష్పం గురించి తెలియజేయండి?

-ఎం.సత్యనారాయణమూర్తి, రామచంద్రపురం.

జ) మహాభారతంలోని ప్రధానపాత్రలలో భీమసేనుడు ముఖ్యుడు. లాక్షాగృహదహన సందర్భంలో పాండవులను రక్షించిన వీరుడు. అజ్ఞాతవాస సమయంలో కీచక వధ చేసి ద్రౌపదిని కాపాడిన ధీరుడు. దుర్యోధనాది కౌరవవీరులను తుదముట్టించిన బలశాలి. అట్టి భీముడు ద్రౌపదితో కలిసి గంధమాదన పర్వత ప్రాంతాలలో విహరిస్తున్నాడు. గాలివాటున సౌగంధిక పుష్పంవారి ముందు వచ్చి పడింది. దానిని చూచి ద్రౌపది అలాంటి పుష్పాలు మరికొన్ని కావాలని ముచ్చట పడింది. భీముడు వాటిని వెదుకుతూ బయలు దేరాడు. మధ్యలో కదళీవనంలో ఉన్న హనుమంతుని భీముడు కలిశాడు. ఇద్దరూ వాయుపుత్రులే. సౌగంధిక పుష్పాలు కుబేరవనంలో దొరుకుతాయని హనుమ సూచించాడు. అవి యక్షుల రక్షణలో ఉంటాయనీ, వాటిని పొందడంలో అనుసరించవలసిన తీరుతెన్నులను చెప్పి పంపాడు. హనుమంతుని సూచనల ప్రకారం భీముడు కుబేరవనం వెళ్లి యక్షులను జయించి, సౌగంధిక పుష్పాలను తెచ్చి ద్రౌపదికి సమర్పించాడు. *(ఆంధ్ర మహాభారతం అరణ్యపర్వం మూడవ ఆశ్వాసం 312–380 పద్యాలలో ఈ ఘట్టం వర్ణించబడింది).*

ప్ర) సద్గతి-జన్మరాహిత్యం అంటే ఏమిటి?

-బాబు, నరసాపురం.

జ) హిందూధర్మసంప్రదాయాల ప్రకారం శరీరం భౌతికమైనది. వారి ఆత్మ వేరొక

# సందేహాలు సమాధానాలు



–డా॥ రేవూరు అనంతపద్మనాభరావు, 98665 86805

దేహంలోకి వెళుతుందనీ పునర్జీవం పొందుతుందనీ విశ్వాసం. ఆ ఆత్మకు కొత్త దిశ లేదా సద్+గతి ప్రాప్తించాలని శ్రాద్ధ కర్మలు, శాంతిపాఠాలు చేస్తారు. వేదాంత పరిభాషలో సద్గతి–మోక్షము; నరకలోక ప్రాప్తి–స్వర్గలోకప్రాప్తి; పునర్జన్మ–జన్మ రాహిత్యం అనే అంశాలపైన అనేక వివరణలున్నాయి. ధర్మార్థకామమోక్షాలు చతుర్విధాలు. మోక్షాన్ని జీవుడు కోరుకొంటూ మృత్యుంజయ మంత్రపఠనం చేస్తాడు. "ఉర్వారుక మివబంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్" అని కోరుతాడు. దోసపండు తన తీగ నుండి విడి పడినట్లు అనాయాసమరణాన్ని కోరుకొంటాడు. అదే మోక్షమార్గం.

పునర్జన్మ లేకుండా జన్మరాహిత్యం పొందడం జీవుడు కోరేది. క్రిమికీట కాదుల నుండి మానవజన్మ వరకు అనేక జన్మలు పురాకృత సుకృతఫలితంగా లభిస్తాయి. చివరిదశ జన్మరాహిత్యం. అంతకు మించి సారూప్య, సాలోక్య, సాయుజ్యాలు పరమపవిత్రం.

ప్ర) భగవద్గీత మూడు వేదాల సారం అంటారు. ఎందువల్ల?

- శ్రీమతి ఎం.వెంకటమహాలక్ష్మి, పామర్రు.

జ) వ్యాసమహాభారతంలో భీష్మపర్వంలో 25వ అధ్యాయం నుండి 42వ అధ్యాయం వరకు 18 అధ్యాయాలు 'భగవద్గీత'గా ప్రసిద్ధం. సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు బోధించిన (701 శ్లోకాల) పవిత్రగ్రంథం. దీనిని 'గీతోపనిషత్తు'గా పిలుస్తారు. వేదాలలో ప్రబోధించిన ధర్మసూత్రాల సారమే భగవద్గీత. అది ప్రస్థానత్రయంలో భాగం.

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాల వంటి వేదాంతగ్రంథాలలో ప్రధాన భూమిక గీతది. సనాతన సంప్రదాయంలో భగవద్గీత పరమపూజ్యగ్రంథం. వేదాలు సమాజానికి ధార్మిక జీవనవిధానాన్ని సూచిస్తాయి.

అలానే భగవద్గీత ధార్మిక మార్గాన్ని భక్తి–జ్ఞాన–యోగాల ద్వారా బోధిస్తుంది.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృతిర్ జ్ఞాన మపోహనం చ ।
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥
(15వ అధ్యాయం, 15వ శ్లోకం)

సమస్తప్రాణుల హృదయాలలో అంతర్యామిగా ఉన్నవాడను నేనే. నా నుండియే స్మృతి, జ్ఞానము, సందేహ నివృత్తి కలుగుతున్నాయి. వేదాల ద్వారా తెలిసికొనదగినవాడను నేనే. వేదాంత కర్తను, వేదజ్ఞుడను గూడ నేనేనని శ్రీకృష్ణ పరమాత్మ స్పష్టం చేశాడు.



మార్చి 9 'కులశేఖరాళ్వార్'
వర్షతిరునక్షత్ర సందర్భంగా...

# కులశేఖరాళ్వారు

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు

దివ్యం యత్తదనుత్తమాద్భుతతరం
శ్రోతృశ్రవానందనం
విఖ్యాతం కులశేఖరార్యచరితం
భక్తాబ్జసూర్యోదయం,
పుణ్యం పాపవినాశనం భవహరం
సంపత్కరం సర్వదం
యే శ్రుణ్వంతి పఠన్తి సౌమ్యహృదయా
స్సంపూర్ణకామా హి తే.

**భావం-** దివ్యమైనదీ, చాలా ఉత్తమమైనదీ, పరమాద్భుతమైనదీ, వినేవారికి శ్రవణానందకరమైనదీ, భక్తులు అనే పద్మాలను వికసింపజేసే సూర్యోదయంవంటిదీ, పుణ్యాన్ని ఇచ్చేదీ, పాప విమోచనం చేసేదీ, సంసారబంధాన్ని తొలగించేదీ, సంపదను ఇచ్చేదీ అయిన కులశేఖరులవారి చరిత్రను విన్నా చదివినా అలాంటి సహృదయులకు వెంటనే వారి మంచికోరికలు నెరవేరుతాయి. అలాంటి కులశేఖరులకు వందనాలు.

శ్రీహరి కౌస్తుభాంశాన కులశేఖరాళ్వారు అవతరించారు. చేరదేశం (మలయాళరాష్ట్రం- కేరళరాష్ట్రం)లోని కోళిపట్టణంలో వీరు జన్మించారు. ఈ పట్టణానికి కొల్లినగరం, తిరువంజికళం అని వ్యవహారనామాలు.

కులశేఖరులు చంద్రవంశానికి చెందిన క్షత్రియ రాజయిన దృఢవ్రతుని కుమారుడు. మార్గశిరమాసం, శుద్ధ ద్వాదశి, పునర్వసునక్షత్రాన కులశేఖరులు జన్మించారు. శ్రీరామ చంద్రపెరుమాళ్- కులశేఖరులు ఇద్దరూ పునర్వసునక్షత్ర జాతకులే. పెరుమాళ్ శబ్దవాచ్యులే కావడం ప్రస్తుతం స్మరణీయం. తమకులానికి శిరోభూషణుడుగా జన్మించాడని తల్లిదండ్రులు భావించడంవల్ల, కులశేఖరుడు అని చెప్తారు ఈ ఆళ్వారును.

విష్వక్సేనులవారు కులశేఖరులవారిని పంచ సంస్కార సంపన్నుని చేసిన ఆచార్యులు. కులశేఖరులు అంజలిముద్రతో దర్శనమిస్తారు.

భగవంతునికి (పెరుమాళ్ళకు) రక్షకునిగా ఉన్నందు వల్ల, **"పెరుమాళ్ తిరుమొళి"** అనే దివ్యప్రబంధం రచించడం వల్ల వీరికి కులశేఖరపెరుమాళ్ అనే వ్యవహారం కలిగిందంటారు. వీరు 67 సంవత్సరాలు జీవించారు, 105 పాశురాలు గల **"పెరుమాళ్ తిరుమొళి"** అనే దివ్యప్రబంధాన్ని రచించిన వీరు సంస్కృతంలో **"ముకుందమాల"** అనే శ్రీకృష్ణస్తుత్యాత్మక రచనను కూడా చేశారు.


దివ్యగుణసంపన్నులైన కులశేఖరులవారు ప్రతిరోజూ రామాయణగోష్ఠిలో నిమగ్నులై ఉండేవారు. ఒకరోజు వీరు రామాయణగాథ వింటూ ఉంటారు. ఆ కథలో "రాముడు అరణ్యవాసం చేస్తూ సీతారామలక్ష్మణులతో కలిసి ఒక గుహ



దగ్గరకు చేరుకుంటాడు. అపుడు ఖరదూషణాది రాక్షసులు వేలసైన్యంతో అక్కడకు వచ్చి అలజడి చేస్తారు. రాముడు లక్ష్మణుని గుహదగ్గర సీతకు కాపలాగా ఉంచి తానొక్కడే రాక్షసులతో యుద్ధం చేయడానికి వెళతాడు.” ఈ గాథ వినగానే కులశేఖరులవారు రామునికి సాయం చేయాలనే భావంతో చతురంగబలాలతో దండయాత్రకు సిద్ధపడతాడు, ఆ సందర్భాన మంత్రులు, కులశేఖరులతో రాముడు విజయం సాధించాడని చెప్తారు.

మరొక పర్యాయం సీతను రావణుడు అపహరించుక వెళ్లాడనే రామాయణ ప్రవచనం జరుగుతూ ఉంటుంది. దానిని విన్న కులశేఖరులు రావణసంహారం చేయడానికి సముద్రతీరానికి చేరుకుంటాడు. అపుడు కరుణాసముద్రుడగు రాముడు సీతాలక్ష్మణ సమేతంగా కులశేఖరులవారికి దర్శనమిచ్చి రావణసంహారం జరిగిందని చెప్తారు. అప్పుడు కులశేఖరులవారు తిరిగి తన పురానికి వెళ్తారు.

నిరంతరం శ్రీవైష్ణవసాంగత్యంవల్ల కులశేఖరులు మందుడవుతున్నాడని భావించిన మంత్రులు ఒక ఉపాయాన్ని పన్నుతారు. అందులో భాగంగా– కులశేఖరులవారి పూజా మందిరంలోని పెట్టెలో ఉన్న ఒక ముత్యాలహారాన్ని దాచి పెడతారు. భగవన్మందిరంలోనికి



వైష్ణవులు తప్ప ఎవరూ వెళ్ళరు. వారే ఆ ముత్యాల హారాన్ని దొంగిలించి ఉంటారని మంత్రులు కులశేఖరులవారితో చెప్పారు. రాజుగారు ఆ వార్తను నమ్మలేదు. ఒక కుండలో ఉన్న నల్లనాగు పామునోట్లో తన చేయిదూర్చి శ్రీవైష్ణవులు దొంగలైతే ఈ పాము తనను కాటు వేస్తుందని చెప్తారు. కానీ పాము కాటు వేయలేదు. మంత్రులు తాము చేసిన తప్పిదాన్ని ఒప్పుకుంటారు.

కులశేఖరులవారు తన కుమారునకు రాజ్యాధిపత్యాన్ని ఇచ్చి తాను శ్రీరంగాన్ని చేరుకుంటారు. శ్రీరంగనాథులవారిని పరమభక్తితో సేవించుకుంటూ చివరిదాకా కాలం గడుపుతారు. భగవత్స్వరూపగుణవిభూతి ఉపపాదకమైన **‘పెరుమాళ్ తిరుమొళిని, ముకుంద మాలను’** రచిస్తారు.


**పెరుమాళ్ తిరుమొళి** అంటే కులశేఖరపెరుమాళ్ చెప్పిన (**తిరు**=సు, **మొళి**=ఉక్తి) సూక్తి. **‘కులశేఖరశ్రీసూక్తి’** అని అర్థం, పెరుమాళ్ తిరుమొళి నాలుగవ దశకంలో తిరుమలపై వేంచేసి ఉన్న వేంకటేశునిపై కులశేఖరులవారి భక్తిరసం కట్టలు తెగి పారింది. ఒక పాశురంలో తిరుమలవాసుని “ఓ వేంకటాచలపతీ! నాకు ఈ లోకమే కాదు, స్వర్గరాజ్యం ఇచ్చినా వద్దు. తండ్రీ! నీ బంగారుకొండపై ఉండనిస్తే చాలు, నీ పాదపద్మాల దాకా పూలను చేర్పించే మెట్లవరుసగా నన్నుండనీయరాదా! నీ ‘గర్భగుడి’కి గడపగా పడి ఉంటే, నీ దర్శనంకోసం నీ భక్తుల పాదధూళిలో నలిగి నీ పాదారవిందాలను సేవిస్తూ ఉంటాను



కదా!” అంటూ భక్త్యావేశంతో వివశులై పడిపోయారట కులశేఖరులు. నేటికి కూడా తిరుమలలోని శ్రీవారి గర్భాలయం గడపకు “కులశేఖరప్పడి” అనే వ్యవహారం ఉంది. మహాభక్తవరేణ్యులకు కానీ ఇంతటి తన్మయత్వం కలుగదు కదా!

కులశేఖరులవారి ముకుంద మాలస్తోత్రం యావద్భారత దేశంలో నాగరి మరియు అన్ని ప్రాంతీయ లిపులలో ముద్రితమై ప్రాచుర్యం పొందింది. ముకుందమాల తావుల గుబాళింపుల ప్రభావం భక్తులను మైమరపిస్తుంది.

**కులశేఖరాళ్వార్ దివ్యతిరువడిగళే శరణం**




*(గత సంచిక తరువాయి భాగం...)*

శ్రీనివాసుడు శ్రీఅనంతార్యులకు మంగళాశాసనముచేసి “ఓయి అనంతార్యా! మేముగదా భగవద్రామానుజులను పోగొట్టుకొంటిమి, మీకు మేమున్నాము గదా? మీకే కొదవయు లేదు” అని పలికి, శ్రీపాదములు శ్రీశఠకోపము మున్నగు మర్యాదలన్నియు ఇప్పించి “మీ కభిమతములైన వానిని మేము నెరవేర్తుము” అని పలికిన తరువాత, అనంతార్యులు మనసు కలకదేరి శ్రీవేంకటరమణుని శ్రీముఖమండలము సేవించి “దేవరవారు శ్రీభగవద్రామానుజాచార్యుల విషయమైన మా విన్నపమును విని యనుగ్రహింపవలెను” అని యనంతార్యులు చెప్పగా, వేంకటేశ్వరుడట్లే చెప్పుమనగా, అంతట అనంతార్యుడు *“తమసః పరమో దాతా శంఖచక్రగదాధరః”* అనిన వడువున పర్వతచిహ్నమగు శ్రీసుదర్శన పాంచజన్యములను ఆశ్రితుల విషయమున సంతసించి ప్రసాదించిన మహౌదార్యమును తెలియలేక అన్యథా ప్రతిపత్తితోడ నాశమొందుచున్న లోకుల కందరికిని మీ విషయమున పరాత్పరత్వప్రతిపత్తి గలిగివారు జీవించుటకై శ్రీసుదర్శన పాంచజన్యములను శ్రీహస్తములందు ధరించి యనుగ్రహింప సంకల్పించిన తమ విషయమున నిర్గుణత్వాది దోషములు చెప్పిన వేదబాహ్యులగు కుదృష్టులు మట్టికరచునట్లుగా, దేవరవారు సకలజగత్కారణభూతులనియు, సకలకల్యాణగుణాధికులనియు, అఖిలహేయ ప్రత్యనీకజ్ఞానా నందస్వరూపులనియు, అప్రాకృతదివ్యమంగళ విశిష్టులనియు, సకలకల్యాణగుణాత్మకులనియు, శ్రీభూమి నీళానాయకులనియు, బ్రహ్మరుద్రాదుల కందరికిని సమాశ్రయణీయులనియు, సకల జగత్సర్గస్థితిసంహారకర్తలనియు, ఉభయవిభూతినిర్వాహకులనియు, మోక్షప్రదులనియు, నిత్యముక్తానుభావ్యులనియు, వేదాంతము లలో (ఉపనిషత్తులందు) ప్రసిద్ధమైన యర్థమునెల్లరు తెలిసి ఉజ్జీవించుటకై శ్రీభాష్యమును ప్రసాదించి జగత్తును రక్షించుచున్న మహోపకర్తయగు శ్రీభగవద్రామానుజ విషయకమగు *‘ఇరామానుజనూత్తందాది’*ని అధ్యయనోత్సవా నంతరమున ప్రత్యేకముగ ఒకదినమున దేవరవారు విని యానందింపవలెను” అని వేడుకొనిరి.

శ్రీవేంకటేశ్వరస్వామి అది విన సంతుష్టాంతరంగుడై “మన శఠకోప పరకాలభూషితములగు ప్రబంధములవలె మన రామానుజవిషయకమైన ప్రబంధమునుగూడ మా యెదుట ననుసంధింపుడు” అని యానతిచ్చెను. అనంతార్యుడిది విని మిగుల హర్షించి *“కణ్ణినుణ్ శిఱుత్తాంబు”* ను అనుసంధించిన మరునాడు ‘రామానుజనూత్తందాది’ ని సన్నిధిలో అనుసంధించు లాగున సంకల్పించి, దాని మరుసటినాడు భగవద్రామానుజుల నియమనము ప్రకారము శ్రీశైలపూర్ణులనుషించెడి తీర్థాభిగ మనోత్సవ కైంకర్యముకూడ నడచునట్లు నియమించియు దివ్య సూరులు తిరుమలకొండ యెక్కి మంగళాశాసనము చేయని లోపము తీరునట్లు భగవద్రామానుజులనుదినమును తిరుమల యందే వసించిరి.

*(ఇంకా ఉంది)*



# వేదదర్పణమ్

- డా॥ఈ.ఏ.శింగరాచార్యులు, 98850 03420

**"వేదం అద్దం వంటిది"** అనే ఉపమానాన్ని ఆధారంగా చేసికొని వేదమహిమలను కొన్నిటిని గమనిద్దాం. ఈ పోలికను శ్రీపరాశరభట్టర్ **'శ్రీరంగరాజస్తవం'**లో, వేదాంతదేశికులు **'దయాశతకం'**లో ప్రస్తావించారు. ఇంతేకాక, **'శరణాగతిధోరణి'** మొదలైన గ్రంథాలలో కూడా ఈ సామ్యప్రస్తావన కనిపిస్తుంది. "వేదం అద్దంవంటిది" అని అంటున్నారు కదా! "ఇది ఎవరికి అద్దం?" అని అడిగితే, "వేదం భగవంతునకు అద్దం" అనేది సమాధానం. వేదానికి, అద్దానికి మధ్య ఉండే ఆరు విధాలయిన సామ్యాలు, పూర్వులు చేసిన ప్రస్తావనలను గమనించినట్లయితే, మనకు కనిపిస్తాయి.

అందులో మొదటిది ఏమంటే, అద్దం అనేది ఒకవ్యక్తి తన ముఖానికి ఎదురుగా పెట్టుకొనే వస్తువు. భగవంతుడు కూడా వేదం అనే అద్దాన్ని తనకు ఎదురుగా నిలుపుకుంటున్నాడు. ఆవిధంగానే భగవంతుడు కూడా వేదాన్ని తనకు ఎదురుగా అద్దంవలె పెట్టుకుంటున్నాడా? అని అంటే, దేశికులు అనుగ్రహించిన గరుడపంచాశత్స్తోత్రంలోని ఒక శ్లోకాన్ని గమనించండి. ***"అగ్రే తిష్ఠన్నుదగ్రో మణిముకుర ఇవా నన్య దృష్టేః మురారేః"*** అనేదే ఆ శ్లోకం. భగవంతుడు తనకు ముందు ఒక మణిమయమైన అద్దాన్ని నిలుపుకుంటాడట. మరి, ఆ అద్దం ఏది? అంటే, వేదం **'గరుడుని'** రూపాన్ని ధరించి, భగవంతుని ముందు అద్దంగా ఉన్నదట. శ్రీయామునులు కూడా కాంతా చతుఃశ్లోకిలో ***"వేదాత్మా విహగేశ్వరః"*** అని అంటూ, "వేద రూపుడే గరుడుడు"అని అన్నారు. అందుచేత గరుడుని రూపాన్ని పొందిన వేదం భగవంతుని ముందు మంగళకరమైన అద్దంగా ఉన్నదట. భగవంతుని దివ్యాలయాలు అన్నిటిలోనూ గరుడుని సన్నిధి భగవంతునకు ఎదురుగా ఉండడం, గరుడుని మూర్తి చేతులను జోడించి, భగవంతుని సేవించే సన్నివేశంలో గోచరించడం కూడా ఇక్కడ మనం గమనించాలి. ఈ విధంగా, అద్దం ఏవిధంగా ఒక వ్యక్తి ముందు నిలుపబడుతున్నదో, ఆ విధంగానే, వేదం కూడా గరుడుని రూపాన్నిపొంది, భగవంతుని ముందు నిలచి, ఆస్వామిని సేవిస్తున్నది?అని తెలుస్తున్నది కదా.

ఇంకొక విశేషాన్నికూడా ఇక్కడ గమనించవచ్చు. వేదం ***"అగ్రేతిష్ఠన్"***- "ముందు ఉన్నది" అని చెప్పబడింది కదా! "ముందు ఉన్నది" అంటే చిరకాలంగా, అంటే "ప్రళయకాలం ముందు నుండి వేదం ఉన్నది" అనే అర్థాన్ని కూడా గ్రహించ వచ్చు. ఈ విధంగా, ప్రదేశాన్నిబట్టే కాకుండా, కాలాన్ని బట్టి కూడా "అగ్రే" అనే పదాన్ని అన్వయించి, అర్థాన్ని చెప్పవచ్చు. అందుచేత, "వేదం భగవంతునకు ముందు ఉన్నది" అని, "భగవంతునికి వేదం ముందు ఉన్నది" అని. ఈ విధంగా రెండు విధాలుగా ఇక్కడ అర్థాన్ని చెప్పవచ్చు. ఇది అద్దానికి, వేదానికి మధ్య ఉండే ఒక విధమైన సామ్యం.

ఇంకొక ఉపమానం పరాశరభట్టర్ అనుగ్రహించిన శ్రీరంగరాజస్తవం పూర్వశతకంలోనిది. ఇందులో- ***"మణి***

**ముకురమివాగ్రే మంగళం రంగధామ్నః"** అనే సూక్తిలో గమ నించవచ్చు. అద్దం, తనకు ముందు ఉండే వస్తువు యొక్క రూపాన్ని ప్రకాశింపజేస్తుంది. అయితే, ఇక్కడ ఉండే వేదం అనే అద్దం సామాన్యమైన అద్దం కాదు, విలక్షణమైన, విచిత్రమైన అద్దం. ఈ వేదం అనే అద్దం తనకు ఎదురుగా ఉండే భగ వంతునియొక్క రూపాన్నిమాత్రమే కాక, స్వరూపాన్ని, గుణాలను, లీలలను, విభూతులను అన్నిటిని ప్రకాశింప చేస్తున్నది. ఇది చాలా ఆశ్చర్యకరమైన అద్దంకదా!– అని అంటున్నారు, ఇక్కడ భట్టర్. దీనివల్ల ఏర్పడే తాత్పర్యం ఏమంటే– వేదం భగవత్స్వ రూప రూపగుణ విభూతి లీలాది ప్రకాశకం అని.

తరువాత, ఇంకొక సామ్యాన్ని దేశికులు దయా శతకంలో తెలియజేస్తున్నారు. భగవంతుడు వేదం అనే అద్దాన్ని తన 'దయ' అనే పత్నికి చూపిస్తున్నాడట. **"పద్మాకాంతః ప్రణయతి దయే! దర్పణం తే స్వశాస్త్రమ్"** అనే సూక్తిలో ఈ విషయాన్ని గమనించవచ్చు. ఇక్కడ శాస్త్రం అంటే? వేదం అని చెప్పవచ్చు లేదా భగవంతుడు సాక్షాత్తు తానే అనుగ్రహించిన పాంచరాత్రాది శాస్త్రాలు అని కూడా చెప్పవచ్చు. ఇటువంటి అద్దాన్ని భగవంతుడు దయాదేవికి చూపిస్తున్నాడట. అందులో దయాదేవి రూపం ప్రతిఫలిస్తున్నదట. దీని తాత్పర్యం ఏమంటే, భగవానుని దయ అనే గుణం ఈ శాస్త్రాలలో స్పష్టంగా ప్రకా శిస్తున్నది అని.

ఈ రెండింటికి మధ్య ఇక్కడ గోచరించే మరియొక సామ్యం ఏమంటే– మంగళత్వం. అంటే, అద్దం అనే వస్తువు మంగళకరమైన ద్రవ్యాలలో ఒకటి అయినట్లుగానే, వేదం కూడా మంగళకరమైనది అని అర్థం. అద్దం మంగళకరమైన వస్తువు– అనే విషయం సుప్రసిద్ధమైనది. గోదాదేవి తాను చేసే మంగళ కరమైన **తిరుప్పావైవ్రతం** కోసం శ్రీకృష్ణభగవానుని దగ్గర ప్రార్థించే వస్తువులలో అద్దం కూడా ఒకటి. **అభిదానచింతామణి** అనే నిఘంటువులో వేదం మంగళకరమైన వస్తువులలో ఒకటిగా పరిగణింపబడింది. *"మంగళమ్మేర్మత్తె వేళ్వి యదనుళ్ళుక్కు"*–అని తిరుమంగైమన్నన్‌పెరియతిరుమొళిప్రబంధంలో వేదాన్ని మంగళ కరమైన వస్తువు అని తెలియజేశారు. ఈ విషయాన్ని భట్టర్ శ్లోకంలో **"మంగళం రంగధామ్నః"** అని అంటూ తెలియజేశారు. ఈ విధంగా వేదం, అద్దం అనే రెండు మంగళకరమైన వస్తువులు అనేది **మూడవ పోలిక.**

**నాల్గవ పోలిక** ఏమంటే, ఈ రెండు అమలమైనవై, స్వచ్ఛమైనవై ఉంటేనే కార్యకరం అవుతాయి అని అనేది. వేదంకూడా అద్దంవలె స్వచ్ఛమైనది. ఈ విషయాన్ని భట్టరా చార్యులవారు తమకావ్యంలో **"ఆగమౌఘచ్ఛద్మా ...... ప్రతిబింబితాత్మా"** అని ఈ ఆగమసమూహాలు స్వచ్ఛమైన అద్దం వంటివి అని, అందులో భగవంతుని స్వరూపం ప్రతిబింబిస్తున్న దని అన్నారు. అందుచేత వేదం అమలమైనది. పవిత్రమైనది. దోషంలేనిది. లోకంలో ఉండే మిగిలిన అన్ని గ్రంథాలలోవలె, వేదంలో భ్రాంతిమొదలైన కారణాలవల్ల ఏర్పడే దోషాలు సంభవించే అవకాశంలేదు. పౌరుషేయ గ్రంథాలలో సంభా వితాలైన దోషాలు ఏవీ వేదంలో ఉండవు. వేదం అపౌరుషేయం కదా! ఎవరిచేత రచింపబడిన గ్రంథంకాదు. అందుచేత వేదం విశుద్ధమైనది, అమలమైనది. **"విశుద్ధానాం వాచాం వృషశిఖరి నాథః స్తుతిపదమ్"** అనే దయాశతకంలో కనిపించే **"విశుద్ధానాం వాచామ్"** అనే ప్రయోగం వేదాన్ని నిర్దేశిస్తుంది.

ఇక, **అయిదవ సామ్యం** ఏమంటే, వేదం అద్దం వలె భగవంతుని ఆరాధనోపకరణం అనేది. ప్రతిదినం మనం భగవంతుని సమర్పించే ఆరాధనలోఉపయోగపడే పరికరాలలో అద్దం ఒకటి అనేది ప్రసిద్ధమైన విషయం. స్వామికి అలం కారాసన సమర్పణలో ఛత్రచామరనృత్తగీతవాద్యాదులను సమ ర్పించడం, వేదసూక్తాలను అనుసంధిస్తూ పూలను సమర్పించడం చేస్తాముకదా.

**ఆరవ,** చివరిపోలిక ఏమంటే, అద్దంవలె వేదంకూడా ఆభిముఖ్యం కలిగిన వారికే ఉపయోగపడుతుంది. అద్దానికి ఎదురుగా ఉన్నప్పుడే అందులో వస్తుప్రతిబింబం కనిపిస్తుంది. ఆ అద్దంవల్ల ఉపయోగం ఉంటుంది. ఆ విధంగానే, వేదం విషయంలో ఆభిముఖ్యం, అంటే, అనుకూలభావం ఉన్నప్పుడే, అది తనలో ఉండే అర్థాన్ని మనకు ప్రకాశింపజేస్తుంది. విముఖులమై ఉంటే ఏ ఉపయోగంలేదు. దేశికులు ఈ విషయాన్ని **"ఆభిముఖ్యదశామాత్రాత్"** అని **సుభాషితనీవి** అనే గ్రంథంలో సూచించారు.

ఈ విధంగా, వేదానికి, అద్దానికి మధ్య ఉండే ఆరు విధాలైన పోలికలను అనుసరించి వేదమహిమలను తెలుసు కున్నాం. స్వస్తి.

*॥ఓమ్ తత్ సత్॥*

మార్చి 14న శ్రీలక్ష్మి జయంతి సందర్భంగా...



# మహాభాగ్య ప్రసాదినీ!

– శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ, 99483 45013

'నమామి ధర్మనిలయాం కరుణాం లోకమాతరం' అంటుంది ధ్యానశ్లోకం. **'నవదుర్గాం మహాకాళీం బ్రహ్మవిష్ణు శివాత్మికాం, త్రికాలజ్ఞానసంపన్నాం నమామి భువనేశ్వరీమ్'** అని సమర్చన చేస్తుంది. శాంతిసౌభాగ్యాల ప్రదాతగా నిఖిల లోకమూ కొలిచే ఆ శ్రీమహాలక్ష్మీదేవిజయంతి పున్నమినాడైన మార్చి 14వ తేదీన, అమృతసాధనకు దేవతలు సాగించిన క్షీరసాగరమథనం ఫలితంగా లక్ష్మి ఆవిర్భావం. 'తొలుకారు మెరుగు కైవడి తళతళయని మేను మెరయ ధగధగ యనుచు' అవతరించిందని పురాణకథన కీలకాంశం.

'పరమాత్మికా, అనుగ్రహప్రదాయా, సర్వసిద్ధిప్రద చక్రస్వామినీ, మహామహానందదాయీ' అని నామావళులు కీర్తిస్తుంటాయి. అష్టకమైతే– **'శ్వేతాంబరధరే దేవి నానాలంకార భూషితే, జగత్స్థితే జగన్మాతర్మహాలక్ష్మీ నమోఽస్తు తే'** అనీ ప్రస్తుతిస్తుంది. అందువల్లనే ఆ హోమనిర్వహణ, సహస్రాధిక నామపఠన, శ్రీసూక్తం సమర్పణ ఎనలేని ప్రత్యేకతను సంత రించుకున్నాయి. 'లక్ష్మి' అనే పదంలోనే లక్ష్యం, అది సిద్ధిస్తే కటాక్ష పర్యవసానమే అన్నది భక్తభావన. కేవలం ఒకే ఒక రోజుతో ముగిసే పూజాక్రతువు కాదది... తిథి అనుసారం కొనసాగేది.

అష్టలక్ష్ములతో శ్రీకరం, శుభకరం, విజయకారకం. **'ఆది, ధాన్య, ధైర్య, ధన, సంతాన, విజయ, విద్య, గజలక్ష్ము'**ల కరుణాకటాక్షవీక్షణాలు సర్వప్రదాయకాలు. **'సుమనస వందిత సుందరి మాధవి చంద్రసహోదరి హేమమయే'** అని ఆదిలక్ష్మీ స్తోత్రం ప్రారంభమవుతుంది. **'జయ జయహే మధుసూదన కామిని సదా పాలయ మామ్'** అంటూ ముక్తాయింపునిస్తుంది. ధాన్యలక్ష్మీదేవి మంగళదాయిని, అంబుజవాసిని, దేవగణాశ్రిత పాదయుత. వేదమయి అయినా, వైదికరూపిణిగా భాసించినా తానే. క్షీరసముద్భవమంగళరూపిణీ తనే!

ఇదే సందర్భాన జగద్గురు ఆదిశంకరులవారి అను భవాన్ని మననం చేసుకుందాం. భారతీయ ఆధ్యాత్మిక సంప్ర దాయంలోని భిక్షస్వీకరణ విధానాన్ని అనుసరించారాయన. అద్వైతసిద్ధాంత ప్రబోధనం జీవనధ్యేయంగా ఉండేవారు. బాలబ్రహ్మచారిగా ఒక ఇంటికి వెళ్లినప్పుడు, దైవప్రతిమ వద్ద నివేదనగా ఉంచిన చిన్నపాటి ఫలం మాత్రమే లభ్యమైంది. అక్కడి లేమి నివారణ లక్ష్యంతో ఆనాడు ఆయన చేసిన **'కనకధారాస్తవమే'** లక్ష్మీకటాక్ష కారణంగా వర్ధిల్లింది. అష్టలక్ష్ముల ఉమ్మడి రూపమైన దేవి అనుగ్రహాన్ని మించి ఏ లోకంలోనైనా, ఏకాలంలోనైనా మిన్న ఇంకేం ఉంటుంది? అవలోకించి చూడాలేకానీ–

**గీర్దేవతేతి గరుడధ్వజ సుందరీతి శాకంబరీతి శశిశేఖర వల్లభేతి।**
**సృష్టి స్థితి ప్రళయకేళిషు సంస్థితాయై తస్యై నమస్త్రిభువనైక గురోస్తరుణ్యై॥**

ఆమె లోకాల సృష్టికర్తవేళ భారతి, పరిరక్షణ తరుణాన నారాయణి, కాలస్వరూపిణి అయిన శాకంబరి, ప్రళయ భయకాలమందున గౌరీమణి. యజ్ఞయాగాది పుణ్యకర్మల న్నింటికీ శాశ్వతప్రయోజనాలను సిద్ధింపచేసే వేదరూపిణీ

జగత్‌కల్యాణకారిణీ లక్ష్మీమహాదేవి. ఏ ఐశ్వర్యానికైనా తానే అధిదేవత.

అరూపా, విరూపా, బహురూపా, యజ్ఞవిద్యా, మహావిద్యా, జయా, ఘనవిజయా, జయంతీ, అపరాజితా, విశ్వంభరా, ధరాధారా, యోగధ్యానపరాయణీ, చక్రరూపిణీ, బ్రహ్మాండ మణిభూషణీ, సర్వాలంకారసంయుతా, సత్యజ్ఞానాత్మికా... సహస్రాధిక నామావళితో పూజాదికాలు నిర్వర్తిస్తుంది భక్త జనవాహిని. బ్రహ్మముహూర్తాన నిద్రలేచి, పూజామందిరాన చెక్కపీటపైన వస్త్రాన్ని పరచి, విగ్రహం/ పటాన్ని ఉంచి **'ఓం శ్రీలక్ష్మీ నమః'** మంత్రాన్ని జపించి ఆరాధన నిర్వహిస్తారందరూ. హృదయసమర్పణే అంతా.

కమలాసనీ అంటే శ్రేయస్సుకు సూచిక. నాలుగు హస్తాల ప్రతీకతా ధర్మ, అర్థ, ప్రేమ, మోక్షరూపాలు. నైతికత, శీలసంపద, ఆప్యాయత, ఆధ్యాత్మికపథాలతో మాత్రమే జీవితాలు చరితార్థాలవుతాయన్న సందేశాలు ఇందులో ఉన్నాయి. చేతుల్లోని కమలం, పతాకం, అభయ–దీవెన ముద్రలు అన్నింటికీ అంతటికీ అండదండలుగా నిలుస్తున్నాయి. ధైర్యప్రదాయిని.

అందువల్లనే, అంతటి ధీరమూర్తి కనుకనే... **'జయవరవర్షిణి వైష్ణవి భార్గవి మంత్రస్వరూపిణి'** అంటూ ప్రతి ఒక్కరూ పూజిస్తారు. ఆయుధధారిణిగా దర్శించి ధీరతను అందుకుంటారు.

**నమస్తేఽస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే,**
**శంఖచక్రగదాహస్తే మహాలక్ష్మీ నమోఽస్తు తే!**

సిరులు ప్రసాదించే శ్రీలక్ష్మికి నీరాజనం. వరాలెన్నింటినో ఇచ్చే మాతకు అభివందనం. 'నీ రూపమునే ఎద నింపితిమీ, పునస్కారాలతో పులకించితిమీ, కుంకుమతో అర్చన చేసే హారతితో మనసారా కొలిచీ ముందు నిలిచితిమీ' అనడంలోనే ఇంతింత అనలేనంత భక్తిప్రపత్తి.

దేవీభాగవతం, విష్ణుపురాణం, మరెన్నో రచనలు లక్ష్మీస్తుతిని విపులీకరించాయి. శ్రుతులు, స్మృతులు, ఇతిహాసాలు, శ్రవ్యదృశ్యకావ్యాలు అనేకం ఆ మాతను ఎంతగానో కీర్తిస్తున్నాయి. విజయలక్ష్మిగా ప్రార్థిస్తూ ఉన్నాయి.

**'జయ కమలాసని సద్గతిదాయిని జ్ఞానవికాసిని గానమయే'**– అంటూ స్తుతించడం లక్ష్మీజయంతిని మరెంతో ప్రవర్ధితం చేస్తుంది. శ్రీ, సిరి, భార్గవి, పద్మప్రియ, ఇందిర... ఏ పేరుతో పిలిచినా పలికే చల్లని తల్లి.

ప్రధానంగా 'ఆదిత్యహృదయం'లోనూ లక్ష్మీదేవి ఆరాధనం ప్రస్ఫుటమవుతుంటుంది. జయంతి తరుణాన



శ్రీసూక్తపఠనం ముఖ్యం. దీపం వెలిగించి; ఆ కుందెకు గంధం, కుంకుమ పెట్టడం. గంటను మనోమోహనంగా మోగించడం, సంకల్పం, హారతి మొదలైనవన్నీ కార్యక్రమ అంశాలు.

ఐశ్వర్య అభివృద్ధి; ధర్మ, అర్థ, కామ, మోక్ష అనే చతుర్విధ ఫలపురుషార్థసిద్ధి అంతరంగధ్యేయాలు. 'పుత్ర పుత్రికానాం సర్వతోముఖవృద్ధ్యర్థం, శ్రీమహాలక్ష్మీదేవతా ప్రీత్యర్థం' అంటూ నమస్సుమాలు అర్పిస్తారు భక్తులంతా. జయంతినాడు ఎటుచూసినా ఉత్సవశోభ.

**ఏకకాలే పఠేన్నిత్యం మహాపాపవినాశనం**
**ద్వికాలే యః పఠేన్నిత్యం ధనధాన్యసమన్వితం**
**త్రికాలే యః పఠేన్నిత్యం మహాశత్రువినాశనం**
**మహాలక్ష్మీర్భవేన్నిత్యం ప్రసన్నా వరదా శుభా!**

అంటోంది శాస్త్రం. మనందరమూ నిత్యమూ పఠించే 'లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగ ధామేశ్వరీం, దాసీభూత సమస్తదేవవనితాం లోకైక దీపాంకురాం' ఎంతో అంతరార్థభరితం. మహాదేవీ! సర్వసమస్తసకలలోకాలనీ ప్రకాశింపచేసే దీపజ్యోతివి- అనడంలో వ్యక్తమయ్యేది అపారధార్మికతత్పరత, తన్మయత.

శ్రీలక్ష్మీజయంతి పర్వదినాన శుభకామన ఇంటింటా సిరిసంపదల, సుఖశాంతుల సిద్ధిని అనుభవానికి తెస్తుంది. 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ, తస్మాత్కారుణ్య భావేన రక్షరక్ష సురేశ్వరీ' పఠనం మదిని అత్యంత ప్రభావవంతంగా కాంతిమంతంగా తీర్చిదిద్దుతుంది.

దేవి పలుస్థానాల్లో స్థిరంగా ఉంటుందని పురాణాలు వర్ణిస్తున్నాయి. ఆవు, పాలు, తాజా పూలు, దీపం, ధనం, ధాన్యం తదితరాలను ఉదహరిస్తున్నాయి. ఎప్పుడూ నిజం పలికే వారికే అమ్మవారి అనుగ్రహం. తల్లిదండ్రులను, గురువులను, ఇతరపెద్దలను గౌరవించే స్వభావమే లక్ష్మీస్థావరమని గ్రంథాలనేకం తేటతెల్లం చేస్తున్నాయి. అనుసరించి ఆచరించి ఫలసిద్ధి పొందాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉంది.


## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT

## SAPTHAGIRI

**(MONTHLY)**
**FORM IV**
See Rule 8

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : TIRUPATI |
| 2. | Periodicity of its Publication | : Monthly |
| 3. | Printer's Name | : **Sri P.Ramaraju,** M.A., |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Special Officer, TTD Press, K.T.Road, Tirupati-517 507. |
| 4. | Publisher's Name | : **Dr.K.Radha Ramana,** M.A.,M.Phil., Ph.D., P.G. Dip. in Ephigraphy, Dip. in Yoga, |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Chief Editor Office, TTD Press Building, 2nd floor, K.T.Road, Tirupati-517 507. |
| 5. | Editor's Name | : **Dr. V.G.Chokkalingam,** M.A., Ph.D. |
| | Whether citizen of India | : Yes |
| | Address | : Chief Editor Office, TTD Press Building, 2nd floor, K.T.Road, Tirupati-517 507. |
| 6. | Name and address of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the Total Capital | Tirumala Tirupati Devasthanams |

I, **K. Radha Ramana**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

TIRUPATI,
Date : 28-2-2025.

**(Sd.) Dr. K. Radha Ramana,**
Signature of the Publisher


సుప్రసన్నా, చంద్రవదన, యశస్వినీ, ఆహ్లాదజననీ అని ప్రస్తుతిస్తూ; ఓం **'శ్రీమహాలక్ష్మీ నమో నమః'** అంటూ చేతులు రెండూ జోడించి నమస్సులు సమర్పించడం జనజీవితాలకు చరితార్థత నిస్తుంది.

**'సమస్తదేవసంసేవ్యం అణిమాద్యష్ట సిద్ధిదం, కిమత్ర బహునోక్తేన దేవీ ప్రత్యక్షదాయకం'** అని కదా స్వామి ఉవాచ! లక్ష్మీదేవి జయంతిన ఇంటింటా క్రాంతి.

*॥ ఓం శ్రీమహాలక్ష్మీ నమో నమః॥*

మన మహర్షులు


# దేవల మహర్షి

– సద్గురు డా॥కె.శివానందమూర్తి

పూర్వం ప్రజాపతి కొడుకులలో ఒకడైన బ్రహ్మకొడుకు ప్రత్యూషుడికి ఇద్దరు కొడుకులు పుట్టారు. అందులో మొదటి వాడు దేవలుడు, ఇంకొకడు విభువు. దేవలుడు నల్లనిశరీరం కలిగినవాడు కావటంచేత అతడికి అసితుడు అని పేరుకూడా ఉన్నది.

దేవలుడికి పదిసంవత్సరాల వయసు రాగానే తండ్రి అతడిని తీసుకెళ్ళి వ్యాసమహర్షికి అప్పగించి, విద్యాబుద్ధులు నేర్పమన్నాడు. దేవలుడు చాలా గురుశుశ్రూషచేసి ఆయన అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. తపస్వి, బ్రహ్మచర్యదీక్షితుడు, గొప్ప పౌరాణికుడుకూడా అయ్యాడు. వ్యాసుడు తను వ్రాసిన మహాభారతాన్ని పురాణంగా దేవలుడిని తనకు చదివి వినిపించమన్నాడు. అతడి వాక్కు ఎట్లా ఉంది? అర్థాన్ని విడమరిచి మధురంగా చెప్పగలడా లేదా అని పరీక్షచేసి, మహాభారతాన్ని వ్యాప్తిచేయటానికి అతడిని వినియోగించాడు.

దేవలుడు గొప్పతపస్వి. సత్యవ్రతదీక్షాపరాయణుడు, బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడు. దేవలమహర్షి ఒకనాడు నదిలో స్నానం చేస్తుండగా, ఆ సమయంలోనే గంధర్వుడైన 'హూహూ' తన ప్రియకాంతలతో జలక్రీడలు ఆడుతున్నాడు. అతడు అప్పటికి ఎంతో పుణ్యం సంపాదించి సుఖంగా ఉన్నాడు. యౌవనంలో ఆరోగ్యంగా ఉన్నాడు. దేవలుడు స్నానం చేస్తూ, ధ్యానం చేసుకుంటూ ఆ గంధర్వుడికి అమాయకబ్రాహ్మణుడిలాగ కనబడ్డాడు. దేవలుడిని భయపెడదామనే ఉద్దేశ్యంతో అతడు నీటిలోపలి నుంచి వచ్చి దేవలుడి కాలుపట్టుకుని లాగాడు. దాంతో ఆ మహర్షికి కోపంవచ్చింది. "నీళ్ళలో ఉన్నపుడు మరొకరి కాలుపట్టుకొని లాగేది మొసలి ఒక్కటే కాబట్టి, నీవు ఉత్తరజన్మలో మొసలిగా తీవ్రమైన బాధలుపడతావు. నువ్వు ఇప్పుడు చేసిన పాపానికి ఆనాడు ప్రాణావశిష్టుడవవుతావు" అని గంధర్వుణ్ణి శపించాడు.




ఒకడు ఎంతటి పాపం చేసాడో, ఎలాంటి పాపం చేసాడో, ఆ పాపానికి– ఆ లక్షణానికి– అనుగుణమైన శరీరాన్ని అతడికి మహర్షులు ప్రసాదిస్తారు. దానినే శాపం అనవచ్చు. అంటే, పై సంఘటనలో, అటువంటి లక్షణం కలిగినది మొసలి; కాని ఆ లక్షణంతో గంధర్వుడు కావటానికి వీలులేదు. కాబట్టి మొసలిగా పుట్టమని శాపమిచ్చాడు దేవలమహర్షి.

దేవలుడి శాపం పొందాక ఆ గంధర్వుడికి తను చేసిన తప్పు తెలిసి వచ్చింది. "నేను చాపల్యంతో మహాపాపం చేసాను. నాకు తగినశాపం ఇచ్చారు. అనుగ్రహించి శాపవిమోచనం తెలుపండి" అని ప్రార్థించాడు. దేవలుడు, "సరే! నేను క్షమిస్తున్నాను. కాని నీకు ఇచ్చిన శాపం అనే నా దోషానికి ప్రతిగా నీకొక ఉపకారంకూడా చేయదలచుకొన్నాను. మొసలిగా నీవొక ఏనుగును బాధిస్తావు. నీకు భగవంతుడైన శ్రీమహావిష్ణువుయొక్క అనుగ్రహంతో ఆ మొసలిశరీరం పోతుంది. ఆయన చేతిలో మరణం నీకు మోక్షహేతువు అవుతుంది. ఆ ఏనుగు చేతిలో మరణిస్తే నీకు ఏం పుణ్యం ఉంటుంది? మరొక ప్రాణిజన్మ ఎత్తవలసిందే. ఆ ఏనుగు ఒక విష్ణుభక్తుడు. తన ప్రాణాలు కాపాడమని అతడు మొరపెట్టుకుంటాడు. అప్పుడు విష్ణువు వచ్చి తన సుదర్శనచక్రంతో నిన్ను ఖండిస్తాడు. ఆ కారణంచేత నీకు వైకుంఠప్రాప్తి కలుగుతుంది, నా శాపప్రభావం తొలగుతుంది" అని అనుగ్రహించాడు.

అంటే, శపించాడేకాని ఎంతో అనుగ్రహంతో కూడుకొన్న శాపం అది. అది అసామాన్యమైనవిషయం. ఆయనకు కోపం వచ్చి శాపం ఇవ్వడంచేతనే ఆ గంధర్వుడికి అంతటి భగవదనుగ్రహం కలిగిందిగాని, లేకుంటే కలిగేది కాదు. దేవలమహర్షి అంతటి సమర్థుడు. ఆ గంధర్వుడు భవిష్యత్తులో మహావిష్ణువుయొక్క సుదర్శనచక్రంతో చనిపోయే మహాఫలాన్ని ఇవ్వగలిగిన తపస్సు అతడిది అని అర్థం చేసుకోవాలి. (గజేంద్రమోక్షగాథలోని మొసలి ఇతడే. గజరాజును పట్టుకొని చివరికి శ్రీమహావిష్ణువు చేతిలో మరణం పొందాడు.) **దేవలమహర్షి దివ్యర్షి, మహాతపస్వి, యోగీశ్వరుడు. ధర్మశాస్త్రప్రవర్తకుడైన మహాపురుషుడు.** అగ్రగణ్యులైన మహర్షులలో ఆయన ఒకరు.

# తిరుక్కచ్చినంబి

- ఆచార్య టి.వి.రాఘవాచార్యులు,
93935 64815




మార్చి 7న తిరుక్కచ్చినంబి శాత్తుమొఱ సందర్భంగా...

మాఘమాసం, మృగశిరానక్షత్రమున తమిళనాడులోని పూవిరుందపల్లిలో అవతరించిన తిరుక్కచ్చి నంబికి కాంచీపూర్ణులు, గజేంద్రదాసర్ అను నామాంతరములు కలవు. వీరు ప్రతినిత్యము కంచి శ్రీవరదరాజస్వామివారికి చామరకైంకర్యమును చేసేవారు. శ్రీవరదరాజస్వామి, శ్రీపెరుందేవి తాయార్ వారితో మాట్లాడేవారు.

తల్లి ఆజ్ఞానుసారము రామానుజాచార్యులు తిరుక్కచ్చినంబిని ఆశ్రయించి, వారి ఆజ్ఞానుసారము దేవరాజస్వామికి కావలసిన తిరుమంజన తీర్థ కైంకర్యమును చేశారు. తిరుక్కచ్చినంబి ఆచార్యులైన యామునాచార్యులవారు శ్రీరంగము నుండి శ్రీపెరియనంబిని పంపి రామానుజాచార్యులను తీసుకురమ్మన్నారు. తిరుక్కచ్చినంబిని అడుగగా వారు సంతోషంతో అంగీకరించినారు. రామానుజాచార్యులు శ్రీరంగమును చేరునప్పటికి యామునాచార్యులవారు పరమపదించారు. రామానుజాచార్యులు తిరుక్కచ్చి నంబియందు ఎక్కువ ఆచార్యభక్తిని కల్గి, తనకు పంచసంస్కారములను అనుగ్రహించమనగా, గోష్ఠీ పూర్ణులనాశ్రయించమన్నారు. తిరుక్కచ్చినంబి ప్రతి నిత్యం శ్రీవరదరాజస్వామివారితో స్వయంగా మాట్లాడేవారు. కనుక, తన సందేహాలను నివృత్తి చేసుకునేవారు.

ఒకనాడుతిరుక్కచ్చినంబి స్వామివారిని అడుగకుండానే వరదరాజస్వామివారు 'మీరేమైనా అడుగదలుచుకున్నారా?' అని అడిగారు. నంబిగారడిగిన ప్రశ్నలకు సమాధానముగా వరదరాజస్వామి సెలవిచ్చిన ఆరు వార్తలు ఇవి **1)అహమేవ పరం తత్త్వమ్**-నేనే అన్నిటికీ మూలకారకుడను. **2)దర్శనమ్ భేద ఏవ**- జీవాత్మలు; అచేతనములు వేరైనప్పటికి వాటితో శరీరాత్మసంబంధమును కలవాడను. **3)ఉపాయము ప్రపత్తి**- నన్నే శరణు అని నమ్మిన వారు నన్నే చేరుకుంటారు. **4)అంతిమ స్మృతి వర్జనమ్**- ప్రపన్నులైనవారు శరీరమును విడిచిపెట్టే సమయమున తన గూర్చి ఆలోచించకపోయినను, తాను ఆలోచిస్తానని స్వామి వరాహచరమశ్లోకమున చెప్పినారు. చరమసమయంలో ఆచార్యులను స్మరించాలి. **5)దేహావసానే ముక్తిః**- ప్రపన్నులు అయినవారు శరీరమును విడిచిపెట్టి పరమపదము చేరి భగవంతునికి నిత్యకైంకర్యము చేస్తారు. **6)పూర్ణాచార్యపదాశ్రిత**- మహాపూర్ణులను గురువుగా స్వీకరించుట.

ఆ ఆరు వార్తలను విని రామానుజాచార్యులవారు మధురాంతకంలో మహాపూర్ణులైన పెరియనంబిని ఆశ్రయించి ప్రసిద్ధులయ్యారు. తిరుక్కచ్చినంబిని గూర్చి కొన్ని వాక్యములు లభిస్తున్నవి. **పెరియాళ్వార్ తిరుమొళి 3-7-8. తిరువాయిమొళి పిళ్లై**గారి స్వాపదేశవ్యాఖ్యానమున. **తిరువిరుత్తమ్**కి నంబిళ్ళైగారి వ్యాఖ్యానమున ఆచార్యహృదయమున 85 చూర్ణికలో మణవాళమహామునుల దేవరాజమంగళమున 11వ శ్లోకములో ఇలా అన్నారు-

**శ్రీకాంచీపూర్ణమిశ్రేణ ప్రీత్యా సర్వాభిభాషిణే ।**
**అతీతార్చావ్యవస్థాయ హస్త్యాద్రీశాయ మంగళమ్ ॥**

అర్చారూపధర్మమున విక్రమించి తిరుక్కచ్చినంబితో సంభాషించిన శ్రీవరదరాజస్వామికి మంగళం. భగవంతుని చేరే ముందు ఇటువంటి భక్తులనాశ్రయిస్తేనే ముక్తి లభిస్తుంది.

**108 దివ్యదేశాలు**

# కాళిచ్చీరామవిణ్ణగరం

## (శీర్కాళి-తాడాళన్ కోయిల్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

శ్రియఃపతి అయినటువంటి శ్రీమన్నారాయణుడు అర్చారూపిగా వైకుంఠానికి సమానమైనటువంటి దివ్యదేవాలయాల్లో ఈ భూలోకంలో వేంచేసి ఉన్నాడు. అందులో ముఖ్యంగా **విణ్ణగరం** అనే పేరు వినిపిస్తుంది. అంటే 'పైలోకంలో ఉన్నటువంటి అద్భుతమైన నగరం' అని అర్థం. ఆ పేర్లు ఇచ్చట భూలోకంలో **వైగుండవిణ్ణగరం, అరిమేయ విణ్ణగరం, నందిపురవిణ్ణగరం, కాళిచ్చీరామవిణ్ణగరం, పరమేశ్వరవిణ్ణగరం** అని విశేషంగా పిలువబడుతున్నది. ఇప్పుడు **కాళిచ్చీరామవిణ్ణగరం** అనే దివ్యదేశం శీర్కాళి, తాడాళన్ కోయిల్ అనేటటువంటి పేర్లతో మయిలాడుదురై (మాయవరం) ప్రాంతానికి ఉత్తరదిక్కులో 21 కి.మీ.ల దూరంలో, రెండు ప్రాకారాలతో, మూడంతస్తుల రాజగోపురంతో అర్ధమండపం, మహామండపాలతో, 'పాటలీకవనం', 'ఉత్తమక్షేత్రం' అనే పేర్లతో పిలువబడుతూ విలసిల్లుచున్నది.

### తాడాళన్ అనే పేరు సార్థక్యం


భగవంతుడు వామనావతారాన్ని స్వీకరించి త్రివిక్రముడై తన మొట్టమొదటి పాదంతో ఈ భూలోకాన్ని కొలిచాడు కదా! కొలిచిన దేశం **'కాళిచ్చీరామవిణ్ణగరం.'** మూడు పాదాలతో ముల్లోకాలను కొలిచిన వాడు కనుక **"తాళాల్ అళందవన్ తాడాళన్"** అతడికి 'తాడాళన్' అనే పేరు కలిగినది.

### శీర్కాళి (కాళిచ్చీరామవిణ్ణగరం)

శీర్+కాజి అనేటటువంటి ఆ పేరు శీర్కాళిగా రూపు దిద్దుకున్నది. 'శీర్' అనే శబ్దానికి ఉత్తమం అని అర్థం. 'కాజి' అనే శబ్దానికి దృఢం, ఉత్కృష్టం అని అర్థాలు ఉన్నవి. ఇచ్చట కోదండరాముడు ప్రత్యేకమైనటువంటి సన్నిధిలో విలసిల్లియున్నాడు. అందువల్ల శ్రీరామన్ అనే పేరు తమిళంలో **'చ్చీరామ'** అని పరివర్తనం చెంది శ్రీరాముడు ఉండే చోటు కనుక ఈ దివ్యదేశానికి **కాళిచ్చీరామవిణ్ణగరం** అనే పేరు వచ్చినది. మూలమూర్తి అయినటువంటి త్రివిక్రముడు తన యొక్క ఎడమపాదాన్ని పైకి ఎత్తి, దానికి సమానంగా తన ఎడమహస్తాన్ని పైకి లేపి, కుడిపాదాన్ని చక్కగా కింద ఉంచి, కుడిహస్తంతో దానం చేస్తున్నటువంటి మహాబలి దగ్గర తీసుకునే విధంగా పంచాయుధాలతో మూడడుగుల నేలను యాచించే విధంగా తూర్పుదిక్కున చూస్తూ దేవదేవుడు వేంచేసి ఉన్నాడు. ఉత్సవమూర్తి **త్రివిక్రమతాడాళ నారాయణన్.** అమ్మవారు **లోకనాయకి** మూలమూర్తి, ఉత్సవమూర్తిగా **మట్టవిళ్కుళలీ** అనే పేరుతో విలసిల్లియున్నది. **శంఖపుష్కరిణి, చక్రతీర్థం, పుష్కలావర్త విమానం** ఛాయలో దేవదేవుడు ప్రాచీదిక్కున చూస్తూ త్రివిక్రమ స్వరూపంలో వేంచేసి ఉన్నాడు.

### స్థలపురాణం

రోమశముని, అష్టావక్రుడు ఇరువురు మహర్షులు ఈ కాళిచ్చీరామవిణ్ణగరదివ్యదేశంతో సంయుక్తులై ఉన్నారు.



బ్రహ్మాండపురాణం ఈ వృత్తాంతాన్ని తెలియజేస్తున్నది. బ్రహ్మ దేవుడు తానే సృష్టిచేస్తున్నాడనే అహంకారంతో ఉండగా, పరంధాముడు అతని యొక్క అహంకారాన్ని అణచాలి అనే ఉద్దేశ్యంతో రోమశమునికి తపఃఫలంగా అసంఖ్యేయమైన ఆయుష్షుని అనుగ్రహించాడు. రోమశముని యొక్క ఒక్క కేశము క్రిందపడితే ఒక బ్రహ్మ ఆయుష్కాలం పరిపూర్ణమౌ తుంది అని చెప్పడం జరిగినది. దీని గురించి బ్రహ్మదేవుడు ఆ రోమశమునితో మాట్లాడగా రోమశముని, 'హే బ్రహ్మదేవా! నీయొక్క ఆయుష్షు నా కేశముతో సమానం' అని చెప్పగా, బ్రహ్మదేవుడు సిగ్గుపడి తనయొక్క తప్పుని తెలుసుకుని భగ వంతుడిని శరణాగతిచేశాడు. అంచేత తన తపస్సు చేత బ్రహ్మదేవుని అహంకారాన్ని పోగొట్టినటువంటి రోమశమునిని అనుగ్రహించడానికై భగవానుడు ఈ దివ్యదేశంలో త్రివిక్ర ముడుగా దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాడు.

## అష్టావక్రుని చరిత్ర

అష్టావక్రుడు తన తల్లిగర్భంలో ఉండే సమయంలో తండ్రి అయినటువంటి కహోలుడు వేదాన్ని అపస్వరంగా చెబు తుండగా విని తండ్రియైనటువంటి కహోలుడు యొక్క అప స్వరాన్ని ఖండిస్తూ ఉండెను. దీనితో కోపోద్రిక్తుడైనటువంటి కహోలుడు "ఎనిమిది వంకరలతో నీవు జన్మించగలవు" అని ఆ బిడ్డకు శాపమిచ్చెను. అందువల్ల ఆ బిడ్డ కూడా ఎనిమిది వంకరలతో పుట్టెను. కనుక అతనికి అష్టావక్రుడు అనే పేరు వచ్చింది. తన తండ్రియందు అచంచలమైన భక్తి విశ్వాసాలు కలిగినవాడుగా ఉండెను. ఒకానొక సందర్భములో జనక



మహారాజుయొక్క సభలో ఉన్నటువంటి **వంది** అనే ఒక పండితునిచేత తన తండ్రి కహోలుడు అపనిందలు పడిన విషయం తెలుసుకొని, సభకు వెళ్ళి ఆ వంది అనే పండితుడితో వాదంచేసి, జయించి వరుణలోకంలో దాచిపెట్టపడినటువంటి తన తండ్రి కహోలుణ్ణి 'తాడాళన్' అనే ఈ దేవుని అను గ్రహంతో తీసుకుని రావడం జరిగినది. అంచేత తన తండ్రి కహోలుణ్ణి అనుగ్రహించినటువంటి త్రివిక్రమస్వామిని అష్టా వక్రుడు కూడా అదే ప్రకారం సేవాభాగ్యాన్ని కలిగించాలని ప్రార్థింపగా దేవదేవుడు అలాగే అని అతనిని అనుగ్రహించి, భక్తుల్ని కూడా అనుగ్రహిస్తూ ఉన్నాడు.

> శైవసిద్ధాంతంలో 64 నాయన్మార్లు ఉన్నారు. ఎలాగైతే శ్రీవైష్ణవసంప్రదాయంలో పన్నిద్దరుఆళ్వారులు ఉంటారో అలాగే, 64మందిలో నలుగురు చాలా ముఖ్యులు. ఒకరు **తిరుజ్ఞాన సంబంధర్**, రెండవ వారు **తిరునావుక్కరశర్**, మూడవ వారు **సుందరమూర్తి**, నాల్గవ వారు **మాణిక్యవాచకర్**. వీరు నలుగురు శైవసిద్ధాంతానికి మూలస్తంభభూతులు. **'తేవారం'** అనే టటువంటి చక్కటి గ్రంథాన్ని రచించినవారు. ఈ నలుగురిలో **తిరుజ్ఞాన సంబంధర్** ఈ దివ్యదేశంలోనే జన్మించారు.

## తిరుమంగైఆళ్వార్ వృత్తాంతం

పరకాలన్ అనేటటువంటి ఈ ఆళ్వారు సాలగ్రామం, బదరికాశ్రమం ఇలా ఉత్తర దివ్యదేశయాత్ర చేస్తూ ఈ కాళిచ్చీ రామవిణ్ణగరానికి వచ్చిచేరడం జరిగినది. ఈ ఆళ్వార్లకు నలుగురుశిష్యులు ఉండేవారు. వారు ఈ ఆళ్వారుల యొక్క బిరుదులను ఎల్లప్పుడూ కూడా ఘోషించేవారు, ఈ ఆళ్వారులకు

| | | |
|---|---|---|
| భగవంతుడు | : | మూలవర్ త్రివిక్రముడు, తాడాళన్ పంచాయుధవిశిష్టుడు |
| ఉత్సవర్ | : | త్రివిక్రమనారాయణన్ |
| అమ్మవారు | : | మూలవర్లు లోకనాయకి, ఉత్సవర్లు మట్టవిళ్కుళలీ |
| తీర్థం | : | శంఖపుష్కరిణి, చక్రతీర్థం |
| విమానం | : | పుష్కలావర్త విమానం |
| ప్రత్యక్షం | : | రోమశముని, అష్టావక్రుడు |
| మంగళాశాసనం | : | తిరుమంగైఆళ్వారులు |
| ఆగమం | : | వైఖానసం |

**ఆళినాడన్, అరుళ్‌మారి, అరట్టముక్కి, అడయార్‌శీయమ్** మొదలగు ఆ బిరుదులని చెబుతూ ఉండగా, తిరుజ్ఞానసంబంధర్ శిష్యులు అడ్డుకోవడం జరిగినది.


తదుపరి తిరుమంగైఆళ్వారులు తిరుజ్ఞానసంబంధర్ వీరిరువురు కలుసుకున్న సందర్భంలో 'ఈ దివ్యదేశం యొక్క స్వామిని చక్కనిపాటలో స్తోత్రంచేయాలి' అని తిరుజ్ఞాన సంబంధర్ చెప్పగా ఆళ్వారులు తనదైన శైలిలో చిత్రకవిత్వం ద్వారా ఈ స్వామిని స్తోత్రం చేశారు. దీనిని విన్నతరువాత తిరుజ్ఞానసంబంధర్ మీ యొక్క శిష్యులు మీయొక్క బిరుదులను కీర్తించడంలో ఎంతో ఔచిత్యమున్నది, కనుక ఎప్పుడైనా, ఎక్కడైనా ఈ బిరుదులను వాళ్ళు ఘోషించవచ్చు అని చెప్తూ తన దగ్గర ఉన్నటువంటి ఒక **వేల్** అనే ఆయుధాన్ని కూడా బహుమతిగా ఇచ్చారట.

ఐదవది సిద్ధాంతాలకి, సంప్రదాయాలకి కలహం ఏర్పడే సందర్భంలో ఒక ముదుసలి 'ఈ తాడాళన్ స్వామికి ఎటువంటి కష్టం, భంగం వాటిల్లకూడదు' అని అనుకొని తన ఇంట్లో ఉన్నటువంటి ఒక కుండలో స్వామిని దాచిపెట్టి కాపాడుతూ వస్తున్నది. తిరుమంగైఆళ్వారులు ఈ దివ్యదేశానికి వచ్చిన సందర్భంలో ఆవిడ కలలో స్వామి కనిపించి ఆళ్వారులకు ఈ బింబాన్ని ఇవ్వమని చెప్పడం, తరువాత తిరుమంగై ఆళ్వారులు ఆ విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠ చేయడం జరిగినది. అందువల్ల ఈ దివ్యదేశానికి ఒక చక్కటి వైభవం ఉన్నది. ఎవరైతే ఈ దివ్య దేశంలో ఉన్నటువంటి స్వామిని సేవించుకుంటారో వాళ్ళకు సకలవిధమైనటువంటి శ్రేయస్సులు కలుగును.

### ధ్యానశ్లోకం

**తాడాళాలయవాసినః బలిరిపోః సౌగంధ్యవత్కుంతలా**
**దేవీ తత్ర విమానమ్ ఇష్టఫలదం తత్పుష్కలావర్తకమ్।**
**తీర్థం శంఖశరః ప్రసిద్ధయశసే నామ్నా అష్టకోణాయ వై**
**తస్మై దుష్కరతాపసాయ వరదః ప్రాచీముఖో భాసతే॥**

వైష్ణవ భక్తాగ్రేసరులైన ద్వాదశ ఆళ్వార్లు పారవశ్యంతో నిమగ్నులై, తమిళ భక్తి సాహిత్యంనందు శ్రీమన్నారాయణుని స్తుతిస్తూ పరవశించి పాడిన సంకీర్తనలను "పాశురాలు" అని అంటారు. మధురభక్తి భరితమైన ఆళ్వార్ల సాహిత్యాన్ని తమిళులు "ద్రావిడవేదం"గా కొలుస్తారు. భూమండలం మీద గల కొన్ని వైష్ణవక్షేత్రాలను ఆళ్వార్లు తమ పాశురాలతో స్తుతించినారు. వీరు స్తుతించిన పాశురాలు జగద్విఖ్యాతి పొందినాయి. క్షేత్రం(దివ్యదేశం), తీర్థం(పుష్కరిణి), విమానం (గర్భాలయంపైనగల గోపురం), మూలవిరాట్టు (ప్రధానదైవం) మరియు ఉత్సవ మూర్తుల యొక్క విశిష్టతను పాశురాలు కొనియాడుతున్నాయి. ఇటువంటి ఆలయాలకు ఆళ్వార్లు తమ మంగళాశాసనములు అందించినారు. ఆళ్వార్ల చేత కీర్తించబడిన దివ్యదేశాలు ఒక ప్రత్యేక విశిష్టత కలిగి ఉంటాయి. ఇవి తూర్పు అభిముఖంగా-79 ఆలయాలు, పశ్చిమాభిముఖంగా-19 ఆలయాలు, దక్షిణాభిముఖంగా-7 ఆలయాలు, ఉత్తరాభిముఖంగా-3 ఆలయాలున్నాయి. పన్నెండు ఆళ్వార్లు దివ్యదేశంనందలి మూలవిరాట్టును తమ పాశురాలతో మెప్పించి, నిరంతరం శ్రీమన్నారాయణుని స్మరించుతూ మోక్షం పొంది, చివరకి శ్రీహరి పదస్థానం అయిన తిరుపరమపదంను చేరుకొన్నారు. ఆళ్వార్లు కీర్తించిన వైష్ణవ క్షేత్రాలను "దివ్యదేశాలు"గా పేర్కొంటారు. వీటిని "దివ్య తిరుపతులు"గా కూడ పిలుస్తారు.





# తిరుమలేశుడి సన్నిధిలో 'ఉగాది' పండుగ

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

దేవదేవుడైన ఆ విష్ణుభగవానుడు శ్రీవైకుంఠం నుంచి భువికి దిగివచ్చాడు. వస్తూ వస్తూ ఆ వైకుంఠంలో ఉండే కొండల్నీ, కోనల్నీ తీర్థాల్ని తెప్పించుకొన్నాడు. ఉభయదేవేరులు శ్రీదేవి, భూదేవులతో పాటు సేవకులైన గరుడభగవానుడు ఇత్యాది పరివారంతో పాటు భూలోకానికి తరలివచ్చాడు.

ఇదిగో! ఆ స్వామి ఇక్కడ, ఈ భూలోకంలో ఏరి కోరి తెలుగు వారి ఇల(నేల)లో, ఇల్లుగట్టుకొని, తెలుగువారి ఇలు(ఇంటి) వేలుపుగా కొలువయ్యాడు. అందుకే, వైకుంఠంలోని ఆ మహాసంస్థానం, ఇక్కడ భూలోకవైకుంఠంగా, దివ్యధామంగా విరాజిల్లుతూ ఉంది. ఇక్కడ ఒక్కమాట! శ్రీవేంకటభగవానుడు శ్రీవైకుంఠం నుండి దిగివచ్చిన నాటి నుండీ, 'గోపీనాథ దీక్షితులు' అనే తెలుగు అర్చకస్వాములు ప్రాచీనమైన వైఖానసాగమశాస్త్రం ప్రకారం అర్చనలు, ఉత్సవాలు నిర్వహించాడు. ఆనాటినుండి ఆ వైఖానసదీక్షితులవారి వంశీయులే పరంపరానుగతంగా నేటికీ తిరుమలపరంధామునికి అర్చనాది పూజా వ్యవహారాలను నిర్వహిస్తున్నారు.

తెలుగువారి ఇలవేలుపైన శ్రీవేంకటేశ్వరస్వామికి తెలుగువారి సంప్రదాయం ప్రకారంగా, 'ఉగాది' పండుగనాటి నుండి ఉత్సవాలు, ఊరేగింపులు ప్రారంభమై మళ్లీ ఉగాది ముందురోజుకు పూర్తవుతాయి.

తిరుమలలో ఉగాది పండుగనాడు జరిగే తొలి వార్షికోత్సవం 'తిరుమలేశుడి ఉగాది పండుగ వేడుక'. దీన్నే 'ఉగాది కొలువు' అనీ, 'ఉగాది ఆస్థానం' అని కూడా అంటారు.

ఈ "ఉగాది పండుగ వేడుక" బంగారువాకిలి ముందు ఉన్న తిరుమహామణిమండపం (ఘంటామండపం)లో, అత్యంత వైభవంగా నిర్వహింపబడుతుంది. కేవలం శ్రీవారి అర్చకస్వాములు, జియ్యం గార్లు, ఏకాంగులూ, వేదపండితులు, దేవస్థానం ఉన్నతాధికారులు, ధర్మకర్తలమండలి సభ్యులు, తిరుమల ఆలయ సిబ్బంది మాత్రమే పాల్గొని దర్శించగలిగిన "ఆనందనిలయుడి ఉగాది ఆస్థానం" వేడుకలను, ఇతర భక్తులు ఎవరు దర్శించడానికి వలను పడదుగాక పడదు. అంతేకాదు, వీడియో కెమెరా కన్ను కూడా ఆ దృశ్యాల్ని చిత్రీకరించ వీలే లేదు. అయినా 'తిరుమలేశుని సన్నిధిలో జరిగే ఉగాది పండుగ వేడుక'ను చదివి మననం చేసుకుంటే చాలు. ప్రతి భక్తుడు తన మనోనేత్రంతో తప్పక దర్శించవచ్చు.

### ఏకాంతంగా తిరుమంజనం

ఉగాదిరోజున శ్రీవారిఆలయంలో సుప్రభాతం, తోమాలసేవ జరిగిన తర్వాత ఉభయదేవేరులతో శ్రీమలయప్పస్వామికి, శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారికి ఏకాంతంగా తిరుమంజనం (అభిషేకం) జరుగుతుంది. ఒకవేళ 'శుక్రవారం'నాడే ఉగాది వస్తే, శ్రీవేంకటేశ్వర స్వామి వారి మూలమూర్తికి ఆనాటి తెల్లవారుజామునే శుక్రవార అభిషేకం జరుగుతుంది.

కాని పక్షంలో ఉగాదినాటికి ముందు వచ్చిన శుక్రవారం నాడే, అభిషేకం అయిన తర్వాత శ్రీస్వామివారిమూర్తిని విశేషమైన వజ్రాలు పొదిగిన కిరీటం, శంఖచక్రాలు, వరద, కటిహస్తాల కవచాలతో అలంకరిస్తారు. ఈ విశేషాలంకరణలో ఆనందనిలయుని మూర్తి సౌందర్యం అనుపమానం! అప్రమేయం! అద్భుతం! ఆనందమయం! సర్వార్థ సిద్ధిప్రదం. పిదప ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి తులసితో సహస్రనామార్చన, నివేదనలు నిర్వహింపబడుతాయి.

### సర్వభూపాలవాహనంలో ఉభయదేవేరులతో... మలయప్పస్వామి

బంగారువాకిలి ముందు ఉన్న ఘంటామండపంలో బంగారు సర్వ భూపాలవాహనంలో శ్రీభూదేవే రులతో శ్రీమలయప్పస్వామివారిని తూర్పుముఖంగా బంగారువాకిలికి ఎదురుగా ఉన్న గరుత్మంతునికి అభి ముఖంగా వేంచేపు చేస్తారు. పిదప పట్టుపీతాంబరాలతోను, వజ్రవైడూర్య మరకత మాణిక్యాది సర్వాభరణాల తోను, వజ్రకిరీటాలతోను, సుగంధపరి మళభరితమైన పూలమాలలతోను శ్రీవారి ఉత్సవమూర్తులను నయనాభి రామంగా విశేషరీతిలో అలంకరిస్తారు.

### శ్రీవారి సేనాధిపతి

శ్రీవారి సర్వభూపాల వాహనం పక్కనే మరొక పీఠంపైన దక్షిణాభి ముఖంగా సేనాధిపతి శ్రీవిష్వక్సేనులవారిని వేంచేపు చేసి దివ్యాభరణాలతో, పూలమాలలతో అలంకరిస్తారు. శిరస్త్రాణాన్ని, ఖడ్గాన్ని ధరించి అత్యంత భయభక్తులతో శ్రీస్వామివారి ఆజ్ఞలను అమలుపరచడానికి సిద్ధమై సర్వసన్నద్ధమై ఉంటాడు శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుల వారు. పిదప, ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి, బంగారు వాకిలి ముందర 'ఉగాది పండుగ వేడుక'కు సిద్ధంగా ఉన్న శ్రీవారి ఉత్సవమూర్తులకు, సేనాధిపతికి క్రింది విధంగా విశేషంగా పిండివంటలు నివేదింపబడతాయి.

### విశేషంగా పిండివంటల నివేదన

శ్రీవారి అర్చకస్వాములు, పెద్దజియ్యంగార్లు, చిన్నజియ్యంగార్లు, ఏకాంగులు, ఆచార్య పురుషులు, వేదపండితులు, దేవస్థానం శ్రీకార్యనిర్వాహకులు, ఇతర అధికారులు, దేవస్థానం ధర్మకర్తలమండలి అధ్యక్షులు, సభ్యులు, దేవస్థానంవారి ఆలయం పేష్కార్లు, ఆలయంలోని సిబ్బంది- ఇలా అందరూ ఛత్రచామరాలతో మంగళవాయిద్యాలు మోగింపబడుతూండగా, వేదపఠనం శ్రుతి శుభగంగా పఠింపబడుతుండగా, శ్రీవారి వంటవాళ్లు అప్పటికే సిద్ధంగా ఉంచిన విశేషవంటకాలను వంటశాలనుండి శ్రీవారి నివేదనకు ఊరేగింపుగా తీసుకువస్తారు.

లడ్డులు, వడలు, అప్పాలు, దోసెలు, మున్నగు పిండివంటలూ; చక్కెరపొంగలి, మిరియపు పొంగలి, పులిహోర, దధ్యోదనం మున్నగు అన్నప్రసాదాలను విమానప్రదక్షిణంలో బంగారు బావి పక్కన ఉన్న వంటశాలనుండి ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ వెండివాకిలి ఎదురుగా బయట ఉన్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణం చేస్తూ, లోనికి వచ్చి, ఆలయప్రవేశం చేసి అటు గర్భాలయంలోను, ఇటు బంగారువాకిలి దగ్గర ఆస్థానంలోను నివేదనకు ఉంచుతారు. నైవేద్యఘంటలు హృదయం గమంగా, వీనుల విందుగా, మోగింపబడుతుండగా, రెండుచోట్ల ఈ విశేష నివేదన జరుగుతోంది. ఇలా రెండుచోట్ల విశేషనివేదన పూర్తి అయిన వెంటనే మరో విశేష ఘట్టం ప్రారంభమవుతుంది. అదే వస్త్రాల సమర్పణ.

### పట్టువస్త్రాల సమర్పణ

నివేదనలు పూర్తి అయిన తర్వాత విమాన ప్రదక్షిణంలో ఈశాన్యమూలలోని శ్రీయోగనరసింహస్వామి ఆలయం పక్కన ఉన్న "పరిమళపు అర" దగ్గర నుండి శ్రీశ్రీశ్రీ పెద్దజియ్యంగార్లు పెద్దవెండి పళ్లెంలో మడతపెట్టి చుట్టగా చుట్టబడిన బంగారు జరీ అంచు ఉన్న ఆరు పెద్దపట్టువస్త్రాలను తలమీద పెట్టుకొని ఛత్రచామర మంగళవాద్యపురస్సరంగా ముందు పంచముఖ దివిటీలు వెలుగుతుండగా, సన్నదోలు, కంచు పలక గంటలు మోగింపబడుతుండగా వేదపారాయణాలు హృదయంగ మంగా పఠింపబడుతుంటాయి. వారందరి వెంట శ్రీశ్రీశ్రీ చిన్నజియ్యంగార్లు, ఏకాంగులు, దేవస్థానం శ్రీకార్యనిర్వ హణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు, దేవా లయం ఉపకార్యనిర్వహణాధికారులు, పేష్కార్లు, పారు పత్యదార్లు మున్నగు ఆలయ అధికార బృందం వెంట రాగా, ఆలయం వెండివాకిలి ముందు ఉన్న బంగారు ధ్వజస్తంభానికి బలిపీఠానికి ప్రదక్షిణం చేస్తూ, లోనికి వచ్చి విమానప్రదక్షిణం చేస్తూ 'బంగారువాకిలి' దగ్గరకు రాగా, అక్కడ బాజా భజంత్రీలవాళ్లు బంగారువాకిలి దగ్గరే నిలిచి వాయిస్తారు. 'సన్నిధిగొల్ల' దివిటీతో, పట్టు వస్త్రాలతో కూడిన జియ్యంగార్లను, వగైరా పెద్ద లందరినీ శ్రీవారి సన్నిధివరకు పిలుచుకొని వెళ్లి



'కులశేఖరపడి' వద్ద నిలుస్తాడు. శ్రీజియ్యంగార్లు, ఏకాంగులు మాత్రమే అర్చకస్వాములకు పట్టువస్త్రాలను అందిస్తారు. వెంటనే అర్చక స్వాములు కులశేఖరపడి (గర్భాలయంగడప) దగ్గర తెరను వేస్తారు.

లోపల అర్చకులు జియ్యంగార్లు సమర్పించిన ఆరు పట్టు వస్త్రాల్లో, నాలిగింటిని శ్రీవేంకటేశ్వరస్వామివారి మూల మూర్తికి అలంకరిస్తారు. ఒక వస్త్రాన్ని శ్రీవారికిరీటానికి, రెండవ దాన్ని నందకఖడ్గానికి, మూడవదానిని ఆదితోమాలగాను, నాలుగవ దాన్ని ఉత్తరీయంగాను అలంకరిస్తారు. అర్చకస్వామి వారు తెరను తొలగించి శ్రీవేంకటేశ్వరస్వామి, దివ్యమంగళ విరాణ్మూర్తికి బంగారుపళ్లెంలో పచ్చకర్పూరంతో ఆపాదమస్తకం దివ్య మంగళ కర్పూరనీరాజనం ఇచ్చి, అందరికీ చూపించగా, కులశేఖర పడికి ఇవతల ఉన్న వారందరు భక్తిగా శ్రీవారిని చూస్తూ హారతిని కళ్లకద్దుకుంటారు. ఆ తర్వాత...

### చందనం, తీర్థం, శఠారి స్వీకారం

ముందుగా అర్చకులు తాము చందన తీర్థశఠారుల్ని స్వీకరించిన పిదప వరుసక్రమంలో పెద్దజియ్యంగారికి, చిన్నజియ్యంగారికి, ఏకాంగికి, ఆచార్య పురుషులకు, తాళ్లపాకవారికి తీర్థం, శఠారి, చందనం తాంబూలాలను అర్చకులు ఇస్తారు. ఆ తర్వాత సర్కారు వారు అయిన దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారికి, తదితర అధికారులకు కూడ పై విధంగానే తీర్థ, చందన శఠారుల్ని సాయించి తాంబూలమిస్తారు.

### 'ఉగాది పండుగ వేడుక'లో శ్రీవారికి విశేష వస్త్రసమర్పణ

ఆ తర్వాత మిగిలిన రెండు పట్టువస్త్రాలను ఉన్న వెండి పళ్లాన్ని పెద్దజియ్యంగారు శిరస్సుపై ధరించి బంగారువాకిలి దగ్గర 'ఉగాది ఆస్థానం'కు సిద్ధంగా ఉన్న శ్రీవారి ఉత్సవమూర్తులకు సమర్పిస్తారు. అర్చకులు ఆ రెండింటిలో ఒక వస్త్రాన్ని శ్రీమలయప్ప స్వామికి, రెండవదాన్ని సేనాధిపతి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు.

### శ్రీవారికి అక్షతారోపణ

పిదప ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారిపాద వస్త్రంతో పరివట్టం (పరివేష్టనం, తలకు చుట్టు కట్టే చిన్నపట్టు గుడ్డ) కట్టుకొని శ్రీమలయప్పవారిపై, విష్వక్సేనులపై కుంకుమాక్షతలను (అక్షతారోపణం) చల్లుతారు. ఆ తర్వాత సేనాధిపతి వారికి పరివట్టం కట్టి శ్రీస్వామివారి పాదాలమీది అక్షతలను తీసుకొని విష్వక్సేనులపై చల్లి శఠారి మర్యాదలను జరుపుతారు.


### అర్చకులకు తండులదానం-ఆనందనిలయునికి ఆశీర్వచనం

శ్రీవేంకటేశ్వరస్వామివారు అర్చకులకు తండుల (బియ్యం) దానం తాంబూలం దక్షిణలతో సహా ఇస్తారు. ఇలా బియ్యంతో పాటు దక్షిణతాంబూలాలను స్వీకరించిన అర్చకస్వామి, సాక్షాత్తు ఆనంద నిలయుణ్ణి "నిత్యైశ్వర్యో భవ!" అని ఆశీర్వదిస్తారు. సాక్షాత్తు శ్రీనివాసుని నుండి దానం తీసుకొంటూ ఆ స్వామివారినే "స్వామీ! శ్రీనివాసా! నిత్యమూ ఐశ్వర్యపరంపరలతో వర్ధిల్లవయ్యా!" అని ఆశీర్వదించే శ్రీవారి అర్చకుల భాగ్యం ఎంతటిదో కదా! ఇలా ఆశీర్వచనం చేసిన ప్రధాన అర్చకులకు మరొక అర్చకులు పరివట్టం కట్టి శఠారి మర్యాదలు చేస్తారు.

### ఉగాది పండుగనాటి పంచాంగశ్రవణం

బంగారు సర్వభూపాలవాహనంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి పాదాలచెంత ఉన్న నూతన సంవత్సర పంచాంగాన్ని శ్రీస్వామివారికి నమస్కరిస్తూ అర్చకులు ఆస్థాన సిద్ధాంతికి అందజేస్తారు.

ఆస్థాన సిద్ధాంతి, శ్రీవారికి ఆనాటి తిథివార నక్షత్రాలతో పాటు నూతనసంవత్సర ఫలితాలు, లాభనష్టాలు, నవగ్రహాల సంచారం, సస్యవృద్ధి, పశువృద్ధి మున్నగు విషయాలతో పాటు 27 నక్షత్రజాతకుల కందాయఫలాలను, ఆదాయవ్యయాలను, రాజ పూజ్యత, అవమానాలను పంచాంగశ్రవణంలో వినిపిస్తారు. మళ్లీ ప్రత్యేకంగా, "స్వామీ! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! ఆది మధ్యాంతరహితా! జగదేకసార్వభౌమా! శ్రీమత్ రాజాధిరాజపరమేశ్వరా! నిత్యకల్యాణచక్రవర్తీ! శ్రీమదలమేల్మంగపతీ! శ్రీమదానందనిలయవాసా! బహుపరాక్! బహుపరాక్! స్వామీ! తమరు శ్రీవైకుంఠాన్ని విడిచి ఈ భూలోక వైకుంఠంలో అవతరించిన నక్షత్రం, అత్యంత శుభప్రదమైన శ్రవణనక్షత్రం! ఈ నూతన సంవత్సరంలో మీరు మరింత దయాంతరంగులై భక్తుల పాపాల్ని, ఆర్తుల్ని పోగొడతారు. సమస్త కోరికలను తీరుస్తారు. సమస్తసంపదలను అనుగ్రహిస్తారు. శుభపరంపరల్ని గుప్పిస్తారు. అందుకే స్వామీ! ఈ నూతన సంవత్సరంలో లక్షలాదిమంది భక్తులు మీ దివ్యమంగళ సౌందర్యమూర్తి దర్శనంకోసం అర్రులు చాస్తూ నిరంతరం నిరంతరాయంగా తిరుమలకు వస్తారు. మీకు ఉత్సవాలు, ఊరేగింపులు ఇంకా వైభవంగా నిర్వహింపబడతాయి. భక్తులు ఇబ్బడి ముబ్బడిగా కానుకలను సమర్పించుకొంటారు. ఇంకా మీ కనుసన్నల్లో మెలిగే నవగ్రహదేవతలు మీ భక్తుల్ని ఇబ్బంది పెట్టకుండా సర్వదా కాపాడతారు. దేశమంతా సస్యశ్యామలంగా ఉంటుంది. కాలానుగుణంగా అక్కడక్కడా అతివృష్టి, అనావృష్టి,



రోగాది భయాలు ఉన్నా మీ అనుగ్రహం వల్ల మీ భక్తులు సర్వత్రా ఆనందంగా ఉంటారు. సుఖంగా ఉంటారు." అని ఆస్థానసిద్ధాంతి నూతన పంచాంగశ్రవణం చేస్తుండగా ఘన శ్రీవేంకటేశుడు సర్వభూపాలవాహనంలో, చెవులార పంచాంగాన్ని వింటూ, ఓరచూపులతో శ్రీదేవిభూదేవేరులను చూస్తూ, చిన్మయహాసంతో తలను పంకిస్తూ భక్తులందర్నీ అర మోడ్పు కన్నులతో, చూపులతో చూస్తూ, నిండుగా, మెండుగా అనుగ్రహిస్తారు. ఆ తర్వాత ఆస్థాన సిద్ధాంతి శ్రీదేవీభూదేవేరులకు వరుసగా వారి నక్షత్రాలయిన ఉత్తరఫల్గుణి, రేవతీ నక్షత్రఫలితాలను చెప్పిన తర్వాత, అక్కడ ఉన్న శ్రీకార్యనిర్వహణాధికారుల, సంయుక్త కార్యనిర్వహణాధికారుల, ధర్మకర్తలమండలి సభ్యుల అక్కడ ఉన్న ఆలయఅధికారుల నక్షత్రఫలితాల్ని విన్పిస్తారు.

ఇలా పంచాంగశ్రవణం చేయించిన ఆస్థానసిద్ధాంతికి శ్రీస్వామి అర్చకులు శ్రీస్వామివారి పాదాలమీది అక్షతలను శిరస్సుపై చల్లుతూ శఠారిని అనుగ్రహిస్తారు.

పిదప శ్రీవారి బొక్కసం గుమాస్తా లేచి, అత్యంత భయ భక్తులతో స్వామివారికి సాష్టాంగనమస్కారం చేసి, నిలబడి, ముందురోజు వచ్చిన హుండీరాబడిని, ఆదాయవ్యయాలను, ఉత్సవవిశేషాలను, దేవస్థానం ఇతర ఆలయ ఉత్సవవిశేషాలను విన్పించిన తర్వాత, 'దేవరవారు చిత్తగించ వలెను'- అంటూ సాష్టాంగనమస్కారం చేసిన తర్వాత శఠారి అనుగ్రహం పొందుతారు.



వెంటనే 'కొలువు పళ్లెం' అనే బంగారు తట్టలో నవనీత హారతిని శ్రీవారికి ఇచ్చిన తదుపరి, అర్చకులు ఆ హారతిని కార్యనిర్వహణాధికారిగారికి ఇచ్చిన తర్వాత అందరికి చూపిస్తారు.

ఆ తర్వాత తాళ్లపాక, తరిగొండ, మహంతు, మైసూరు వారి హారతులు ప్రత్యేకంగా సమర్పించబడతాయి. పిదప అక్కడ చేరిన భక్తులందరినుండి ఒక్కొక్క రూపాయను సేకరించి ప్రత్యేకంగా అందరిపక్షాన 'రూపాయహారతి'ని ఇస్తారు. ఇలా సేకరించిన రూపాయలను కార్యనిర్వహణాధికారిగారు ఖజానాకు జమ చేస్తారు.

చివరగా శ్రీమాన్ పెద్ద జియ్యంగారికి, పిదప దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారికి, పరివట్టం కట్టి శఠారిని అనుగ్రహించిన తర్వాత శ్రీవారిప్రసాద వినియోగం, అక్షతతాంబూల సత్కారం సంప్రదాయబద్ధంగా జరుపబడుతుంది. ఇంతటితో 'తిరుమలేశుడి ఉగాది' పండుగ నాటి ఆస్థానవేడుకలు సంపూర్తి అవుతాయి.

ఉగాదిపండుగనాడు పంచాంగశ్రవణం చేస్తే, శత్రు నాశం, జరుగుతుంది. దుస్స్వప్నాలు తొలగుతాయి. గంగా స్నానఫలం, గోదానఫలం కలిగి ఆయుష్షు పెరుగుతుంది. సత్సంతానం కలుగుతుంది. అందులోను తిరుమలేశుడు లోకకల్యాణం కోసం చేస్తున్న ఉగాది పంచాంగశ్రవణం ఇది.

శ్రీవారిఆలయంలో ఉగాది పర్వదినాన ఉదయం పూట బంగారువాకిళ్ల ముందర ఏకాంతంగా జరిగే "తిరుమలేశుడి ఉగాది పండుగ వేడుక"ను వీక్షించలేదే అన్న అసంతృప్తికి లోనుగా కుండా. శ్రీనివాసుణ్ణి స్మరించండి. అందరి ఇండ్లూ ఆనంద నిలయాలే! అందరి వాకిళ్లు బంగారు వాకిళ్లే, అందరి లోగిళ్లూ, ఘంటామండపాలే! అందరి హృదయాలూ సర్వభూపాల వాహనాలే! మీ మీ హృదయాల్లో శ్రీనివాస భగవానుణ్ణి ప్రతిష్ఠించుకోండి! మీ ఇండ్లలో, మీ హృదయాల్లో నూతన పంచాంగశ్రవణం చేయండి. ఆ శ్రీనివాసప్రభువుదయతో ఈ నూతన సంవత్సరంలో సర్వశ్రేయస్సులను సంపూర్ణంగా పొందండి!

**లలిత**

సకలబలంబులు నీవే సర్వేశ్వర నాకు
అకలంకంబగు సుఖమే అన్నిట నిదే నాకు

పొందుగ చక్రాంకితమే బుజబల మిదె నాకు
అందిన హరి నీచింతే ఆత్మబలము నాకు
సందడి పేరుబలము కేశవనామము నాకు
యిందును నందును భవభయ మిఁక లేదిదే నాకు

అంగపు తిరుమణి లివి పంచాంగబలము నాకు
సంగతి నీపై పాటలె స్వరబలి మీదే నాకు
రంగుగ నీ గుణరాసులే రాసిబలము నాకు
యింగితముగ నిహపరముల కెదురే దిదే నాకు

కనుగొను నీ విగ్రహమే గ్రహబలి మిదె నాకు
విను నీ దాసుల సేవే వెనుబలి మిదె నాకు
తనరిన శ్రీ వేంకటపతిదైవబలము నాకు
ఘనమే చెప్పగ నింతట కలిగెబో యిదే నాకు

- తాళ్లపాక అన్నమాచార్యులు.

ఓం నమో వేంకటేశాయ!

# శ్రీవేదనారాయణస్వామి ఆలయం, నాగలాపురం

– డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు

మత్స్యావతారాన్ని ధరించి వేదాలను రక్షించిన శ్రీమన్నారాయణుడు శ్రీవేదనారాయణస్వామి పేరుతో మత్స్య రూపంలో కొలువుదీరి పూజలందుకొంటూ ఉన్న క్షేత్రం– నాగలాపురం!

తిరుపతి జిల్లాలో తిరుపతి పట్టణానికి సుమారు 75 కిలోమీటర్ల దూరంలో నాగలాపురం ఉంది. సామాన్యశకం 1519, 1523 నాటి శాసనాలలో 'నాగలాదేవి అమ్మన్‌పురము', 'నాగలాదేవిపురము' అని ఈ ఊరి పేరు పేర్కొనబడింది. సాహితీసమరాంగణసార్వభౌముడుగా ప్రసిద్ధిచెందిన విజయ నగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తన తల్లి అయిన నాగలాంబ పేరు మీద నిర్మించిన ఊరు కనుక ఈ క్షేత్రానికి ఆ పేర్లు ఏర్పడ్డాయి. నాగలాదేవిపురం అని పిలువబడిన ఈ క్షేత్రం పేరు ప్రజల వాడుకలో నాగలాపురంగా మారినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

## స్థలపురాణం

నాగలాపురంలో శ్రీవేదనారాయణస్వామి కొలువు దీరడం వెనుక ఆసక్తికరమైన పురాణ, స్థలపురాణ కథనాలు ప్రచారంలో ఉన్నాయి. శ్రీమన్నారాయణుడు యోగనిద్రలో ఉన్న సమయంలో చేతిలోని శంఖం జారి ప్రళయజలాల్లో పడింది. ఆ శంఖం నుండి ఒక రాక్షసుడు జన్మించాడు. ఆ రాక్షసుడికే శంఖాసురుడు, సోమకాసురుడు అని పేరు. పెద్దశరీరాన్ని కలిగిన సోమకాసురుడు ఆకలితో అరుస్తూ... ఆహారంకోసం వివిధచోట్ల వెదుకుతూ చివరకు సత్యలోకం చేరి బ్రహ్మదేవుడిని మింగేందుకు ప్రయత్నించాడు. దీనితో భయపడిన బ్రహ్మదేవుడు పారిపోయేందుకు లేచాడు. ఫలితంగా బ్రహ్మదేవుడి తొడపైన ఉన్న వేదకోశం క్రింద పడింది. దానిని సోమకాసురుడు మింగి వేసి సముద్రం అడుగుభాగంలోకి వెళ్ళిపోయాడు. సృష్టి చేసేందుకు ఆధారమైన వేదగ్రంథాలను సోమకాసురుడు మింగి వేయడంతో కంగారుపడిన బ్రహ్మదేవుడు భయాందోళనలకులోనై శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళి జరిగిన విషయాన్ని వివరించాడు. దీనితో శ్రీమన్నారాయణుడు మత్స్యావతారాన్ని ధరించి, జలములో ప్రవేశించి దినదినానికి పెరుగుతూ సోమకాసురుడి వద్దకు వెళ్లి, శిరస్సును ఖండించి, వేదాలను రక్షించి బ్రహ్మదేవుడికి ఇవ్వగా బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించినట్లు పురాణకథనం.

ఈ విధంగా వేదాలను రక్షించిన మత్స్యావతారరూపు డైన శ్రీహరి శ్రీవేదనారాయణస్వామిగా నాగలాపురంలో కొలువు దీరినట్లు చెప్పబడుతూ ఉంది. ఈ విధంగా కొలువుదీరిన స్వామివారికి శ్రీకృష్ణదేవరాయలు ఆలయాన్ని నిర్మింపజేశాడు. శ్రీకృష్ణదేవరాయలు దక్షిణదిగ్విజయయాత్రలను ముగించుకొని కుంభకోణం నుంచి తిరిగి రాజధానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగలాపురం ప్రాంతానికి చేరుకొని విశ్రాంతి తీసుకొన్నాడు. ఒకరోజు స్వప్నంలో శ్రీవేదనారాయణస్వామి సాక్షాత్కరించి తాను ముళ్ళపొదలలో ఉన్నట్లు, వెలుపలకు తీసి ఆలయాన్ని



నిర్మించమని ఆదేశించాడు. దీనితో శ్రీకృష్ణదేవరాయలు చుట్టు ప్రక్కల ప్రాంతాన్ని శుభ్రం చేసి తన తల్లిపేరు మీద ఒక ఊరును నిర్మించి, అందులో శ్రీవేదనారాయణస్వామివారికి ఆలయాన్ని నిర్మింపచేసినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

## ఆలయ విశేషాలు

నాగలాపురంలోని శ్రీవేదనారాయణస్వామి ఆలయం విశాలమైన ప్రాంగణంలో మూడు ప్రాకారాలతో, గోపురాలతో, వివిధదేవతామూర్తులతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ దర్శనమిస్తుంది. ఆలయంలోనికి ప్రవేశించేందుకు నాలుగు వైపులా నాలుగు గోపురాలు ఉన్నాయి. అందులో ప్రధానమైంది పశ్చిమద్వారం. ప్రధానఆలయం పశ్చిమాభిముఖంగా ఉంది. పశ్చిమద్వారం పైన ఒకే అంతస్తు గోపురం నిర్మింపబడి ఉంది. ఈ గోపురమండపంలో శ్రీదేవి, భూదేవిసమేతుడైన శ్రీవేద నారాయణస్వామివారి శిల్పాలు దర్శనమిస్తాయి. ఈ ద్వారం గుండాలోనికి ప్రవేశిస్తూనే ఎదురుగా రెండో ప్రాకారం దర్శన మిస్తుంది. రెండవ ప్రాకారద్వారంపైన ఐదు అంతస్తులు, పైన ఏడు గోపురకలశాలను కలిగిన గోపురం నిర్మింపబడి ఉంది. ఈ గోపురద్వారం గుండా లోపలికి ప్రవేశిస్తే ప్రధాన ఆలయం దర్శనమిస్తుంది. రెండవ ప్రాకారంలోని ఉపాలయాల్లో శ్రీ వీరాంజనేయస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీకోదండరామ స్వామివారలు కొలువుదీరి పూజలందుకొంటూ ఉన్నారు. ప్రధానఆలయానికి ఎదురుగా బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడా ళ్వారు మండపం ఉన్నాయి. ప్రధానఆలయప్రవేశద్వారంపై మూడు అంతస్తుల గోపురం, దానిపై ఐదు గోపురకలశాలు ప్రతిష్ఠింపబడి దర్శనమిస్తుంది. ప్రధానఆలయం మహా మండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది.

మహామండపప్రవేశద్వారానికి ఇరువైపులా శ్రీ వినాయ కుడు, శ్రీదుర్గాదేవిలు కొలువుదీరి ఉన్నారు. మహామండపం నుంచి ముఖమండపంలోనికి ప్రవేశించగానే ప్రదక్షిణా మండపం ఉంది. ముఖమండపంలో శ్రీవిష్వక్సేనులు, శ్రీశంక రులు, శ్రీరామానుజాచార్యులు, శ్రీఆంజనేయస్వామి, ఆళ్వారులు కొలువుదీరి ఉన్నారు. ముఖమండపంనుంచి అంతరాలయానికి ప్రవేశించే ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులు ఉన్నారు.

ప్రధాన గర్భాలయంలో శ్రీవేదనారాయణస్వామివారు తన దేవేరులైన శ్రీదేవి, భూదేవిసమేతంగా కొలువుదీరి పూజ లందుకొంటూ ఉన్నాడు. చతుర్భుజుడైన స్వామి నడుము నుంచిమత్స్యరూపంలో ఉన్నాడు. ఆలయంలోని ప్రదక్షిణా మండపంలో శ్రీభూవరాహస్వామి, శ్రీవీణాధరదక్షిణామూర్తి, వినాయకుడు, బ్రహ్మదేవుడు, త్రివిక్రమమూర్తి, దుర్గాదేవి,



త్రిమూర్తి, లక్ష్మీవరాహస్వామి, వేణుగోపాలస్వామి, లక్ష్మీ నారాయణస్వామి, శ్రీహయగ్రీవుడు, భూదేవి, విష్ణుమూర్తి వంటి అనేకమంది దేవతామూర్తులు కొలువుదీరి ఉన్నారు. త్రిమూర్తి విగ్రహం విశిష్టమైంది. ఈ విగ్రహాన్ని తాకితే సప్తస్వరాలు వినిపిస్తూ ఉండటం విశేషం.

కాగా గర్భాలయంలో కొలువుదీరిన స్వామివారి మూలవిరాట్టుపైన ప్రతి సంవత్సరం మార్చి 24 నుంచి ఐదురోజులపాటు సూర్యకిరణాలు ప్రసరించడం విశేషం. దీనికి **'సూర్యసేవ'** అని పేరు.




స్వామివారి ప్రధానఆలయానికి ఎదురుగా నైఋతీ మూలలో స్వామివారి దేవేరి ప్రత్యేకఆలయంలో శ్రీవేదవల్లీ అమ్మవారు కొలువుదీరి పూజలందుకొంటూ ఉన్నారు. తూర్పు అభిముఖంగా ఉన్న అమ్మవారి ఆలయం మహామండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. గర్భాలయంలో చతుర్భుజాలను కలిగిన శ్రీవేదవల్లీ అమ్మవారు కొలువుదీరి భక్తులపై కరుణాకటాక్షాలను ప్రసరింపజేస్తూ దర్శనమిస్తుంది.

## చరిత్ర

ఆలయంలో లభ్యమైన తెలుగు, కన్నడశాసనాలు ఆలయచరిత్రను వివరిస్తూ ఉన్నాయి. వీటి ప్రకారం సాహితీ సమరాంగణసార్వభౌముడుగా ప్రసిద్ధిచెందిన విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు(1509–29) ఈ ఆలయాన్ని నిర్మింపచేయడంతోపాటు ఆలయనిర్వహణకు కావలసిన ద్రవ్యములను సమకూర్చినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయంలో పూజారులను ఏర్పాటుచేసి వారికి మడిమాన్యాలను ఇవ్వడంతో పాటు వడమాల అనే హరిదాసుకు ఆలయనిర్వహణాబాధ్యతను అప్పగించి, ఆయనకు హరికందాపురం అనే గ్రామాన్ని దానంగా ఇచ్చినట్లు శాసనాల్లో పేర్కొనబడింది. స్థానికుల ఆధ్వర్యంలోనూ, తిరుత్తణి ఆలయ ఆధ్వర్యంలోనూ నడిచిన ఆలయపాలనాబాధ్యతలను 1967వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు చేపట్టారు. ప్రస్తుతం ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆధ్వర్యంలో నడుస్తోంది. తిరుపతి నుంచి 70, పుత్తూరు నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగలాపురానికి తిరుపతి, పుత్తూరు, నగరి, చిత్తూరు, చెన్నైల నుంచి బస్సు సౌకర్యాలు ఉన్నాయి. తిరుపతి విష్ణునివాసం నుంచి ప్రతిరోజూ రాష్ట్రరోడ్డురవాణాసంస్థవారు నడుపుతూ ఉన్న పర్యాటక బస్సులో వెళ్ళి కూడా ఈ క్షేత్రాన్ని దర్శించుకోవచ్చు.

మత్స్యావతారంలో అపురూపదేవుడుగా పేరుపొందిన నాగలాపురం శ్రీవేదనారాయణస్వామివారిని దర్శించి భక్తులు తరించవచ్చు.





ధారావాహిక

# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

రాజమర్యాదలతో ఆచార్యులకు ఘనస్వాగతం లభిస్తుంది. రాజదంపతులు యతిరాజులకు పాదపూజ చేసి తాము, సభాసదులు పాదతీర్థం స్వీకరిస్తారు. ఆచార్యుల పవిత్రపాద తీర్థాన్ని రాజభవనమంతటా చల్లమని రాజు ఆజ్ఞాపిస్తాడు. యువరాణిని ఆచార్యుల సమక్షానికి తీసుకువచ్చి, భగవానునికి నివేదించిన తీర్థప్రసాదాలు యువరాణికి ఇవ్వగానే ఆమె అత్యంత శ్రద్ధాభక్తులతో స్వీకరిస్తుంది. రాజదంపతులు, రాజవైద్యులు ఆశ్చర్యపోతారు. అంబుజవల్లితాయార్‌కు సమర్పించిన పసుపు, గంధము యువరాణి నుదుట ఉంచగానే యువరాణి స్పృహతప్పి పడిపోతుంది.

యువరాణిపై రామానుజుల కృపాదృష్టి ప్రసరించగానే ఆమెను అప్పటిదాకా ఆవహించిన దుష్టశక్తి వదిలిపోతుంది. (నారదుడు రామానుజాచార్యులు గతంలో యాదవప్రకాశుల శిష్యులుగా ఉన్నప్పుడు ఇటువంటి సంఘటనే జరిగిందని గంధర్వులకు చెబుతాడు. అప్పుడు కూడా ఒక రాకుమారిని దుష్టశక్తి ఆవహించి పీడిస్తుంటే యాదవప్రకాశుడు ఆ పిశాచాన్ని పారద్రోలలేకపోయాడు. అతడి శిష్యుడైన రామానుజుడు తన పాదాన్ని తన తలపై ఉంచితేనే తాను యువరాణిని విడిచి వెళ్తానని పిశాచం యాదవప్రకాశుడితో చెప్పగా అదేవిధంగా చెయ్యటం జరుగుతుంది. శిష్యుడి ప్రతిభ యాదవప్రకాశుడికి ఈర్ష్య కలిగిస్తుంది)

తొండనూర్ యువరాణి మూర్ఛనుండి తేరుకుని ఆచార్యులకు నమస్కరించి తన మందిరానికి వెళ్తుంది. అప్పటి దాకా ఉన్మాదిలాగా ప్రవర్తించిన యువరాణి తన తల్లితో తనను అలంకరించమని కోరి, అటుపై ఆచార్యుల ఆశీర్వాదం తీసుకుంటుంది.

మరునాడు బిట్టిదేవరాజు, రాజపరివారం నంబి నారాయణ సన్నిధికి చేరుకొని ఆచార్యుల అనుగ్రహభాషణం విన్నారు. తాము శ్రీవైష్ణవమతాన్ని అవలంబించాలనే కోరిక సవినయంగా వ్యక్తం చేస్తే ఒక శుభముహూర్తంలో పంచ సంస్కారం నిర్వహిస్తామని ఆచార్యులు వాగ్దానం చేశారు.

## రామానుజులు బిట్టిదేవునికి దాసనామం ప్రసాదించుట

ఒక శుభముహూర్తాన రాజు, రాణి సపరివారంగా నంబినారాయణ సన్నిధికి చేరుకున్నారు. ఆచార్యులు తమ నిత్యానుష్ఠానం ముగించుకుని తొండనూర్‌నంబి, వడుగనంబి చేదోడుగా తమ స్వహస్తాలతో బిట్టిదేవునికి, పరివారానికి పంచసంస్కారం నిర్వహించారు. బిట్టిదేవ ప్రభువుకు **'విష్ణువర్ధన'** అనే దాసనామం ప్రసాదించారు.

ఆ నాటినుండి హొయసల రాజ్యంలో (మేల్నాడు) శ్రీవైష్ణవం సుస్థిరంగా వేళ్ళూనింది. అప్పుడు గొప్ప ఉత్సవము, ప్రజలకు విందు ఏర్పాటు చేశారు. (ఈ వృత్తాంతం చెబుతున్న శ్రీకరస్వామి ఉద్వేగానికిలోనై , గతంలో జరిగిన గొప్పసంఘటన ఊహించుకుని ధారాపాతంగా కన్నీరు కార్చారు.)

*(ఇంకా ఉంది)*

మార్చి 30న
'విశ్వావసు'
నామసంవత్సర
ఉగాది
సందర్భంగా...



# వసంతశోభలకు పునాది ఉగాది

- శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

ప్రకృతి విలసనంతో మరో **'ఉగాది'** పర్వం ప్రభవించింది. చైత్రశుద్ధపాడ్యమి ఉగాది పర్వదినం. తెలుగునాట ఆనందోత్సాహాలతో నూతనసంవత్సర ఆరంభం కావించే దినమే ఉగాది. అదే నవ్యాశలకు పునాది. కాలకన్య భూనభాలనే రెండు పెదవుల మధ్య ఈనాటి చిరునవ్వుల పేరే ఉగాది. అనంతమైన, అద్భుతమైన, మహోన్నతమైన సకలచరాచర సృష్టికి ఆది ఉగాది. ప్రతి యుగాదికి ఆదిలో 84లక్షల జీవరాశుల్ని సృష్టించి విశ్వరచనకు శ్రీకారం చుట్టిన క్షణమే ఉగాది.

ఉగాది ఉగాదికీ మనసు కోయిల, ఊహల మామిడి చెట్టు మీద ఆశల చివురులు తింటూ వనంలోని పచ్చదనం మా జీవనంలోనూ నింపమంటూ ఆమనికి స్వాగతం పలికే క్షణమే ఉగాది. ఏడాదికో పేరుతో వచ్చి ఊరించే ఉగాది ముందు కోరికలన్నీ ఏకరువుపెడతాయి. కష్టనష్టాల లిస్టు చెప్పి మా కన్నీళ్ళు తుడవమని చెప్పే సమయమే ఉగాది. సత్యాసత్య విచికిత్సతో, ఆత్మానాత్మ వివేచనలోపడి ప్రశ్నార్థకమై పోయేవేళ ఉద్దీపించు ఆశలకిరణమే ఉగాది.

భవిష్యత్ ఆశలతీపితో, చేదు అనుభవాలను మేళవింపజేసి, అభిరుచుల వగరుతో పొత్తుకలిపి, కఠిన నియమప్రవర్తనల కారాన్ని చేర్చి, చింతపులుపుతో రంగరించి వింత వింత పోకడల ఉత్పాతాల ఉప్పుతో నిగూఢపరచి, పరమార్థతత్త్వాన్ని చూపించి, జీవితానికి కలిగింపచేసేదే ఉగాది.

అంతేకాక ఈ **'విశ్వావసు'** నామ సంవత్సర ఉగాది నవ్యమై సుఖదుఃఖాల్ని సమం చేసి, జీవితంలో ఆశల చివుళ్ళను చివురింపచేసి, నవనవోన్మేషంగా ప్రకాశిస్తూంటుంది మరియు మానవత్వంతో పరిమళిస్తుంది.

హైందవసంస్కృతికి, ధర్మానికి సంబంధించిన పర్వాల్లో పరమార్థతత్త్వానికి ప్రాముఖ్యత ఉంది. భారతీయజాతి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలై విలసిల్లేవే మన పండుగలు. అలాంటి పండుగల్లో ప్రకృతికి సంబంధించిందే ఉగాది.

## ఉగాది ఎప్పుడు వస్తుంది?

చైత్రమాసే జగద్బ్రహ్మా- ససర్జ ప్రథమేఽహని।
శుక్లపక్షే సమగ్రం తు- తదా సూర్యోదయే సతి॥
(హేమాద్రౌ బ్రహ్మోక్తిః)

చైత్ర శుద్ధ పాడ్యమి సంవత్సరాది అవుతుంది. పాడ్యమి సూర్యోదయసమయంలో ఉండాలి. బ్రహ్మదేవుడు చైత్రశుద్ధ పాడ్యమినాడు సూర్యోదయ సమయానికి తన సృష్టినంతయు పూర్తిచేశాడు. సంవత్సరారంభమున పూర్వతిథితో కూడిన పాడ్యమినే గ్రహించాలి. చైత్రశుద్ధపాడ్యమిదినాన ఉపవాసంచేసి బ్రహ్మను పూజించిన వారు సంవత్సరమంతయు సుఖాన్ని పొందగలరు.

అమాయుక్తా న కర్తవ్యా ప్రతిపచ్చండికార్చనే।
ముహూర్తమాత్రా కర్తవ్యా ద్వితీయాది గుణాన్వితా॥
(దేవీపురాణమ్)

విదియతో కూడిన పాడ్యమినే గ్రహించాలి. అమావాస్యతోకూడిన పాడ్యమి పనికిరాదు అని దేవీపురాణం చెబుతుంది.

చైత్రశుక్ల సమారంభే- జగతాం జగదీశ్వరః।
సర్వం చక్రే తదా రాజన్- తతః తస్మిన్ సదా దినే॥

అని విష్ణుధర్మోత్తరపురాణం పేర్కొంటోంది. చైత్ర మాసం శుక్లపక్షం పాడ్యమి తిథిరోజున బ్రహ్మ సృష్టి ప్రారంభించాడు. ప్రకృతిపరంగా ఆలోచిస్తే శిశిరఋతువులో చెట్లన్నీ ఆకులు రాలుస్తాయి. వసంతఋతువు రాగానే ఎండిన మోడులు సైతం చిగిర్చి, పుష్పించి నవనవోన్మేషంగా విలసిల్లుతాయి. ఇందులో దాగిన పరమార్థమేమిటంటే...!

సకలరుగ్మతులతో బాధపడి నిరాశానిస్పృహలకు లోనయ్యే జీవుడు వసంతాగమనంతో సంతోషం, ఆనందమనే చివుళ్ళు తొడుక్కుని హాయిగా విరాజిల్లుతూ, సకలరుగ్మతుల్ని విస్మరించి, భవిష్యదాశలపై దృష్టిని సారించి ముందుకు నడుస్తాడు. అలా ధర్మమార్గంలో నడిచే నడకకే 'ఉగాది' అని పేరు.

## యుగాది-ఉగాది...!!

ఉగాది(ఉగ+ఆది) అంటే సంవత్సరాది అని పేర్కొంటున్నాం కదా!

**"అహస్సంవత్సరో వ్యాళః"** – విష్ణుసహస్రనామం.

**"కాలాత్మనా స్థితః విష్ణుః సంవత్సరః"** అని శంకర భాష్యం స్పష్టం చేస్తున్నాయి. కాలస్వరూపుడైన శ్రీమహావిష్ణువే సంవత్సరమని భావం.

**"ఉగాది"** తెలుగు పదమైతే దీనికి సంస్కృతరూపం **'యుగాది'.** యుగాదే ఉగాదిగా మారింది.

'ఉగ' అంటే నక్షత్రగమనం. సృష్టికార్యం ప్రారంభమైన రోజే ఉగాది. సూర్యుడు చైత్రమాస శుక్లపక్ష పాడ్యమినాడు భూమధ్యరేఖపైయుండుట వల్ల చంద్రగమనం శుక్లపక్ష పాడ్యమి, అశ్వినీనక్షత్రంతో ప్రారంభమైనందున ఈ రెండూ కలిసే చైత్రశుద్ధ పాడ్యమినాడు యుగదినాన వర్షారంభం అవుతుందని సిద్ధాంతీకరింపబడింది.

"యుగము" అంటే 'జన్మ' అని యాజ్ఞవల్క్యమహర్షి వివరించాడు. **"జన్మాద్యస్య యతః"** వ్యాసభగవానుని రెండవ బ్రహ్మసూత్రము. అంటే ఈ జగత్తు జన్మాది బ్రహ్మమని అర్థం.

ఈ 'యుగ' శబ్దానికి దేవుడు, వేదము, రథము, బండి కాడి అని అర్థాలు ఉండడం వల్ల సహజంగా వివాహ సమయంలో లగ్నం కాగానే వెంటనే వివాహప్రక్రియ యుగం (బండికాడి)తో ప్రారంభమవుతుంది. వరుడు వధువు తలమీద యుగాన్ని (బండికాడి) ఉంచి ఆ కాడి రంధ్రాల ద్వారా ఆవు పాలతో అభిషేకించి ఆమెను పవిత్రురాల్ని చేస్తాడు.

## ఉగాది పచ్చడి వైశిష్ట్యం ..!!


**శతాయుర్వజ్రదేహాయః సర్వసంపత్కరాయ చ।**
**సర్వారిష్టవినాశాయ నింబ కుసుమ భక్షణం॥ (ధర్మసింధు)**

వేపపూత పచ్చడిని సేవించడం వల్ల సర్వారిష్టాలు తొలగి సర్వసంపదలు కలిగించే అదృష్టం పెరిగి, దీర్ఘాయువు, వజ్రంలాంటి దేహదారుఢ్యం, శాంతి కలుగుతాయి.

అయితే ఈ వేపపూవు షడ్రుచులలో కలిసి ఉగాది పచ్చడిగా సేవిస్తారు. దీని అంతరార్థం జీవితంలో వచ్చే ఒడిదుడుకులు, ఆటుపోట్లు, సుఖదుఃఖాలను ఎదుర్కొనే స్థైర్యం కొరకు ఈ ఉగాదిపచ్చడిని సేవిస్తారు. ఇది త్రిగుణాత్మక గుణాలను సమంచేసి తాత్త్వికదృష్టికి ప్రతీకగా షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించాలి. అందుకే ధర్మసింధువు ఇలా చెప్పింది.

**నూతన సంవత్సరం కీర్తనాద్యారంభం।**
**ప్రతిగృహ ధ్వజారోహణం నింబపత్రాశనం।**
**వత్సరాది శ్రవణం నవరాత్రారంభః॥**

నూతన సంవత్సర (ఉగాది) ప్రారంభం రోజున ప్రతి ఇంటికి తోరణాలు కట్టి వేపపూత కల్గిన ఉగాదిపచ్చడిని సంవత్సరఫలం (పంచాంగశ్రవణం)తో తినాలి. ఆ తర్వాత ఉగాది నుండి నవమి వరకు శ్రీరామనవరాత్రులు జరపాలి. తర్వాత పంచాంగశ్రవణం చేసినవారికి **సూర్యభగవానుడు** శౌర్యాన్ని, **చంద్రుడు** ఇంద్రసమానమైన వైభవాన్ని, **కుజుడు** శుభాన్ని, **బుధుడు** బుద్ధిని, **గురుడు** ఆయుష్షును, **శుక్రుడు**



సుఖాన్ని, **శని** ఐశ్వర్యాన్ని, **రాహువు** బాహుబలాన్ని, **కేతువు** వంశాభివృద్ధిని కలుగజేస్తారని శాస్త్రప్రమాణవచనం. పంచాంగ శ్రవణం ఉగాదిరోజునే చేయాలి. అలా చేస్తే శుభప్రదం, గంగాస్నాన పుణ్యప్రదం, ఆయుర్దాయకం. అనేకకర్మల సుసాధనం అని జ్యోతిషశాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు.

విధినిర్వహణ మానకుండా ఉగాదిపురుషుని స్పర్శతో పుడమితల్లి తనువెల్లా చిగిర్చి, నిలువెల్లా పులకరిస్తుంది. ఏటువంటి ఉపప్లవాలు లేక **'విశ్వావసు'** నామ సంవత్సరాది వెలుగు దనం, తేజస్సుతో వెల్లి విరిసి ఈతిబాధల్ని నశింపచేసి శాంతి సౌఖ్యాలు కలుగజేస్తాయని ఆశిద్దాం!

**॥సర్వేజనాస్సుఖినోభవన్తు॥**

# శ్రీవేంకటేశ్వరలీలలు



# స్వామిదయ

- శ్రీ మద్దాల వెంకటసుబ్రహ్మణ్యం

లీలామానుష విగ్రహస్వరూపుడు అఘటన ఘటనా సమర్థుడు అయిన తిరుమలేశుని కరుణాసముద్రంలో మునిగి తరించనివారు చాలా అరుదు.

ఎందరికో ఇలవేల్పు, మరెందరికో నమ్మిన బంటు అయిన శ్రీస్వామివారు, మాకుటుంబంలో చేసిన లీలలు తెలియజేస్తే, ఆశ్చర్యం కలుగుతుంది. వీటిద్వారా నాస్తికులు ఆస్తికులుగా మారినా, మారకపోయినా, నాకుమాత్రం ఆదివ్య మంగళస్వరూపుడు ముందు ముందుకూడా నా కార్యక్రమాలలో ఆదుకుంటాడని నమ్మి ఈ సంఘటనలు మీ ముందు ఉంచుతున్నాను.

ఒకసారి మానాన్నగారికి మానసిక ఆందోళన కలిగింది. అలాంటి ఉన్మాద పరిస్థితిలో ఆయన ఎవరికీ లొంగక పోగా ఒకసారి నిండైన బావిలోకి కూడా దూకారు. కాని తిరుమల కొండలపై వేంచేసియున్న ఆ తిరుమలేశుని కరుణవల్ల రక్షింపబడ్డారు. అదేస్థితిలో వైద్యం చేయించాము కాని ఏవిధంగాను ఫలించలేదు. తిరుమలేశుని దర్శనంచేస్తే ఈ పరిస్థితి చక్కబడుతుందేమోనని భావించి కొండకు వెళ్దామని మానాన్నగారిని అడిగాను. ప్రతిమాటకు అడ్డంచెప్పే ఆయన తిరుపతి ఏడుకొండలవాని దర్శనానికి వెళ్లడానికి మాత్రం ఏవిధమైన అడ్డంకులు చెప్పకుండా ఒప్పుకున్నారు.




నేను, మానాన్న రాత్రి 7 గం॥ల ప్రాంతంలో తిరుమలేశుని దర్శనం చేసుకున్నాం. తిరుమల శ్రీనివాసుని దర్శనం అత్యంత శోభావహంగా, ఆనందంగా జరిగింది. తిరుగు ప్రయాణంలో మానాన్న నడిచి తప్ప, బస్సులో క్రిందకు రానన్నారు. చేసేది లేక ఆయనవెంట నేనూ, క్రిందకు దిగటం ప్రారంభించాను ఎంతో మానసిక ఉద్రేకంతో ఉన్న మా నాన్నగారికి కొండదిగేటప్పటికి ఆ ఉద్రేకం తొలగటమేకాక, పూర్ణమైన ఆరోగ్యంతో అలసట తీర్చుకుంటూ కనపడ్డారు. పూర్వపు అర్థంలేని మాటల స్థానంలో ఆయన స్పష్టమైన సంభాషణ మొదలు పెట్టి, తనపరిస్థితి చక్కబడినట్లు ఆయన చెప్పి నన్ను ఆశ్చర్యపరిచారు.

ఇలాంటి సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో... నేను వ్యక్తిగతంగా ఆ కల్యాణగుణధాముని కరుణకు ఎలా పాత్రుడనైనానో ఈ క్రింది సంఘటన తెలియబరుస్తుంది.

నేను ఒకసారి డైరక్టరు ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ అనుమతితో రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు బెంగుళూరుకు నాలుగునెలల ఇంగ్లీషు బోధనారీతుల అధ్యయన కేంద్రానికి వెళ్లాను. దురదృష్టవశాత్తు నా యాజమాన్యమువారు, వారి అనుమతి పొందలేదనే సాకుతో నాజీతం ఆపి నన్ను సంజాయిషీ అడిగి ఇబ్బందులలో ముంచారు. కుటుంబం ఒక చోట, నేను బెంగుళూరులో జీతంలేకుండా ఎలా గడపాలి? ఎన్ని సంజాయిషీలు ఇచ్చినా నెలలు గడిచినా నాకు జీతం రాలేదు సరిగదా, పరిస్థితి జటిలమయింది. గజేంద్రుని వలె నేను ఆ తిరుమలేశుని పై భారం మోపి ఆయన దర్శనానికి బయలుదేరాను. అప్పటికి 3 నెలలు గడిచాయి. నాకు తిరిగి నా కార్యక్రమనిర్వహణకు మేనేజిమెంటువారి అనుమతి వస్తుందా! రాదా! అనే పరిస్థితి కూడా ఏర్పడింది.

అయితే విచిత్రమేమంటే నేను ఆ సప్తగిరివాసుని దర్శనం చేసుకుని బెంగుళూరు చేరేటప్పటికి నాకు ఎంతో ఆశ్చర్యకరమైన విషయం స్పష్టం అయింది. అదేమంటే యాజమాన్యం వారు నాకు రావలసిన జీతం ఇచ్చుటకు నిర్ణయించటమే కాక, నాకు శిక్షణపూర్తి అయినపిమ్మట పూర్వపు స్థలంలో నేను నాబాధ్యతలు నిర్వహింపవచ్చని అనుమతిపత్రాన్ని కూడా ఇచ్చారు.

ఇంతకీ విషయం ఏమంటే నమ్మినవారికి ఆ మహానుభావుని కరుణ తప్పక లభించి తీరుతుంది. ఆయన దర్శనం చేసుకున్నవారికి బాధలు, ఏవైనా ఎలాంటివైనా సరే అవంతకు అవే తొలగుతాయి. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో!

ముఖచిత్ర కథనం

## ఉగాది ఆస్థానం



ప్రతి సంవత్సరం తెలుగు ఉగాదినాడు, తెలుగువారి ఇలవేలుపైన శ్రీవేంకటేశ్వరస్వామికి 'ఉగాది ఆస్థానం' జరుగుతుంది. ఆరోజు ఉదయం మొదటి ఘంట నివేదనానంతరం శ్రీమలయప్పస్వామి దేవేరులతో కూడా సర్వభూపాల వాహనంలో బంగారు వాకిలిముందు వేంచేస్తారు. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారు పక్కన దక్షిణాభిముఖంగా మరొక పీఠంపై వేంచేస్తారు.

విశేషంగా పట్టువస్త్ర సమర్పణ, ప్రసాద నివేదన అనంతరం, అక్షతారోపణ జరిగిన తర్వాత పంచాంగశ్రవణం జరుగుతుంది. ఆనాటి తిథి, వార, నక్షత్రాలతోపాటు సంవత్సర ఫలాలు, దేశకాల వ్యవహారాది పంచాంగ వివరాలను శ్రీనివాసునికి విన్పించడం జరుగుతుంది. చివరిగా కర్పూర నీరాజనాలు జరిగిన తర్వాత తీర్థప్రసాదవినియోగం జరుగుతుంది.

వెనుకచిత్ర కథనం

## శ్రీలక్ష్మీజయంతి

'శ్రీ' అనగా సిరులను కురిపించే 'శ్రీమహాలక్ష్మి' అని అర్థం. పరమ పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుని దేవేరే శ్రీమహాలక్ష్మి.

లక్ష్మి అనగా లాభం, ప్రయోజనం, సంపద, అభివృద్ధి, క్షేమం, యోగం... అని ఆ యా అర్థాల్లో ఋగ్వేదంలో వర్ణింపబడింది.

'లక్ష్మి' అనగా 'గుర్తు' లేదా 'చిహ్నం'. లక్ష్మిగా భాసిస్తుంటుంది కనుక ఆ జగన్మాతకు 'లక్ష్మి' అని పేరు కలిగింది. ఎక్కడ, దేనికి గుర్తుగా నిలిచింది? అనగా అవ్యయుడై ప్రకాశిస్తున్న శ్రీమన్నారాయణుని అవ్యాజమైన 'దయ'కు గుర్తుగా నిలిచింది. అనంతుని అనంతమైన కరుణకు చిహ్నంగా వెలుగొందుతున్నది. సత్యమై నిత్యమై శాశ్వతమై భాసిస్తున్న అచ్యుతుని ఆనందానికి గుర్తుగా ప్రకాశిస్తున్నది. సాక్షాత్తు శ్రీమహావిష్ణుభగవానుని వక్షఃస్థలంలో 'శ్రీవత్సం' అనే చిహ్నంగా భాసిస్తూ, ఆ స్వామివారి అద్భుతమైన, ఆశ్చర్యకరమైన అమృతత్వమైన, అనంతమైన, అప్రమేయమైన దయాగుణానికి, క్షమాగుణానికి, భక్త ప్రియత్వానికి ప్రతీకగా చిరస్థాయిగా, అనపాయినియై నిలిచి ఉంది కనుక ఆ జగన్మాత "లక్ష్మి" అని వేనోళ్ళ కీర్తింపబడుతున్నది.



# రంగుహంగులకేళీ

- శ్రీ జంధ్యాల శరత్‌బాబు, 99483 45013

భక్తితత్త్వం, ఆరాధనత్వం... ఈ రెండింటి సమ్మిశ్రిత రూపమే హోలీ మహోత్సవ అంతరార్థం. ముందుగా మనందరి మదిలో మెదిలేది రాధాకృష్ణుల జీవ, పరమ ఆత్మల విలీనమే! 'ఎంత కారుణ్యమున్నదో యెంచగలనె కమలలోచన నీ కటాక్షముల లోన' అని పలికింది రాధా హృదయం. వారిద్దరిదీ సుమనోహర మనోలాలిత్యం, సుకృత ప్రాభవ వైభవం. అంతటి దివ్యత్వానికి ప్రతీకగా, ఆరాధ్య నీయంగా ఊరూవాడా ఆ బాలగోపాలం నిర్వర్తించుకునే పర్వదినసందర్భమే **'హోలీ'** లోని ఒక కీలకకోణం.

ఊరూరా వచ్చెనమ్మ హోలీ, చెమ్మకేళీ అంటూనే అందరూ పండుగ చేసుకుంటారు. చకచక నర్తనల కేళిగా, రంగేళిగా భావించి చిన్నా పెద్దా కలగలిసి ఆనందోత్సాహాలను కలబోసుకుంటారు. శ్రీకృష్ణపరమాత్మ అనగానే మధుర, బృందా వనక్షేత్రాల దీప్తులు మన మనోనేత్రాల ముందర ప్రత్యక్షమవు తాయి. స్వామిజన్మస్థలిగా పేరొందిన మధురానగరి భక్తజను లందరి పాలిట హనుమత్‌గిరి. మహాభారత, భాగవత కావ్యాలు మధురప్రశస్తిని శతసహస్ర విధాలా కొనియాడాయి. అదేవిధంగా బృందావనం అనేది గోకులానికి పర్యాయం. అక్కడి మంది రానిది శతాబ్దాల చరిత. ఈ నేపథ్యమంతా హోలీ సంరంభంలో గోచరించి భక్తకోటిని తన్మయతలో ముంచెత్తుతుంటుంది.

ఇదంతా రంగుహంగుల పండుగ. వసంతోత్సవ స్ఫూర్తిని మదిమదినా నింపి కాంతిరేఖలను విస్తరించే వాడుక, వేడుక. ఇందులో పైకి ఎంత సందడి కనిపిస్తుంటుందో లోపల అంతకుమించిన ఆధ్యాత్మికజడి నిండి ఉంటుంది. ఇంతింత మహదానందమే సొంతం అయినందున, ఇదీ కలకాలం నిలవాలన్న ఆశాజ్యోతినీ ఉద్దీపింప చేస్తుంటుంది. నింగివంగిందా, నేలపొంగిందా, వర్ణశోభచిందిందా అనేంత తాదాత్మ్యం!

హిందువుల సంప్రదాయాలకు, ధార్మికవిలువల రీతు లకు నిలువెత్తు ప్రతీకలా నిలిచే హోలీ మన భారతదేశంలో, విదేశాల్లోనూ సువ్యవస్థితం. అందరూ ఐకమత్యంగా, ఎటువంటి అంతరాలకూ తావులేకుండా రంగురంగుల పొడినీ రంగునీళ్లనూ చల్లుకోవడం అంటే- వర్ణభరితజీవితాలను కోరుకోవడం. శుభకామనతో కామదహనం ఆచరించడం అనేదీ వినిర్మల భక్తి తత్పరతను ఆహ్వానించడం. హోలీ అనేదే నందనాన పొదరిల్లు, పున్నమి కళల పుట్టినిల్లు. శీతాకాలం చివరన ఈ మార్చినెల రెండోపక్ష ఆరంభాన, పౌర్ణమివేళన ఇది నింగిన విరిసిన హరి విల్లు, ముంగిట కురిసిన సిరిజల్లు. కుటుంబ, బంధుమిత్రుల, ఇరుగుపొరుగుల చల్లచల్లని నవ్వులే అలా అలా రివ్వున ఎగిరే రంగులు! ఉండనే ఉండవు ఏ విధమైన హద్దులూ!!

గోవర్ధన్, నందగావ్, బర్సానా, మరెన్నో ప్రాంతాల్లో సైతం హోలీ సంతోషాలు వెల్లివిరుస్తుంటాయి. కృష్ణ ఆలయ సందర్శనలు, గీతాల ఆలాపనలు, రోజుల పర్యంతం కార్య క్రమాల పరంపరలు కొనసాగుతుంటాయి. జైపూర్ ప్రదేశంలో గజరాజులకు అలంకరణలు ప్రత్యేక ఆకర్షణలుగా భాసిస్తుం టాయి. శాంతినికేతన్ విశ్వవిద్యాలయంలోనైతే ఆటలూ పాటలతో కవితల ఆలాపనలతో అంతా మారుమోగుతుం టాయి. వసంతోత్సవ సంస్కృతి ఎటుచూసినా కానవస్తుం టుంది. ఉదయ్‌పూర్ చుట్టుపక్కలా సంగీతసాహిత్యాల మేళవింపు. అంతా కాంతిమంతమే!

**మార్చి 14న**
**'హోలీ' సందర్భంగా...**



హంపి దేవాలయ ఆవరణల్లో, వెలుపల కూడా సంప్రదాయ కార్యక్రమాల జోరు ధార్మికతను ప్రతిబింబిస్తూ ఉంటుంది. వారణాసినది ఒడ్డున రంగులతో ప్రకాశవికాసాల రంగరింపు. దేశరాజధాని నగరంలో జరిగే వేడుకలు నేత్రానందాన్ని, వీనులవిందుని సరిసమానంగా అందించేవే. అసలు ఈ రోజు ప్రత్యేకత, విలక్షణత ఏమిటన్నది **దశకుమారచరితం, రత్నావళినాటకం** వివరించి ఉన్నవే. వసంతకాలం, సరికొత్త పంటల తరుణం, నూతన ఆశలూ ఆశయాల సమయం హోలీ. పున్నమి పవిత్రత, రంగుల విశిష్టత, సమైక్యతల ఆవశ్యకతను ఇందులోనే చూడగలం.




చంద్రుని గరిష్ఠశక్తిస్థాయి పూర్ణిమలో ఉంటుంది. వెలుగువైపు మేలుకొలుపు అనే భావనా నిబిడీకృతమై వ్యక్తిగత ఎదుగుదలను, సామాజిక అవగాహనారీతులను ప్రతిబింబిస్తుంటుంది. చెడును మంచి, అసత్యాన్ని సత్యం, అధర్మాన్ని ధర్మం జయించిన వైనాన్ని అంతర్గతకథనం మనకు ప్రబోధిస్తుంటుంది. ఉదాహరణకు– దానవరాజు ఉన్మత్తతను నారసింహుడు అణచివేసిన విధానం! దైవశక్తి సదా సర్వదా మహోన్నతం. దుష్టశిక్షణ, శిష్టరక్షణ ఏ లోకంలోనైనా, కాలాన అయినా తథ్యం. చెడు అంతరించినప్పుడే ప్రజలంతా పండుగ చేసుకుంటారు.

**నీలమేఘశ్యామ! నీవె తండ్రివి మాకు కమలవాసిని మము గన్నతల్లి**
**నీ భక్తవరులంత నిజమైన బాంధవుల్ నీ కటాక్షము మాకనేకధనము**
**నీ కీర్తనలు మాకు లోకప్రపంచంబు నీ సహాయము మాకు నిత్యసుఖము**
**నీ మంత్రమే మాకు నిష్కళంకపు విద్య నీ పదధ్యానంబు నిత్యజపము...**

అని నరసింహశతకం ప్రస్తుతిస్తూ ఉంది. దీనిలోని భక్తిభావమే హోలీలోనూ నిక్షిప్తం.

నింగిదాటి పొంగిపోదామా, ముంగిలంతా ముగ్గులు వేద్దామా, రంగుల తెలుపుల పోహళింపులోన ధార్మిక వీథిన విహరిద్దామా అనుకుంటారంతా. ఏ వర్ణానికి అది విశేషం, విశిష్టం. శాంతిని పంచుతుంది తెలుపు. కాంతిని పెంచుతుంది ఎరుపు. భాగ్యాన్ని అందచేస్తుంది పసుపు. అంతా అంతా రంగుల నిలయం. జగమంతా రసమయం అన్నదే ఈ పర్వదిన ఆగమనం లోకానికి ఇస్తూన్న సందేశం. మలుపులు ఉంటాయి, చూసుకుని నడవాలి. మార్గాన్ని మనకు మనమే ముచ్చటగా మలచుకోవాలి. అప్పుడే పురోగతి అంటుందీ సిరిదివ్వెల హోలీ.

ప్రకృతిలోని పరిణామాల మాదిరే మానవాళికి కలతా కోరికలూ. అవి నిరంతరాలు. సరదాలను, సందళ్లను, మురిపాలను, ముచ్చట్లను వెంటపెట్టుకు వచ్చే ఈ ఉత్సవమంటేనే హృదయోల్లాసం, మహోత్తుంగ తరంగనాదం. నేనూ– నా సంతోషం అనేకాకుండా మనమూ–మన ఆనందం అనుకుని ఆచరణకు తెచ్చినప్పుడు సన్నజాజుల వానజల్లు తాకినంత దివ్యానుభూతి మనిషికి కలిగి తీరుతుంది.

హోలీ ముందు రోజున మంటలు వేసి కాముడి పున్నమి చేయడాన్ని జాగృతపథంగా గమనించాలి. హోలిక అనే దానవిని అంతరింపచేసి మంచితనాన్ని పరిరక్షించడాన్ని సత్యవిజయంగా గ్రహించగలగాలి. రాధాకృష్ణుల వినోదక్రీడ వెనుక ఆశావహదృక్పథం ఉండటాన్ని తెలిసి మసలుకోవాలి. రంగులు చల్లుకుని, నీటిలో తడిసిన శరీరాన్ని శుద్ధి చేసుకోవడాన్ని ఆరోగ్యసంరక్షణ కారకంగా అవగతం చేసుకోవాలని ఉపదేశం.

సహజస్వాభావిక రంగులైతే ఔషధసమానాలు. చెట్లవేర్ల నుంచి తీసిన రసాలు, పసుపును రంగరించిన చందనం, మందారాలు, గులాబీరసాల వర్ణాల వంటివి. ఆ కారణంగానే పర్యావరణప్రయోజనమూ హోలీతో సిద్ధిస్తుంది. పండగపూట స్వామిని, దేవిని ఉయ్యాలలో ఉంచి ఊపుతూ భక్తిని చాటి చెప్పడమన్నది నిబద్ధతకు నిదర్శనం. ఇది శివకేశవపర్వదిన సందర్భంగానూ ప్రతీతి. పూజలు, పిండివంటలు, ఆనందోత్సాహాల వెనుక 'భక్తి నిండుగా' అనేదే ప్రధానాంశం హోలికా పూర్ణిమ. వెన్నెలకాంతిలా అగ్నితో పునీత సహానుభూతి పొందడమన్న మాట. వసంత కాలక్రమాన వాతావరణం మెలమెల్లగా వేడికి పరివర్తన చెందుతుంటుంది. లేపనంగా, ఉద్దీపనంగా ఉంచేవి రంగులేనని ప్రసిద్ధి.

భానుడు కాంతినిస్తాడు. వరుణుడు వర్షహర్షాన్ని ప్రసాదిస్తాడు. గాలులు వీస్తాయి. చెట్లు పూలు పూస్తాయి. వీటిల్లో స్వలాభమనేది లవలేశమైనా ఉందా? హోలీ ఉత్సవకృత్యాల్లో తటస్థించేవీ ఈ సూత్రాలనే మనందరికీ పేరుపేరునా బోధిస్తుంటాయి. *'పూలవాన కురిసింది, పుడమితల్లి మురిసింది/మందారం కులికింది, మకరందం చిలికింది/ హోలీ అరుదెంచింది, ఆనందాల వేళగా పరిణమించింది అనిపిస్తుంది ఎవరికైనా!*



పకపక నవ్వె ప్రకృతి, నవ్వుకున్నది బృందావని/ యమున నవ్వి నది, చంద్రుడు నవ్వినాడు' అనే కవిభావన నవ్వులపూలను జనజీవనవనాన వెదజల్లకుండా' ఉంటుందా? రంగులూ నవ్వుతా ఒకటిగా మారిన వేళన నిత్యమూ నవీనోత్సాహమే!

భారత సంస్కృతీసౌధానికి ప్రధాన ఆధారాలు ఇల్లు, కుటుంబం. ఇంటిల్లపాదినీ, ఊరు ఊరంతటినీ ఆనంద సంద్రాన ఓలలాడించే పర్వదినంగా హోలీకి ఎంతైనా విశేషణత్వం ఉంది. వర్ణచిత్రమిళితమైన జీవితానికి వన్నెచిన్నెలు జతకూడే సమయంగా ఈ పండుగ మనందరిదీ, మనలోని ప్రతీఒక్కరిదీ. మనమంతా ఒక్కటే, పర్వదినం అచ్చంగా స్వచ్ఛంగా ఇదే!

## 2025, ఏప్రిల్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 03 -11 | శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవం, వాయల్పాడు |
| 06-14 | శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం, ఒంటిమిట్ట |
| 06 | శ్రీరామనవమి |
| 07 | ధర్మరాజదశమి |
| 10- 12 | తిరుమల శ్రీవారి వసంతోత్సవం |
| 11 | తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి పంగున్యుత్తరం, పూలంగిసేవ, శాలనాచ్చియార్ శాత్తుమొఱ |
| 12 | తుంబురుతీర్థముక్కోటి |
| 14 | తమిళసంవత్సరాది |
| 30 | పరశురామజయంతి, భృగుమహర్షి, శ్రీనివాస దీక్షితులు వర్షతిరునక్షత్రాలు; అక్షయతృతీయ |

మార్చి 26 అన్నమయ్య వర్ధంతి సందర్భంగా

# బ్రహ్మ కడిగిన పాదము

- డా॥ ఎస్.రాధిక

ఆంధ్రవాగ్గేయకారుల్లో ప్రథముడు అన్నమయ్య. కొండల మధ్య పుట్టి, కోనల్లో పెరిగి కొండలరాయునిపై ఎక్కువ భక్తి నిల్పుకొన్నవాడు-అన్నమయ్య. ఆయన దర్శించినవన్నీ వైష్ణవక్షేత్రాలే! దక్షిణభారతదేశ వాగ్గేయకారుల్లో తాళ్లపాక అన్నమయ్యకు ప్రత్యేకస్థానముంది. అన్నమయ్యసంకీర్తనలు భక్తిప్రబోధకమైనవి, శృంగారాత్మకమైనవి, సంగీతప్రాధాన్య మైనవి, నృత్యానికి అనుకూలమైనవి. అన్నమయ్య ఏ దేవుణ్ణి స్తుతించినా అందులో మనకు గోచరించేది ఒకే తత్త్వం, అదే భక్తితత్త్వం!

"ఏ వేల్పు సర్వేశు దేవేల్పు పరమేశు
దే వేల్పు భువనైకహితమనోభావకుడు
యే వేల్పు కడు సూక్ష్మ మేవేల్పు కడు ఘనము
ఆ వేల్పు తిరువేంకటాద్రివిభుడు"

అని తన్మయత్వంతో శ్రీవేంకటేశ్వరుణ్ణి పొగడిన పరమ భక్తశిఖామణి తాళ్లపాకఅన్నమయ్య.

అన్నమయ్యఅవతరణతో ఆంధ్రసాహిత్యమున భక్తి కవిత్వం వెల్లివిరిసింది. అల్పాక్షరాల్లో అనల్పార్థరచన చేసి, వర్ణననైపుణ్యం ప్రదర్శించిన పదకవితాపితామహుడు అన్న మయ్య.

అన్నమయ్యజన్మించినస్థలం కడపజిల్లా రాజంపేట తాలూకాలోని తాళ్లపాకగ్రామం. అదేవారి ఇంటిపేరుగా ప్రసిద్ధి పొందింది. అన్నమయ్యతల్లి లక్కమాంబ, తండ్రి నారాయణ సూరి. ఆ దంపతులకు స్వామి నందకాంశాన జన్మించిన కారణ జన్ముడు-అన్నమయ్య. అన్నమయ్య 1408 నుండి 1503 వరకు జీవించాడు. అన్నమయ్య తిరుమలేశుని వరప్రసాదంతో జన్మించాడు కాబట్టి ఆయన ఆడినమాటెల్ల అమృతకావ్యంకాగా, పాడినపాటెల్ల పరమ గానంగా వర్ధిల్లింది.

మానవజీవితానికి పరమావధి మోక్షం పొందడం. మోక్షం పొందడానికి పెద్దలు భక్తి, జ్ఞాన, కర్మ యోగాలనే నాలుగు రకాల మార్గాల్ని తెలియజేశారు. వీటిలో అందరూ సులభంగా ఆచరించదగింది-భక్తిమార్గం.

వ్యాసుడు శ్రీమద్భాగవతంలో నవవిధభక్తిమార్గాల్ని పేర్కొన్నాడు.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్"

అన్నమయ్య ఆధ్యాత్మసంకీర్తనల్లో ఈవిధమైన భక్తి రీతులు విస్తారంగా కనిపిస్తాయి.

ముఖ్యంగా అన్నమయ్య శ్రీమన్నారాయణునిపాదాన్నే శరణు వేడుతూ-

శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ శ్రీపాదమే శరణు ॥

విష్ణువు లక్ష్మీదేవి ముఖపద్మానికి సూర్యుని వంటి వాడు. పద్మప్రియుడు, పద్మనేత్రుడు, బ్రహ్మకు హితం చేసేవాడు, గరుత్మంతునిపై ప్రయాణం చేసేవాడు, పద్మాన్ని నాభియందు కలిగినవాడు, భక్తజనప్రియుడు, పరమపురుషుడు, పర మాత్ముడు, పరమాణురూపంలో ఉండేవాడని అభివర్ణించాడు.


మహావిష్ణువు దేవతల శత్రువైన బలిచక్రవర్తిని అణచడం కోసం వామనావతారం ఎత్తి, ఒకఅడుగుతో ఆకాశాన్నంతా ఆక్ర మించగా, బ్రహ్మదేవుడు అతని పాదాన్ని భక్తితో కడిగాడు. అలా బ్రహ్మచేత కడగబడిన పాదం- బ్రహ్మమే తానైన పాదం, భూమిని కొలిచిన పాదం, అహల్యపాపాల్ని ప్రక్షాళనచేసిన పాదం, కాళీయుని తలపై పెట్టిన పాదం, లక్ష్మీదేవి ప్రేమతో పట్టిన పాదం, గరుత్మంతునిపై అధిరోహించిన పాదం, భక్తులకు అనేక విధాలుగా మోక్షాన్నిచ్చే పాదం, అని స్వామివారిపాదాన్ని అన్నమయ్య బహువిధాలుగా కీర్తించాడు.

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీ పాదము

భగవంతుని పాదాలకు నమస్కరించిన బుద్ధిమంతు లకు దేహమంతా ఆనందంగా ఉంటుందని -

'నలుగడ దేహానందము బుధులకు
బలునీపాదప్రణామములు'

అనే సంకీర్తనలోను, సర్వేశ్వరుడైన శ్రీమహావిష్ణుపాద పద్మాలపై భక్తి ఎల్లప్పుడూ ఆనందకరమని-'పదానందము సర్వేశ్వరుని, పదారవిందముపై భక్తి' అనే సంకీర్తనలోనూ,



భగవంతునిశిరస్సును పూజించడంలో కొంత అహంకారం ఉంటుందని, ఆ అహంకారం కన్నా స్వామిపాదాల్ని పూజించే నియమం ఎక్కువ అని- ***'చేపట్టి నీ శిరసును పూజించే అహమిక కంటే, నీ పాదాలు పూజించే నేమమెక్కుదు'*** అనే సంకీర్తనలోను వ్యక్తమవుతుంది. అన్నమయ్య తన సంకీర్తనారచన పూర్తి చేసిన తర్వాత స్వామిపాదాలకు అంకితమిస్తూ- ***'దాచుకో నీ పాదాలకు తగ నే జేసిన పూజలివి'*** అని విన్నవించుకుంటాడు. చదువులు వచ్చినా, రాకున్నా స్వామిపాదాలపై అనురక్తే చాలు అంటూ- ***'ఇలఁ జదువులు రానీ యిటు రాక మానని, తలఁపు నీ పాదముల తగులే చాలు'*** అని పేర్కొన్నాడు.

**ఈ పాదమే కదా యిలయెల్లఁ గొలిచినది**
**యీ పాదమే కదా యిందిరాహస్తముల కితవైనది**

భూలోకంలో అందరూ కొలిచినది విష్ణుపాదమే! (ఈ పాదమే) లక్ష్మీదేవి నిరంతరం హరికి సేవ చేసినది. హరిపాదము నుండే ఆకాశగంగ పుట్టినది. హరిపాదమే ఆకాశం అంతటా నిండినది. (కరిరాజు) గజేంద్రుడు ఆర్తితో అరచి స్మరించినది- హరిపాదమే, ఇంద్రాదిదేవతలు అందరూ కొలిచినది ఈ పాదము. హరిపాదము దర్శించడం దుర్లభం. శ్రీవేంకటాద్రిభక్తులకు కోరినవరములు ఒసగేది శ్రీవేంకటేశ్వర నీ పాదమేకదా!

ఒకానొక సమయంలో పరమశివుడు భగవంతుని మహిమను చూచి- 'ఆహా! ఆదిశేషునికి శ్రీనివాసుని కటాక్షము మహాభాగ్యము. అతని సేవకై అనేకనేత్రములు కల్గుట, ఆ అన్ని నేత్రములతో భగవంతుని సౌందర్యమును తనివితీర దర్శించటం- ఈ విధంగా రెండు విధాలా అదృష్టం ఆదిశేషునికి కల్గినది. మూడు నేత్రములు మాత్రమే కలుగుటవలన నాకు ఆ భాగ్యము లేదు. నేను ఈ అభాగ్యమును సహించలేను. మరొక జన్మలోనైనా అటువంటి భాగ్యము కలగాలి' అని విశ్వసించి, తపస్సు చేయటానికి కైలాసపర్వతమునకు పోయెను.

పంచభూతాలలో భూతత్త్వానికి విశేష ప్రాధాన్యం ఉంది. భూమిని హిరణ్యాక్షుడు అధోలోకాలకు తీసుకెళ్లిపోయాడు. అపుడు బ్రహ్మాదిదేవతలు వేడుకుంటే విష్ణువు వరాహ రూపాన్ని ధరించి, హిరణ్యాక్షుని సంహరించి భూదేవిని రక్షిస్తాడు. లోకాలన్నిటిలోకి ఉత్తమమైనది భూలోకం. గాయత్రీ మంత్రంలోకూడా మొట్టమొదట భూలోకప్రస్తావనే ఉంది. భూలోకం స్వామివారిపాదం. ఇప్పటికీ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించేముందుగా పుష్కరిణిప్రక్కనే ఉన్న వరాహస్వామినే దర్శించుకుంటారు. అందుకే దీనికి ఆదివరాహక్షేత్రమని పేరు.

విష్ణువుపాదాలు భూతత్త్వానికి ప్రతీకలు. సర్వసంపదలు భూమినుండే లభిస్తాయి. ఆ భూగర్భంనుంచి లభించేది లక్ష్మి. లక్ష్మీదేవి అంశమైన సీతాదేవికూడా ఆవిర్భవించింది భూమినుండే! విష్ణువునాభి జలతత్త్వానికి ప్రతీక. ఆ జలంనుండి పుట్టినదే తామర. తామరనుండి పుట్టిన బ్రహ్మ సృష్టికి ఆద్య బ్రహ్మ కాబట్టి తాను పుట్టినజలంతో తన తండ్రి అయిన విష్ణువుకు పాదాభిషేకం చేశాడు. అలా వచ్చిందే ఈ **'బ్రహ్మ కడిగినపాదము'**.




# వజ్రాయుధాలు

- శ్రీమతి భమిడిపాటి
బాలత్రిపురసుందరి

దధీచిమహర్షి గొప్ప తపశ్శాలి. ఆ రోజుల్లో వృత్రాసురుడనే రాక్షసుడు దేవతల్ని బాధించడమే కాకుండా వాళ్ల అస్త్రాల్ని తీసుకెళ్లిపోయి యుద్ధానికి అందుబాటులో లేకుండా చేస్తుండేవాడు.

దేవతలకి భయం వేసి దధీచిమహర్షిని కలిశారు. "మహర్షీ! మా అస్త్రాల్ని రాక్షసులు ఎత్తుకుపోకుండా మీ దగ్గర దాచిపెట్టండి!" అన్నారు. ఆయన అందుకు అంగీకరించాడు.

చాలాకాలం గడిచిపోయింది. దేవతలు తిరిగి వచ్చి తమ అస్త్రాల్ని తీసుకెళ్లలేదు. మహర్షి ఇంక వాటిని దాచలేక మింగేశాడు.

కొంతకాలం తర్వాత దేవతలు వచ్చి "మహర్షీ! వృత్రాసురుణ్ని చంపడానికి అస్త్రాలు కావాలి. వాటిని మాకిస్తే మేం వెళ్లిపోతాం!" అన్నారు.

అది విని మహర్షి "దేవతలారా! మీ కోసం చాలా కాలం ఎదురు చూశాను. మీరు రాలేదు. నాకు ఏ కబురూ లేదు. ఇంక వాటిని దాచలేక మింగేశాను!" అన్నాడు.

"ఇప్పుడెలా..?" అన్నారు దేవతలు.

"అవన్నీ కరిగిపోయి నా ఎముకలకి పట్టేశాయి. నన్ను చంపి నా ఎముకలు తీసుకోండి !" అన్నాడు మహర్షి

దధీచిమాటలు విని "అయ్యబాబోయ్! తపస్సంపన్నుడైన ఒక మహర్షిని చంపడమా...? అంతకుమించిన మహాపాపం ఇంకేమయినా ఉందా...?" అనుకున్నారు దేవతలు భయంగా.


"మహర్షీ! మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు మోక్షాన్ని పొందగల వరం ఉంది కదా!" అడిగారు సందేహంగా.

దధీచి ఆలోచించాడు.. దేవతలు చెప్పినట్టు తనకు తానే అగ్నికి ఆహుతి అయితే దేవతలకి బ్రాహ్మణహత్యా పాతకం అంటుకోదు అనుకుని దేవతలకి ఆ విషయం చెప్పాడు.

వెంటనే యోగాగ్ని రగిలించుకుని ఆ అగ్నికి ఆహుత య్యాడు. దేవతలు దధీచి శరీరం నుండి వచ్చిన ఎముకలు తీసుకుని వెళ్లిపోయారు.

వాటితో అస్త్రాలు తయారుచేయించారు దేవతలు. వజ్రాయుధాల వంటి దేవతల అస్త్రాలన్నీ దధీచిఎముకలతో తయారయినవి. వాటితో రాక్షససంహారం జరిగింది.

**పరోపకారం కోసమే ఈ శరీరం!**



పాఠం-35

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

**धातवः   క్రియలు**

**अस् ఉండుట లేక అగుట**

| वर्तमानः | भूतः | आशीराद्यर्थकः | विध्याद्यर्थकः | भविष्यत्कालः |
|---|---|---|---|---|
| ए ब | ए ब | ए ब | ए ब | ए ब |
| प्र- अस्ति-सन्ति | आसीत् - आसन् | अस्तु - सन्तु | स्यात् - स्युः | ‘अस्’ इति धातोः |
| म- असि-स्थ | आसीः - आस्त | एधि - स्त | स्याः - स्यात | ‘भू’ धातोः |
| उ- अस्मि-स्मः | आसम् -आस्म | असानि - असाम | स्याम् - स्याम | भविष्यत्कालः एव न तु अन्यः। |

**कृ - చేయుట**

| वर्तमानः | भूतः | आशीराद्यर्थकः | विध्याद्यर्थकः | भविष्यत्कालः |
|---|---|---|---|---|
| ए ब | ए ब | ए ब | ए ब | ए ब |
| प्र- करोति - कुर्वन्ति | अकरोत्-अकुर्वन् | करोतु - कुर्वन्तु | कुर्यात् - कुर्युः | करिष्यति- करिष्यन्ति |
| म- करोषि - कुरुथ | अकरोः - अकुरुत | कुरु - कुरुत | कुर्याः - कुर्यात | करिष्यसि- करिष्यथ |
| उ- करोमि - कुर्मः | अकरवम् - अकुर्म | करवाणि- करवाम | कुर्याम्- कुर्याम | करिष्यामि- करिष्यामः |

**भू - అగుట, ఉండుట**

| वर्तमानः | भूतः | आशीराद्यर्थकः | विध्याद्यर्थकः | भविष्यत्कालः |
|---|---|---|---|---|
| ए ब | ए ब | ए ब | ए ब | ए ब |
| प्र- भवति - भवन्ति | अभवत् - अभवन् | भवतु - भवन्तु | भवेत् - भवेयुः | भविष्यति -भविष्यन्ति |
| म- भवसि - भवथ | अभवः - अभवत | भव - भवत | भवेः - भवेत | भविष्यसि -भविष्यथ |
| उ- भवामि - भवामः | अभवम् - अभवाम | भवानि - भवाम | भवेयम् - भवेम | भविष्यामि-भविष्यामः |

ఆయుర్వేదం

# ఆరోగ్యపరిరక్షణలో ఆముదం

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

మానవాళి ఆరోగ్యపరిరక్షణకు ప్రకృతి అందించిన గొప్ప ఔషధమొక్క **'ఆముదంచెట్టు'**. ఈ చెట్టు పుష్పగుచ్ఛాలు పులితోకలా ఉండుటచే **'వ్యాఘ్ర పుచ్ఛి'** అని, ఐదువ్రేళ్ళను పోలి చీలికలతో కూడిన పత్రాలు కలిగి ఉండుటచే **'పంచాంగులి'** అని, ప్రకోపించిన వాతదోషాన్ని నిర్మూలించునది కావున ఏరండ అనియు సంస్కృతం పేర్లు కలవు. ఆంగ్లంలో **'క్యాస్టోల్ ఆయిల్ ప్లాంట్'**గా పిలువబడే ఈ మొక్క శాస్త్రీయనామం రిసినస్ కమ్యూనిస్. ఈ ఆముదం చెట్టుని ఎలా ఆరోగ్యానికి సద్వినియోగం చేసుకోవచ్చో తెలుసుకుందాం.

**సుఖ విరేచనమయ్యేందుకు:** రోజూ రాత్రి పడుకునే ముందు 200మి.లీ. నీటిలో 5గ్రా. త్రిఫలచూర్ణం వేసి 50మి.లీ. నీరు మిగిలేలా మరిగించి చల్లార్చి వడగట్టి 5-10మి.లీ. ఆముదం కలిపి సేవిస్తుంటే మలబద్ధకం సమస్యతగ్గి విరేచనం సాఫీగా అవటంతోపాటు మూలశంకవ్యాధి కూడా తగ్గుతుంది.

**నడుం నొప్పి తగ్గేందుకు:** రోజూ ఒకసారి 100మి.లీ. పాలు, 200మి.లీ. నీరు, 5 నలగ్గొట్టిన ఆముదం గింజలు కలిపి 100 మి.లీ. పాలు మిగిలేలా మరిగించి దించి గోరువెచ్చగా ఉన్నప్పుడు వడగట్టి ఆ పాలను సేవిస్తుంటే నడుం నొప్పిలో మంచి సుగుణం కనిపిస్తుంది.

**పచ్చకామెర్లు తగ్గేందుకు:** రోజూ పరగడుపున ఆముదం లేత ఆకులు, నేల ఉసిరి కలిపి మెత్తగా నూరి 100మి.లీ. మజ్జిగలో



ఉసిరిక్కాయ ప్రమాణం ఈ ఔషధాన్ని కలిపి సేవిస్తూ చప్పిడి పథ్యం చేస్తూ తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాన్ని సేవిస్తుంటే కామెర్లు త్వరగా తగ్గుతాయి. మంచి ఆకలి కలుగుతుంది.

**స్థూలకాయం తగ్గేందుకు:** ఆముదం ఆకుల్ని బాగా ఎండించి కాల్చిబూడిద చేసి చల్లార్చి జల్లించి అందులో నాల్గవవంతు ఇంగువ పొడి కలిపి ఉంచుకుని ఉదయం, రాత్రి ఆహారానికి 15నిమిషాల ముందు పూటకు ఒక గ్రాము పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తుంటే దేహంలో సంచితమైన అధిక క్రొవ్వు కరిగి ఆరోగ్యం చేకూరుతుంది. (**సూచన:** ఇంగువ ముక్కల్ని కొద్దిగా నెయ్యి చేర్చి వేయించి చూర్ణం చేసుకోవాలి.)

**వాతనొప్పులకు పట్టు:** తగినంత ఆముదం తీసుకొని అందులో సగ భాగం వాము పొడి, తగినన్ని నీళ్ళు పోసి వుడికించి గోరువెచ్చగా ఉన్నప్పుడు పట్టీలా వేసి ఒకట్రెండు గంటలాగి కడిగేస్తుంటే శీఘ్రంగా ఫలితం కలుగుతుంది.

**ఆనెలకు:** రోజూ ఒకసారి అర టీ స్పూన్ ఆముదంలో 10చుక్కల జిల్లేడు పాలు కలిపి రంగరించి ఆనెలపై పట్టించి ప్లాస్టర్ వేస్తుంటే సుగుణం కనిపిస్తుంది.

**సయాటిక తగ్గేందుకు:** రోజూ రాత్రి పడుకునేటప్పుడు 100మి.లీ. పాలు, 100మి.లీ. నీరు, 5-10మి.లీ. ఆముదం కలిపి పాలు మాత్రమే మిగిలేటట్లు మరిగించి దించి గోరు వెచ్చగా ఉన్నప్పుడు త్రాగుచుంటే సయాటిక అనే వ్యాధిలో కలిగే నొప్పి, పోటు, బాధలు త్వరగా తగ్గుతాయి.

**దురదలకు:** ఒక పాత్రలో 100గ్రాముల చొప్పున వేపాకు, ఆముదం, నువ్వులనూనె, నెయ్యి, 25గ్రాముల ఏలకుల పొడి కలిపి వేపాకు నల్లగా అయ్యేంత వరకు వేడి చేసి దించి చల్లార్చి మెత్తగా నూరి నిల్వ ఉంచుకుని రోజు ఒకట్రెండు సార్లు లేపనం చేస్తుంటే ఆయా భాగాల్లో దురదలు శీఘ్రంగా తగ్గుతాయి.

**పసిపిల్లల్లో మలబద్ధత తగ్గేందుకు:** తమలపాకుపై ఆముదం పూసి వెచ్చచేసి పిల్లల ఉదర భాగంపై కొద్దిసేపుంచుతుంటే ఆ ఇబ్బంది తొలగిపోతుంది.

**స్ట్రెచ్‌మార్క్స్ తగ్గేందుకు:** ఆముదం, కలబంద గుజ్జు సమానంగా కలిపి ఆముదం మాత్రమే మిగిలేలా మరిగించి దించి చల్లార్చి నిల్వ ఉంచుకుని రోజు ఒకసారి ఈ తైలంతో ఆయా భాగాలపై మర్దన చేస్తే స్ట్రెచ్‌మార్క్స్ తగ్గుతాయి.

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ఈ రాశివారికి శుక్రుడు మిశ్రమఫలితాలనిస్తాడు. నూతనపెట్టుబడులు, వ్యాపారాలకు అవకాశం ఉంది. సమస్యలను పరిష్కరించుటకు రాజీపడుట మంచిది. వాస్తవదృష్టితో పరిశీలిస్తే సమస్యలకు పరిష్కారం వస్తుంది.



**వృషభం–** అప్పులనుండి విముక్తి, ఆర్థికంగా స్థిరత్వం, మీరు అనుకున్నది అనుకున్నట్లు సాధిస్తారు. మీ కీర్తి పెరుగుతుంది. భూమి కొనుగోలు చేసే ప్రయత్నానికి శ్రీకారం చుడతారు. ఇల్లు కొనడానికి అవకాశాలు మెరుగవుతాయి.



**మిథునం–** ధనాన్ని అధికంగా ఖర్చు చేస్తారు. ఆర్థికంగా ఇబ్బందులుపడే అవకాశం ఉంది. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. ధ్యానయోగం ద్వారా ఉపశమనం పొందండి.



**కర్కాటకం–**ఈ కాలంలో ఉద్యోగ, వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. సమాజంలో మీ హోదా మరియు గౌరవం పెరుగుతాయి. కుటుంబవిషయాలు సంతృప్తికరంగా ఉంటాయి.



**సింహం–** శ్రద్ధచేసి చదివి పరీక్షలలో విజయం సాధిస్తారు. స్వయంవృత్తులవారికి అనేకరకాలుగా లాభాలు ప్రోత్సాహకాలు వస్తాయి. మీ స్నేహితులు, సలహాదారులు మరియు పెద్దలు మీకు విలువ ఇచ్చి మంచిగా వ్యవహరిస్తారు.



**కన్య–** ప్రయాణంలో సమస్యలు, ఖర్చులు అధికమవుతాయి. మీరు మీ జీవితభాగస్వామికి మరియు పిల్లలకే సమయం కేటాయించండి. ఎదుటివారితో మాట్లాడేతీరు మెరుగుపరచుకోండి.



**తుల–** ఆదాయవనరులు పెరుగుతాయి. ఇతర దేశాలకు వెళ్ళే ప్రయత్నాలు కలిసివస్తాయి. పిల్లల చదువుల విషయంలోనూ ఉత్సాహకరమైన వాతావరణం ఉంటుంది. ఉద్యోగంలో పదోన్నతి వస్తుంది.



**వృశ్చికం–** తాత్కాలికంగా తక్కువసమయంలో లాభాలు వచ్చే వ్యాపారాలు చేస్తారు. స్టాక్ మార్కెట్, షేర్లవ్యాపారాలలో ఆచితూచి వ్యవహరిస్తూ, ధనం వెచ్చించండి.



**ధనుస్సు–** విద్యావిషయాలలో శ్రద్ధ అవసరం. చదువుల్లో క్రమేపీ రాణిస్తారు. శోభాయమానంగా, వాక్చాతుర్యంతో ఆధునికసమాచారం, నవీనవిషయపరిజ్ఞానంతో అందరినీ ఆకట్టుకుంటారు.



**మకరం–**గృహమున సంతానం విషయంలో శుభ వార్తలు వింటారు. జీవనం ఆనందమయంగా ఉంటుంది. దూరప్రాంతాలకు వెళ్లవలసి వస్తుంది. విదేశీప్రయాణాలు కలిసివస్తాయి. స్నేహితుల తోడ్పాటు మీకు ఉంటుంది.



**కుంభం–** గృహోపకరణాలు, అలంకరణవస్తువులు, రత్నాలు మరియు ఆభరణాల కొనుగోలు కోసం మీ డబ్బును ఖర్చు చేసే అవకాశం ఉంది. సంగీతంపట్ల అభిరుచి ఆసక్తి పెంచుకుంటారు. విందువినోదాలలో పాల్గొంటారు.




**మీనం–** స్వీయనియంత్రణ విధించుకుని ఇతరులతో సత్సంబంధాలు మెరుగుపరచుకుంటారు. వివాహవిషయాలలో భావోద్వేగానికి గురికాకండి. ఈ రాశిలోని విద్యార్థులు ఫార్మసీ, వైద్యవిద్యకు సంబంధించిన చదువులలో ప్రావీణ్యత గడిస్తారు.

చిత్ర కథ

# అదివో.. అల్లదివో...!

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

శ్రీహరి ఖడ్గం పేరు నందకం. ఆ ఆయుధం అంశతో అన్నమయ్య జన్మించాడు.
బాల్యంలో ఆయన పాటలు పాడుకుంటూ ఊరకే ఊరంతా తిరుగుతున్నాడు. ఒకనాడు తండ్రి...










భక్తులు పిలిచిన వెంటనే అమ్మ పలుకుతుందని తెలుస్తుంది.

# బాలవినోదం

## సంఖ్యలను కలిపి రంగులు వేయండి



## చిత్రాన్ని చూడండి



రంగులు వేయండి






అ) లక్ష్మీజయంతి
ఆ) ఉగాదిపచ్చడి
ఇ) హోలిపండుగ

పైన చెప్పిన పర్వదినాలకు సంబంధించి తగినట్లుగా వృత్తంలోని సంఖ్యలను వ్రాయండి.

ప్రతి పర్వదినాలకు సంబంధించిన చిత్రాలను కనుగొనండి.

జవాబులు:
అ) 2, 5, 7, 9
ఆ) 3, 4, 8, 10
ఇ) 1, 6, 11, 12



శ్రీకృష్ణుడు వేసే రంగు నుంచి గోపిక ఎలా తప్పించుకున్నదో కనుక్కోండి!



## భక్తివాక్యం


క్రింది అక్షరాలను సరిచేసి వాక్యంగా అమర్చండి...

| | | |
|---|---|---|
| గ్రే | వ | క |
| స | రా | క్షి |
| తే | ల | |

కరాగ్రేవసతే లక్ష్మి

- జవాబు

చక్రంలో అదే రంగులో ఉన్న ప్రశ్నకు తగిన సమాధానం వ్రాయండి!!







జవాబులు:

ధనలక్ష్మి, ఉత్తరఫల్గుణి, విజయలక్ష్మి, వీరలక్ష్మి, ధాన్యలక్ష్మి, శ్రీమన్నారాయణ, విద్యాలక్ష్మి, గజలక్ష్మి




## ఇక్కడ ఇచ్చిన ధనస్సుతో సరిపోయే బాణాల వరుసను జతచేయండి




జవాబులు

1=iv, 2=i, 3=ii, 4=iii, 5=v

## చిత్రాన్ని చూసిన వెంటనే జవాబు మీ చేతిలో...!






చిత్రాన్ని చూసిన వెంటనే మన రాష్ట్రంలో జరిగే తెలుగు నూతన సంవత్సర పండుగ ఏది?

జవాబు - ఉగాది



విశ్వదాభిరామం          వేమన పద్యసూక్తి



# ఉపయోగపడని దానం

మొండివాని కేల ముంజేతి కడియాలు?
తొట్టివాని కేల కర్ర పండ్లు?
గాడిదలకు నేల గడ్డముల్ మీసముల్?
విశ్వదాభిరామ వినుర వేమ!

**అర్థాలు:** మొండి= చేతులు లేనివాడు; ముంజేతి కడియాలు= చేతులకు ధరించే కంకణాలు; తొట్టివాడు= పండ్లు అన్నీ ఊడిపోయినవాడు..

**భావం:** చేతులు లేనివానికి ముంజేతికడియాలు అవసరము లేదు. తొట్టివానికి కఱ్ఱతో కట్టిన పండ్లెందుకు? పౌరుషసూచకములైన గడ్డము మీసములు గాడిదల కెందుకు?

**వివరణ:** చేతులు లేనివాడు అంటే అసలు చేతులే లేకపోతే ముందరి చేతులకు ఆభరణాలు ఎక్కడ పెట్టుకుంటాడు? వానికి కడియాలు అనవసరం.

ఒకటి రెండు పండ్లు ఊడినవాడు ఆ స్థానం ఉపకర్రపండ్లు పెట్టుకోవచ్చు. నోరంతా తొట్టి అయినప్పుడు కర్రపండ్లు నిలువవు.

బరువులు మోసేగాడిదకు గడ్డాలూ మీసాలూ అనవసరం. గడ్డాలూ మీసాలూ పురుషలక్షణాలు. పౌరుషానికి గుర్తులు. చాకివాడిదగ్గరనుండి అందరికీ బరువులు మోస్తూ సేవలు చేసే గాడిదకు మీసాలూ గడ్డాలూ ఉండడంవలన గౌరవం రాదు. ఎవరికి ఏ వస్తువులు ఉపయోగపడవో వాటిని ఇవ్వడం, లేదా వారు కోరుకోవడం తగదు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## భాస్కరశతకం

### దురాత్ముడు నిష్కారణంగా అపకారం చేయుట

ఊరక సజ్జనుం డొదిగి। యుండిననైన దురాత్మకుండు ని
ష్కారణ మోర్వలేక యప। కారము చేయుట వాని విద్యగా;
చీరెలు నూఱు టంకములు। చేసెడి వైనను బెట్టె నుండగాఁ
జేరి చినింగి పోఁగొఱుకు। చిమ్మటకేమి ఫలంబు భాస్కరా!



**తాత్పర్యం**

భాస్కరా! మంచివాడు ఊరకనే ఉన్నప్పటికిని, చెడ్డవాడు ఏ కారణము లేకుండానే ఓర్వలేనితనముతో అపకారము చేయును. నూరుటంకముల విలువైన వస్త్రములు పెట్టెలో జాగ్రత్తగా ఉన్నప్పటికిని చిమ్మట తనకు ఏ లాభము లేకపోయినను కొరికి చింపును.

– వ్యాఖ్యాత: శ్రీ పి.వి.కె.ప్రసాదరావు

## జనవరి నెల క్విజ్-30 సమాధానాలు

01) ముక్కోటిఏకాదశి
02) 'భుగ్'
03) స్మరణం
04) వెయ్యి ఏనుగులు
05) ముగ్గులు
06) సంక్రాంతి
07) శనిదేవుడు
08) పూలదండ
09) శ్రీకృష్ణదేవరాయలు
10) శ్రీనివాసుడు
11) గజాసురుడు
12) దుందుమారుడు
13) కాశీ
14) సుకన్య
15) మంత్రాలు
16) జయ-విజయ
17) పురందరదాసు
18) హరిదాసులు
19) యమదేవుడు
20) కుబేరుడు

సరైన సమాధానాలు వ్రాసినవారు–

01) పులికంటి చైత్ర, హన్మకొండ
02) సి.హెచ్.చిన్మయి, పోచారం
03) బలివాడ సాధ్విక, రెడ్డిపేట
04) బి.శివప్రణీత్, హిందూపురం
05) కాసారపు హర్షిత్ కుమార్‌గౌడ్, సిరిసిల్ల
06) బి.రవిశంకర్, బెంగుళూరు
07) జి.కుశల్‌కృష్ణ, తిరుపతి.

# క్విజ్ 32

01) శంఖాసురునికి మరొకపేరు? జ)............

02) ఏ పురాణం మంచి ఫలితానిస్తుంది? జ)............

03) ప్రకృతిలో మార్పు, చేర్పులు దేనిననుసరించి వస్తాయి? జ)............

04) విశ్వానికి నివాసకల్పనకారకుడు ఎవరు? జ)............

05) త్రేతాయుగంలో సుప్రసిద్ధ మహారాజు ఎవరు? జ)............

06) వృషభాసురుడు ఏ మంత్రోపాసకుడు? జ)............

07) ముకుందమాలను పెరుమాళ్ తిరుమొళి గ్రంథాలను రచించివారు? జ)............

08) వేదం ఎవరికి అద్దం? జ)............

09) వేదరూపుడు ఎవరు? జ)............

10) ఆదిశంకరులు లక్ష్మీకటాక్షం కొరకు చేసిన స్తోత్రం? జ)............

11) కమలాసనీ అంటే దేనికి సూచిక? జ)............

12) దేవలమహర్షి ఎవరి కుమారుడు? జ)............

13) దేవలమహర్షి శపించిన గంధర్వుడు? జ)............

14) కాంచీపూర్ణులని ఎవరిని అంటారు? జ)............

15) కాళిచ్చీరామవిణ్ణగరంలో వెలసిన భగవంతుని ఉత్సవమూర్తి పేరు? జ)............

16) వేదనారాయణస్వామి కొలువై ఉన్న క్షేత్రం? జ)............

17) ప్రకృతికి సంబంధించిన పండుగ? జ)............

18) భక్తితత్త్వం-ఆరాధనత్వంల మిశ్రితరూపం? జ)............

19) విష్ణుపాదాలు దేనికి ప్రతీకలు? జ)............

20) ఆకాశం అంతా నిండినది? జ)............

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-03-2025**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ............ వయస్సు: ............

పాఠశాల: ............ తరగతి: ............

పేరు: ............

చిరునామా: ............

............

............

............ పిన్‌కోడ్: ............

ఫోన్ సంఖ్య: ............

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి.ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2. కావలసినభాష :**

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3. సంవత్సరచందా : ☐ రూ.240/-**

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-**

**5. చందా పునరుద్ధరణ :**

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6. చెల్లించిన మొత్తం :**

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.................................................... తేది :..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 110



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)చదువులతల్లి(4); 3)శ్రీవేంకటేశ్వరస్వామి ఉన్న గుడి(6); 4)శివునిగూర్చి అర్జునుడు తపస్సు చేసి పొందిన అస్త్రం(4); 5)ఈ పక్షి మీద శ్రీరాముడు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు(2); 7)ఈ ఉగాది పేరు(4); 9)వసంతఋతువు రాగానే కోయిల ఈ చెట్టు చిగురును తింటుంది (5); 13)ప్రీతియనువాని పుత్రుడు(4); 14)ఒక రాగము పేరు(2); 15)దేవయాని పరిచారిక(3); 17)స్వప్నం(2); 19)వసంత ఋతువురాగానే ఈ పక్షి కూస్తునే ఉంటుంది(3)

**నిలువు** 1)ఏడుకొండలు(5); 2)ఈ నది ఒడ్డున కాళహస్తి క్షేత్రం కలదు(4); 3)ఫాల్గుణశుద్ధ ఏకాదశి(4); 4)ఫాల్గుణ కృష్ణ ఏకాదశి(6); 6)ఈక్షేత్రంలో బ్రహ్మ విష్ణువును గూర్చి అశ్వమేధయాగము చేసెను(2); 8)శ్రీవేంకటేశ్వరుని మెడలో పూలమాలగా మారిన భక్తురాలు(6); 10)అర్జునుడికి గల మరో పేరు(4); 11)పంద్రెండవ మనువు(5); 12)ఉగాది నుండి ఈ ఋతువు ప్రారంభమౌతుంది(4); 16)కర్దమప్రజాపతి కుమార్తె(2); 18)ఒక అప్సరస(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., P.G. Dip. in Ephigraphy, Dip. in Yoga on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



19-01-2025న తి.తి.దే. తరపున అయోధ్య శ్రీరాముడికి ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు గారు సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో తి.తి.దే. ధర్మకర్తలమండలి సభ్యులు శ్రీ జి.భానుప్రకాష్ రెడ్డి, హెచ్.డి.పి.పి.కార్యదర్శి, శ్రీ శ్రీరామ్ రఘునాథ్, శ్రీవారి ఆలయప్రధాన అర్చకులు శ్రీవేణుగోపాలదీక్షితులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.




15-01-2025న తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానముల పరిపాలనా భవన ప్రాంగణం మైదానంలో వైభవంగా జరిగిన 'శ్రీగోదాదేవి కల్యాణమహోత్సవ' దృశ్యం



19-01-2025న తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసి వార్డులను పరిశీలిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., మరియు సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారలు.



27-01-2025న తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించి, టౌన్‌ప్లానింగ్ అధికారులను భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని తగిన సూచనలిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., సంయుక్తకార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం,ఐ.ఏ.ఎస్., గారలు. వీరి వెంట తి.తి.దే. చీఫ్ పి.ఆర్.ఓ. శ్రీ టి.రవి మరియు ఇతర అధికారులు ఉన్న దృశ్యం.



26-01-2025న తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానముల పరిపాలనా భవన ప్రాంగణం మైదానంలో జరిగిన 'గణతంత్ర దినోత్సవ' వేడుకల్లో గౌరవవందనం స్వీకరిస్తున్న తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,



02-02-2025న తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తలమండలి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన దేవదాయశాఖ కమీషనర్ శ్రీ కె.రామచంద్రమోహన్ గారికి శ్రీవారి ప్రసాదాలను అందజేస్తున్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., గారు

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams Printing on 25-02-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.



శ్రీలక్ష్మీజయంతి

(14-03-2025)